# తిరుమలేశుడి దర్బార్

(శ్రీవేంకటేశ్వరుడి వ్యాస సంపుటి)


**రచన**

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

కన్సల్టెంటు, ప్రచురణల విభాగం

తి.తి.దేవస్థానములు, తిరుపతి.



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2017**

# TIRUMALESUDI DARBAAR

**(Sri Venkateswarudi Vyasa Samputi)**

*by*

**Julakanti BalaSubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1270
© All Rights Reserved

*First Print : 2017*

*Copies :* 500

*Published by*
**Sri ANIL KUMAR SINGHAL** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

## ముందుమాట

**శ్లో॥ భవాబ్ధితారం కటివర్తిహస్తం**
**స్వర్ణాంబరం రత్నకిరీటకుండలమ్**
**ఆలంబి సూత్రోత్తమ మాల్యభూషితం**
**నమామ్యహం వేంకటశైలనాయకమ్.**

"ఆ స్వామి అద్భుతమైన దేవుడు! తనను శరణువేడితే చాలు. అగాథమైన సంసార సముద్రాలను నడుములోతు మాత్రమే చేస్తూ సులభంగా దాటిస్తాను – అంటూ నడుము మీది చేత్తో చూపిస్తుంటాడు. బంగారు పట్టువస్త్రాలతో, అనేక రత్నాభరణాలతో, వజ్ర కిరీటంతో అందంగా, ఆనందంగా దర్శనమిస్తుంటాడు. ఇంకా నాభివరకు వేలాడుతున్న బంగారు యజ్ఞోపవీతంతో, హారాలతో విరాజిల్లుతున్న శ్రీవేంకటశైలనాయకుడికి భక్తితో ప్రణామాలర్పించుదాం".

సాటిలేని మేటి దేవుడు శ్రీవేంకటాచలపతి. ఆ స్వామివారికి భక్తులే పరమార్థం. భక్తులతోడిదే లోకం. ఆ స్వామివారిని మించిన భక్తప్రియుడు 'న భూతో న భవిష్యతి'. ఆ శ్రీనివాసభగవానుడు నిలిచిన మహాసంస్థానమే శ్రీవేంకటాచల దివ్యక్షేత్రం! కనుకనే "వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించిన" అనే ప్రసిద్ధిని పొందింది.

శ్రీమహావిష్ణువు సాక్షాత్తుగా వైకుంఠం నుండి దిగి వచ్చి, ఈ భూలోకంలో ఇక్కడ కొలువుదీరి ఉన్నాడు, అందువల్లే తిరుమల 'భూలోక వైకుంఠం'గా ప్రసిద్ధిని పొందింది.

తిరుమలేశుడు కొలువుదీరియున్న ఈ **"దర్బార్"**లో ఎటువైపు పరికించినా ఆశ్చర్యం కలుగుతుంది. దేన్ని పరిశీలించినా ఆనందం కలుగుతుంది.

ఆ స్వామివారు కొలువై వున్న 'బంగారు ఆనందనిలయం, ఆయనకు అలంకరించే అద్భుతమైన అమూల్యమైన నగలు, నవరత్నహారాలు, నిర్వహింపబడుతున్న షట్కాలపూజలు, నివేదింపబడుతున్న కమ్మని ఆరగింపులు, జరుపబడుతున్న ఉత్సవాలు, ఊరేగింపులు... ఇలా ఎన్నో ఎన్నెన్నో.. అవన్నీ ఆనందఆశ్చర్యకారకాలే కాక, సంపూర్ణభక్తి ప్రేరకాలు కూడ.

నిత్యం భక్తులందరికి ఆనందానుభూతులను పంచుతున్న తిరుమలేశుణ్ణి గూర్చి అనేక కోణాల్లో, అనేక విధాలుగా ఆవిష్కరించి ఆసక్తికరంగా అనేక రచనలు చేస్తున్న శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు నిజంగా ధన్యులు. అంతేగాక వీరి గ్రంథాలు అన్నీ తిరుమల స్వామివారివే కావడం, తి.తి.దేవస్థాన ఇతర ఆలయాలను గురించే కావడం మరో విశేషం! ఆ కోవలోనే ప్రస్తుతం వారు అందిస్తున్న గ్రంథం **"తిరుమలేశుడి దర్బార్".**

తిరుమలేశుడి దర్బార్‌లో ఆ యా ప్రత్యేక సందర్భాల్లో జరిగే ఉత్సవాలను, ఊరేగింపుల విశేషాలను సరళంగా తెలియజేస్తున్న ఈ **"వ్యాససంపుటి"**ని కూడ దేవస్థానం, ప్రచురించి అందిస్తున్నది. తిరుమలేశుని భక్తులు ఈ గ్రంథాన్ని కూడ అందుకొని శ్రీనివాసుని ఉత్సవ విశేషాలను గూర్చి అవగాహన చేసికొని తరించగలరని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# కృతజ్ఞతాంజలి

శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఒకే ఒక్కసారి మనసారా స్మరిస్తే చాలు! ఒకే ఒక్క మాటలో కీర్తిస్తే చాలు! ఒకే ఒక్క క్షణం కన్నులారా, ఆ స్వామిని దర్శిస్తే చాలు చాలు! మోక్షం సిద్ధిస్తుంది. ముక్తి కలుగుతుంది. ఇంతకంటె మరో సాధనే అక్కర్లేదు. ఎలాంటి కఠిన నియమాలు అసల్లేవు.

కృతయుగంలో పదేండ్లపాటు, త్రేతాయుగంలో ఒక ఏడాదిపాటు, ద్వాపరయుగంలో ఐదునెల్లపాటు కఠిన నియమాలతో సాధనలు చేసినవారికంటె ఈ కలియుగంలో ఒకేఒక్క క్షణంపాటు శ్రీవేంకటేశుణ్ణి దర్శించినవారికి కోటిరేట్లు అధికంగా పుణ్యం కలుగుతుంది. ఇందులో ఎలాంటి సందేహం కాని, సంశయం కాని అవసరం లేదు. అంతేకాదు, ఎలాంటి దానధర్మాలు చేయని వాళ్లైనా, ఎలాంటి వ్రతాలు ఆచరించని వాళ్లైనా, ఎలాంటి తపస్సులు, యాగాలు చేయనివాళ్లైనా సరే ఘనవేంకటేశుణ్ణి ఒకే ఒక్కక్షణం స్మరిస్తే చాలు. వాళ్ల జన్మలు ధన్యం అవుతాయి.

అలాంటి దేవదేవుణ్ణి, అడుగడుగు దండాలవాణ్ణి, ఆపద్బాంధవుణ్ణి పిలిచిన వెంటనే పలికే దేవదేవుణ్ణి గూర్చి **"తిరుమలేశుడి దర్బార్"** అనే చిన్న పుస్తకాన్ని సమర్పించుకుంటున్నాను. ఇందులో "నిత్యకల్యాణ చక్రవర్తి" శ్రీవేంకటేశ్వరుని గూర్చిన 18 వ్యాసాలు ఉన్నాయి. అన్నీ ఆ యా ప్రత్యేక సందర్భాల్లో శ్రీనివాస భగవానునికి జరిగే ఉత్సవ విశేషాలను గూర్చి తెలుపుతున్నవే. ఈ వ్యాసాలన్నీ తి.తి.దేవస్థానం "సప్తగిరి" పత్రికల్లో ప్రత్యేకవ్యాసాలుగా ప్రకటించబడి భక్తపాఠకుల విశేషమైన ఆదరాభిమానాలను చూరగొనబడినవే.

వీటిని ఒక పుస్తకంగా ముద్రించాలనే నా యీ ప్రయత్నాన్ని అనుమతించిన సహృదయులు, శ్రీనివాసుని పరమభక్తులు, నిరంతరం పరిపాలనా నిమగ్నులు, తి.తి.దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్ I.A.S. గారికీ, నిరంతరం పరిపాలనామగ్నులు, సాహితీప్రియులు మీదు మిక్కిలి శ్రీనివాసుని రచనలను ప్రోత్సాహపరుస్తూ,

నా యీ **"తిరుమలేశుడి దర్బార్"** పుస్తకం దేవస్థానం ప్రచురణగా ఆమోదించిన సహృదయ భక్తవరేణ్యులు దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోలభాస్కర్ I.A.S. గారికీ, నా భక్తిపూర్వక నమస్కారాలు.

గత రెండేండ్లుగా 'సప్తగిరి' మాసపత్రికను పర్యవేక్షించి, నా వ్యాసాలను శ్రీనివాసుని విశేష ఉత్సవ సందర్భాల్లో ప్రత్యేక వ్యాసాలుగా ప్రచురింపజేసిన సాహిత్యాభిలాషులు, సహృదయులు ప్రస్తుతం ప్రాజెక్టుల ప్రత్యేకాధికారిగా ఉన్న శ్రీనందివెలుగు ముక్తేశ్వరరావు I.A.S. గారికీ, సాహితీవేత్తలు రచయితలు, ఆత్మీయమిత్రులు 'సప్తగిరి' ప్రధానసంపాదకులు డా॥కోటపాటి రాధారమణగారికీ, ఉపసంపాదకులకందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

**"తిరుమలేశుడి దర్బార్"** అనే ఈ పుస్తకాన్ని దేవస్థానం ప్రచురణగా వెలువరించడంలో అభ్యర్థించిన వెంటనే అభినందిస్తూ ఆమోదింపజేసిన సాహితీవేత్తలు, పండితులు, దేవస్థానం ప్రచురణలవిభాగం ప్రత్యేకాధికారి డా॥ తాళ్లూరి ఆంజనేయులు గారికీ, ఈ పుస్తకం తయారీలో అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణలశాఖ ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్య గారికీ,

ఈ పుస్తకాన్ని ముద్రణకు సిద్ధంచేసిన, ప్రత్యేకాధికారి కార్యాలయం డి.టి.పి. సిబ్బందికీ, అందంగా కవర్ డిజైన్ చేసిన టి.టి.డి ఆర్టిస్ట్ శివశ్రీ గారికీ, ముచ్చటగా ముద్రించిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ డా॥ టి.రవి P.R.O గారికీ నా కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

ఇలా ఈ "అక్షర సుమం" ఆనందనిలయుడి పాదపద్మాలపై సమర్పణ చేసుకొనే భాగ్యం కలిగించిన ఎందరెందరో... వారందరికీ మరొక్కమారు వినమ్రంగా కృతజ్ఞతాంజలులు.

**శ్రీహేమళంబి, శ్రావణం**
**శ్రీగోకులాష్టమి**
**15.08.2017**

**రచయిత**
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

# ఇందులో...


1. తిరుమలేశుడి ఉగాది దర్బార్! 1
2. తిరుచాన శ్రీ అలమేలుమంగ! 11
3. తీర్పు కోరిన తిరుమలేశుడు 29
4. ఆనంద నిలయంలో ఆండాళ్ పాశురాల పారాయణ 34
5. మార్కండేయుని వేంకటాచలయాత్ర 42
6. సప్తర్షులు దర్శించిన సప్తగిరీశుడు 49
7. తిరుమల దర్శనం కంటే ముందు.... 60
8. అన్నమయ్య ఆకలి తీర్చిన అలమేలుమంగ! 66
9. శేషాద్రీశుని సేవలో.. శేషాంశ సంభూతుడు!! 72
10. పరమపుణ్యధామమూ... ఉత్తరద్వారదర్శనము!! 80
11. మహిమల కొండ 85
12. తెప్పలపై కోనేటిరాయుడు 90
13. సప్తగిరులలో సూర్యజయంతి 95
14. పదినాళ్లూ పండుగలే! 100
15. చరిత్రపుటలలో శ్రీనివాసమంగాపురవైభవం 105

16. శ్రీహయగ్రీవావతారం 117

17. శ్రీ కోదండరామస్వామి ఆలయం – చంద్రగిరి 125

18. పావన కృష్ణాతీరంలో పరమగురువులు 129

19. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి సాక్షాత్కార వైభవోత్సవం, శ్రీనివాసమంగాపురం 138

20. ఆనందనిలయుని... ఆణివర ఆస్థానం 146

# 1. తిరుమలేశుడి ఉగాది దర్బార్!

దేవదేవుడైన ఆ విష్ణుభగవానుడు శ్రీవైకుంఠం నుంచి భువికి దిగివచ్చాడు. వస్తూ వస్తూ ఆ వైకుంఠంలో ఉండే కొండల్నీ, కోనల్నీ, తీర్థాల్ని తెప్పించుకొన్నాడు. ఉభయదేవేరులు శ్రీదేవి, భూదేవులతో పాటు సేవకులైన గరుడభగవానుడు ఇత్యాది పరివారంతో పాటు భూలోకానికి తరలివచ్చాడు.

ఇదిగో! ఆ స్వామి ఇక్కడ, ఈ భూలోకంలో ఏరి కోరి తెలుగువారి ఇల(నేల)లో, ఇల్లుగట్టుకొని, తెలుగువారి ఇలు (ఇంటి) వేలుపుగా కొలువయ్యాడు. అందుకే, వైకుంఠంలోని ఆ మహాసంస్థానం, ఇక్కడ భూలోక వైకుంఠంగా, దివ్యధామంగా విరాజిల్లుతూ ఉంది. ఇక్కడ ఒక్కమాట!

శ్రీవేంకటభగవానుడు శ్రీవైకుంఠం నుండి దిగివచ్చిన నాటి నుండీ, 'గోపీనాథ దీక్షితులు' అనే తెలుగు అర్చకస్వాములు ప్రాచీనమైన వైఖానసాగమశాస్త్రం ప్రకారం అర్చనలు, ఉత్సవాలు నిర్వహించాడు. ఆనాటినుండి ఆ వైఖానసదీక్షితులవారి వంశీయులే పరంపరానుగతంగా నేటికీ తిరుమలపరంధామునికి అర్చనాది పూజావ్యవహారాలను నిర్వహిస్తున్నారు.

తెలుగువారి ఇలువేల్పు అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి తెలుగువారి సంప్రదాయం ప్రకారంగా, ఉగాది పండుగనాటి నుండి ఉత్సవాలు, ఊరేగింపులు ప్రారంభమై మళ్లీ ఉగాది ముందు రోజుకు పూర్తవుతాయి.

తిరుమలలో ఉగాది పండుగనాడు జరిగే తొలి వార్షికోత్సవం **'తిరుమలేశుడి ఉగాది దర్బార్!'** దీన్నే **'ఉగాది కొలువు'** అనీ, **'ఉగాది ఆస్థానం'** అని కూడా అంటారు.

ఈ **"ఉగాది దర్బార్!"** బంగారువాకిలి ముందు ఉన్న తిరు మహామణిమండపం (ఘంటామండపం)లో, అత్యంతవైభవంగా నిర్వ హింపబడుతుంది.

కేవలం శ్రీవారి అర్చకస్వాములు, జియ్యంగార్లు, ఏకాంగులూ, వేదపండితులు, దేవస్థానం ఉన్నతాధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు తిరుమల ఆలయ సిబ్బంది మాత్రమే పాల్గొని దర్శించగలిగిన **"ఆనందనిలయుడి ఉగాది ఆస్థానం"** వేడుకలను, ఇతర భక్తులు ఎవరు దర్శించడానికి వలను పడదుగాక పడదు. అంతేకాదు, వీడియో కెమెరా కన్ను కూడా ఆ దృశ్యాల్ని చిత్రీకరించ వీలే లేదు. అయినా **'తిరుమలేశుడి ఉగాది దర్బార్'**ను చదివి మననం చేసుకుంటే చాలు. ప్రతి భక్తుడు తన మనోనేత్రంతో తప్పక దర్శించవచ్చు.

## ఏకాంతంగా తిరుమంజనం

ఉగాదిరోజున శ్రీవారి ఆలయంలో సుప్రభాతం, తోమాలసేవ జరిగిన తర్వాత ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామికి, శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారికి ఏకాంతంగా తిరుమంజనం (అభిషేకం) జరుగుతుంది.

ఒకవేళ ఉగాది 'శుక్రవారం'నాడు వస్తే, శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ముందుగానే శుక్రవారం అభిషేకం జరుగుతుంది.

ఉగాది నాటికి ముందు వచ్చిన శుక్రవారం అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారి మూర్తిని విశేషమైన వజ్రాలు పొదిగిన కిరీటం శంఖచక్రాలు, వరద, కటిహస్తాల కవచాలతో అలంకరిస్తారు. ఈ విశేషాలంకరణలో ఆనందనిలయునిమూర్తి సౌందర్యం అనుపమానం, అప్రమేయం! అద్భుతం! ఆనందమయం! సర్వార్థ సిద్ధిప్రదం.

పిదప ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి తులసితో సహస్రనామార్చన, నివేదనలు నిర్వహింపబడుతాయి.



## సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరులతో మలయప్పస్వామి

బంగారువాకిలి ముందు ఉన్న ఘంటామండపంలో బంగారు సర్వభూపాలవాహనంలో శ్రీదేవిభూదేవేరులతో శ్రీమలయప్పస్వామివారిని తూర్పుముఖంగా బంగారు వాకిలికి ఎదురుగా ఉన్న గరుత్మంతునికి అభిముఖంగా వేంచేపు చేస్తారు. పిదప పట్టుపీతాంబరాలతోను, వజ్రవైడూర్యమరకత మాణిక్యాది సర్వాభరణాలతోను, వజ్రకిరీటాలతోను సుగంధపరిమళభరితమైన పూలమాలలతోను శ్రీవారి ఉత్సవమూర్తులను నయనాభిరామంగా విశేషరీతిలో అలంకరిస్తారు.

## శ్రీవారి సేనాధిపతి

శ్రీవారి సర్వభూపాలవాహనం పక్కనే మరొక పీఠంపైన దక్షిణాభిముఖంగా సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారిని వేంచేపు చేసి దివ్యాభరణాలతో, పూలమాలలతో అలంకరిస్తారు. శిరస్త్రాణాన్ని ఖడ్గాన్ని ధరించి అత్యంత భయభక్తులతో శ్రీస్వామివారి ఆజ్ఞలను అమలు పరచడానికి సిద్ధమై సర్వసన్నద్ధమై ఉంటాడు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారు.

పిదప, ఆనందనిలయం లోని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి, బంగారువాకిలి ముందర 'ఉగాది దర్బార్'కు సిద్ధంగా ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు, సేనాధిపతికి క్రింది విధంగా విశేషంగా పిండివంటలు నివేదింపబడతాయి.

## విశేషంగా పిండివంటల నివేదన

శ్రీవారి అర్చకస్వాములు, పెద్దజియ్యంగార్లు, చిన్న జియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్య పురుషులు, వేదపండితులు, దేవస్థానం శ్రీకార్యనిర్వాహకులు, ఇతర అధికారులు, దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు, సభ్యులు, దేవస్థానంవారి ఆలయం పేష్కార్లు, ఆలయంలోని

సిబ్బంది. ఇలా అందరూ ఛత్రచామరాలతో మంగళవాయిద్యాలు మోగింపబడుతూండగా, వేదపఠనం శ్రుతి శుభగంగా పఠింప బడుతుండగా, శ్రీవారి వంటవాళ్లు అప్పటికే సిద్ధంగా ఉంచిన విశేషవంటకాలను వంటశాలనుండి శ్రీవారి నివేదనకు ఊరేగింపుగా తీసుకు వస్తారు.

లడ్డులు, వడలు, అప్పాలు, దోసెలు, మున్నగు పిండి వంటలు, చక్కెరపొంగలి, మిరియపు పొంగలి, పులిహోర, దధ్యోదనం మున్నగు అన్నప్రసాదాలను విమాన ప్రదక్షిణంలో బంగారు బావి పక్కన ఉన్న వంటశాలనుండి ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ వెండివాకిలి ఎదురుగా బయటవున్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికి వచ్చి, ఆలయప్రవేశం చేసి అటు గర్భాలయంలోను, ఇటు బంగారు వాకిలి దగ్గర ఆస్థానంలోను నివేదనకు ఉంచుతారు. నైవేద్య ఘంటలు హృదయంగమంగా, వీనులవిందుగా, మోగింపబడుతుండగా, రెండుచోట్ల ఈ విశేష నివేదన జరుగుతోంది.

ఇలా రెండుచోట్ల విశేషనివేదన పూర్తి అయిన వెంటనే మరో విశేషఘట్టం ప్రారంభమవుతుంది. అదే వస్త్రాల సమర్పణ.

## పట్టువస్త్రాల సమర్పణ

నివేదనలు పూర్తి అయిన తర్వాత విమాన ప్రదక్షిణంలో ఈశాన్యమూలలోని శ్రీయోగనరసింహస్వామి ఆలయం పక్కన ఉన్న **"పరిమళపు అర"** దగ్గర నుండి శ్రీశ్రీశ్రీ పెద్దజియ్యంగార్లు పెద్దవెండి పళ్లెంలో మడతపెట్టి చుట్టగా చుట్టబడిన బంగారు జరీఅంచు ఉన్న ఆరు పెద్దపట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని ఛత్రచామర మంగళవాద్య పురస్సరంగా ముందు పంచముఖ దివిటీలు వెలుగుతుండగా, సన్నడోలు, కంచు పలకగంటలు మోగింపబడుతుండగా వేదపారాయణాలు హృదయంగమంగా పఠింపబడుతుంటాయి. వారందరి వెంట శ్రీ శ్రీ శ్రీ



చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, దేవాలయం ఉపకార్యనిర్వహణాధికారులు, పేష్కార్లు, పారుపత్యదార్లు మున్నగు ఆలయఅధికార బృందం వెంట రాగా, ఆలయం వెండివాకిలి ముందు ఉన్న బంగారు ధ్వజస్తంభానికి బలిపీఠానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికి వచ్చి విమానప్రదక్షిణం చేస్తూ **'బంగారు వాకిలి'** దగ్గరకు రాగా, అక్కడ బాజాభజంత్రీలవాళ్లు బంగారువాకిలి దగ్గరే నిలిచి వాయిస్తారు. **'సన్నిధిగొల్ల'**, దివిటీతో, పట్టువస్త్రాలతో కూడిన జియ్యంగార్లను, వగైరా పెద్దలందరినీ శ్రీవారి సన్నిధివరకు పిలుచుకొని వెళ్లి **'కులశేఖరపడి'** వద్ద నిలుస్తాడు. శ్రీజియ్యంగార్లు, ఏకాంగులు మాత్రమే అర్చకస్వాములకు అందిస్తారు. వెంటనే అర్చకస్వాములు కులశేఖరపడి (గర్భాలయం గడప) దగ్గర తెరను వేస్తారు.

లోపల అర్చకులు జియ్యంగార్లు సమర్పించిన ఆరు పట్టువస్త్రాల్లో, నాలిగింటిని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి అలంకరిస్తారు. ఒక వస్త్రాన్ని శ్రీవారికిరీటానికి, రెండవదాన్ని నందక ఖడ్గానికి, మూడవదానిని ఆదితోమాలగాను, నాలుగవదాన్ని ఉత్తరీయంగాను అలంకరిస్తారు. అర్చకస్వామివారు తెరను తొలగించి శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళవిరాణ్మూర్తికి బంగారుపళ్లెంలో పచ్చకర్పూరంతో ఆపాదమస్తకం దివ్యమంగళ కర్పూరనీరాజనం ఇచ్చి, అందరికీ చూపించగా, కులశేఖరపడికి ఇవతల ఉన్న వారందరు భక్తిగా శ్రీవారిని చూస్తూ హారతిని కళ్లకద్దుకుంటారు. ఆ తర్వాత...

## చందనం, తీర్థం, శఠారి స్వీకారం

ముందుగా అర్చకులు తాము చందన తీర్థశఠారుల్ని స్వీకరించిన పిదప వరుసక్రమంలో పెద్దజియ్యంగారికి, చిన్నజియ్యంగారికి, ఏకాంగికి, ఆచార్య పురుషులకు, తాళ్లపాకవారికి తీర్థం, శఠారి, చందనం

తాంబూలాలను అర్చకులు ఇస్తారు. ఆ తర్వాత సర్కారువారు అయిన దేవస్థానం కార్యనిర్వహణాధికారి గారికి, తదితర అధికారులకు కూడ పై విధంగానే తీర్థ, చందన శఠారుల్ని సాయించి తాంబూల మిస్తారు.

## 'ఉగాది దర్బార్' లో శ్రీవారికి వస్త్ర సమర్పణ

ఆ తర్వాత మిగిలిన రెండు పట్టువస్త్రాలను ఉన్న వెండి పళ్లాన్ని పెద్దజియ్యంగారు శిరస్సుపై ధరించి బంగారువాకిలి దగ్గర **'ఉగాది దర్బార్'**కు సిద్ధంగా ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకులు ఆ రెండింటిలో ఒక వస్త్రాన్ని శ్రీమలయప్పస్వామికి, రెండవదాన్ని సేనాధిపతి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు.

## శ్రీవారికి అక్షతారోపణ

పిదప ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారిపాద వస్త్రంతో పరివట్టం **(పరివేష్టనం, తలకు చుట్టు కట్టే చిన్నపట్టు గుడ్డ)** కట్టుకొని శ్రీమలయప్పవారిపై, విష్వక్సేనులపై కుంకుమాక్షతలను (అక్షతారోపణం) చల్లుతారు. ఆ తర్వాత సేనాధిపతి వారికి పరివట్టం కట్టి శ్రీస్వామివారి పాదాలమీది అక్షతలను తీసుకొని విష్వక్సేనులపై చల్లి శఠారి మర్యాదలను జరుపుతారు.

## అర్చకులకు తండులదానం - ఆనందనిలయునికి ఆశీర్వచనం

శ్రీవేంకటేశ్వరస్వామివారు అర్చకులకు తండుల (బియ్యం) దానం తాంబూలం దక్షిణలతో సహా ఇస్తారు. ఇలా బియ్యంతో పాటు దక్షిణతాంబూలాలను స్వీకరించిన అర్చకస్వామి, సాక్షాత్తు ఆనందనిలయుణ్ణి **"నిత్యైశ్వర్యోభవ!"** అని ఆశీర్వదిస్తారు. సాక్షాత్తు శ్రీనివాసుని నుండి దానం తీసుకొంటూ ఆ స్వామివారినే "స్వామీ! శ్రీనివాసా! నిత్యమూ ఐశ్వర్యపరంపరలతో వర్ధిల్లవయ్యా!'' అని



ఆశీర్వదించే శ్రీవారి అర్చకుల భాగ్యం ఎంతటిదో కదా! ఇలా ఆశీర్వచనం చేసిన ప్రధాన అర్చకులకు మరొక అర్చకులు పరివట్టం కట్టి శఠారి మర్యాదలు చేస్తారు.

## ఉగాది దర్బార్‌లో పంచాంగశ్రవణం

బంగారు సర్వభూపాలవాహనంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి పాదాలచెంత ఉన్న నూతన సంవత్సర పంచాంగాన్ని శ్రీస్వామివారికి నమస్కరిస్తూ అర్చకులు ఆస్థానసిద్ధాంతికి అందజేస్తారు.

ఆస్థాన సిద్ధాంతి, శ్రీవారికి ఆనాటి తిథివార నక్షత్రాలతో పాటు నూతనసంవత్సర ఫలితాలు లాభనష్టాలు, నవగ్రహాల సంచారం, సస్యవృద్ధి, పశువృద్ధి, మున్నగు విషయాలతో పాటు 27 నక్షత్రజాతకుల కందాయఫలాలను, ఆదాయవ్యయాలను, రాజ్య పూజ్యత, అవమానాలను పంచాంగశ్రవణంలో వినిపిస్తారు. మళ్లీ ప్రత్యేకంగా, ''స్వామీ! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! ఆది మధ్యాంత రహితా! జగదేకసార్వభౌమా! శ్రీమత్ రాజాధిరాజ పరమేశ్వరా! నిత్యకల్యాణ చక్రవర్తీ! శ్రీమదలమేల్మంగపతీ! శ్రీమదానందనిలయవాసా! బహూపరాక్! బహూపరాక్! స్వామీ! తమరు శ్రీవైకుంఠాన్ని విడిచి ఈ భూలోక వైకుంఠంలో అవతరించిన నక్షత్రం, అత్యంత శుభప్రదమైన శ్రవణనక్షత్రం! ఈ నూతన సంవత్సరంలో మీరు మరింత దయాంతరంగులై భక్తుల పాపాల్ని, ఆర్తుల్ని పోగొడతారు. సమస్తకోరికలను తీరుస్తారు. సమస్తసంపదలను అనుగ్రహిస్తారు. శుభపరంపరల్ని గుప్పిస్తారు. అందుకే స్వామీ! ఈ నూతన సంవత్సరంలో లక్షలాదిమంది భక్తులు మీ దివ్యమంగళ సౌందర్యమూర్తి దర్శనంకోసం అర్రులు చాస్తూ నిరంతరం నిరంతరాయంగా తిరుమలకు వస్తారు.

మీకు ఉత్సవాలు, ఊరేగింపులు ఇంకా వైభవంగా నిర్వహింపబడతాయి. భక్తులు ఇబ్బడి ముబ్బడిగా కానుకలను సమర్పించు కొంటారు. ఇంకా మీ కనుసన్నల్లో మెలిగే నవగ్రహదేవతలు మీ భక్తుల్ని ఇబ్బంది పెట్టకుండా సర్వదా కాపాడతారు. దేశమంతా సస్యశ్యామలంగా ఉంటుంది. కాలానుగుణంగా అక్కడక్కడా అతివృష్టి, అనావృష్టి రోగాది భయాలు ఉన్నా మీ అనుగ్రహం వల్ల మీ భక్తులు సర్వత్రా ఆనందంగా ఉంటారు. సుఖంగా ఉంటారు."

– అని ఆస్థానసిద్ధాంతి నూతన పంచాంగశ్రవణం చేస్తుండగా ఘన శ్రీవేంకటేశుడు సర్వభూపాలవాహనంలో, చెవులార పంచాంగాన్ని వింటూ, ఓరచూపులతో శ్రీదేవిభూదేవేరులను చూస్తూ, చిన్మయహాసంతో తలను పంకిస్తూ భక్తులందర్నీ అరమోడ్పు కన్నులతో, చూపులతో చూస్తూ, నిండుగా, మెండుగా అనుగ్రహిస్తారు.

ఆ తర్వాత ఆస్థాన సిద్ధాంతి శ్రీదేవీ, భూదేవేరులకు వరుసగా వారి నక్షత్రాలయిన ఉత్తరఫల్గుని, రేవతీ నక్షత్రఫలితాలను చెప్పిన తర్వాత, అక్కడ ఉన్న శ్రీకార్యనిర్వహణాధికారులు, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, ధర్మకర్తల మండలి సభ్యుల అక్కడ ఉన్న ఆలయ అధికారుల నక్షత్రఫలితాల్ని విన్పిస్తారు.

ఇలా పంచాంగ శ్రవణం చేయించిన ఆస్థాన సిద్ధాంతికి శ్రీస్వామి అర్చకులు శ్రీస్వామివారి పాదాలమీది అక్షతలను శిరస్సుపై చల్లుతూ శఠారిని అనుగ్రహిస్తారు.

పిదప శ్రీవారి బొక్కసం గుమాస్తా లేచి, అత్యంత భయభక్తులతో స్వామివారికి సాష్టాంగనమస్కారం చేసి, నిలబడి, ముందురోజు వచ్చిన హుండీరాబడిని, ఆదాయ వ్యయాలను, ఉత్సవవిశేషాలను, దేవస్థానం ఇతరఆలయ ఉత్సవవిశేషాలను విన్పించిన తర్వాత, దేవరవారు



చిత్తగించవలెను– అంటూ సాష్టాంగనమస్కారం చేసిన తర్వాత శఠారి అనుగ్రహం పొందుతారు.

వెంటనే **'కొలువు పళ్లెం'** అనే బంగారు తట్టలో నవనీత హారతిని శ్రీవారికి ఇచ్చిన తదుపరి, అర్చకులు ఆ హారతిని కార్యనిర్వహణాధికారి గారికి ఇచ్చిన తర్వాత అందరికి చూపిస్తారు.

ఆ తర్వాత తాళ్లపాక, తరిగొండ, మహంతు, మైసూరువారి హారతులు ప్రత్యేకంగా సమర్పించబడతాయి. పిదప అక్కడ చేరిన భక్తులందరి నుండి ఒక్కొక్క రూపాయను, సేకరించి ప్రత్యేకంగా అందరిపక్షాన **'రూపాయ హారతి'**ని ఇస్తారు. ఇలా సేకరించిన రూపాయలను కార్యనిర్వహణాధికారిగారు ఖజానాకు జమ చేస్తారు.

చివరగా శ్రీమాన్ పెద్దజియ్యంగారికి, పిదప దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికి, పరివట్టం కట్టి శఠారిని అనుగ్రహించిన తర్వాత శ్రీవారిప్రసాద వినియోగం, అక్షత తాంబూల సత్కారం సంప్రదాయబద్ధంగా జరుపబడుతుంది. ఇంతటితో **'తిరుమలేశుడి ఉగాది దర్బార్'** వేడుకలు సంపూర్తి అవుతాయి.

ఉగాదిపండుగనాడు పంచాంగ శ్రవణం చేస్తే, శత్రునాశం, జరుగుతుంది. దుస్స్వప్నాలు తొలగుతాయి. గంగాస్నానఫలం, గోదానఫలం కలిగి ఆయుస్సు పెరుగుతుంది. సత్సంతానం కలుగుతుంది.

అందులోను లోకకల్యాణంకోసం తిరుమలేశుడు చేస్తున్న ఉగాది పంచాంగశ్రవణం ఇది.

శ్రీవారిఆలయంలో ఉగాది పర్వదినాన ఉదయం పూట బంగారువాకిళ్ల ముందర ఏకాంతంగా జరిగే **"తిరుమలేశుడి ఉగాది దర్బార్"**ను వీక్షించలేదే అన్న అసంతృప్తికి లోనుగాకుండా. శ్రీనివాసుణ్ణి స్మరించండి. అందరి ఇండ్లూ 'ఆనందనిలయాలే! అందరి వాకిళ్లు

బంగారు వాకిళ్లే, అందరి లోగిళ్లూ, ఘంటామండపాలే! అందరి హృదయాలూ సర్వభూపాల వాహనాలే! మీ మీ హృదయాల్లో శ్రీనివాస భగవానుణ్ణి ప్రతిష్ఠించుకోండి! మీ ఇండ్లలో, మీ హృదయాల్లో నూతన పంచాంగ శ్రవణం చేయండి. ఆ శ్రీనివాస ప్రభువు దయతో ఈ నూతన సంవత్సరంలో సర్వశ్రేయస్సులను సంపూర్ణంగా పొందండి!

**లలిత**

**సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు**
**అకలంకంబగు సుఖమే అన్నిట నిదే నాకు ॥పల్లవి॥**

**పొందుగ చక్రాంకితమే బుజబల మిదె నాకు**
**అందిన హరి నీచింతే ఆత్మబలము నాకు**
**సందడి పేరుబలము కేశవనామము నాకు**
**యిందును నందును భవభయ మిఁక లేదిదే నాకు ॥సకల॥**

**అంగపు తిరుమణు లివి పంచాంగబలము నాకు**
**సంగ నీపై పాటలె స్వరబలి మీదే నాకు**
**రంగుగ నీ గుణరాసులే రాసిబలము నాకు**
**యింగితముగ నిహపరముల కెదురే దిదే నాకు ॥సకల॥**

**కనుగొను నీ విగ్రహమే గ్రహబలి మిదె నాకు**
**విను నీ దాసుల సేవే వెనుబలి మిదె నాకు**
**తనరిన శ్రీ వేంకటపతి దైవబలము నాకు**
**ఘనమే చెప్పగ నింతట కలిగెబో యిదే నాకు ॥సకల॥**

**- తాళపాక అన్నమాచార్యులు.**

**శ్రీనివాసోవిజయతే! శ్రీనివాసో విజయతే!**

# ౭. తిరుచాన శ్రీ అలమేలుమంగ!



**'తిరుచాన'** అంటే **శ్రీకాంత** అని అర్థం. ఆమే 'శ్రీమహాలక్ష్మి'. ఆ సిరులతల్లిని **'అలమేలుమంగ'** అని కొందరంటారు. పుష్పంపైన ప్రకాశిస్తున్న దివ్యవనితే, **'అలర్ మేల్ మంగ'**. సహస్రదళాలు వున్న బంగారు పద్మంలో అవతరించింది కనుక ఆ జగన్మాతను 'పద్మావతి' అని అంటారు.

బాగుంది. ఇంతకూ ఆమె ఎవరు? ఎక్కడ ఉంటుంది.

అలమేలుమంగ తిరుమల ఆనందనిలయుని పట్టపురాణి. ఆమె అర్చామూర్తిగా వెలసివున్న దివ్యక్షేత్రం తిరుచానూరు. దీన్నే 'అలమేలుమంగపట్నం' అంటారు.

తిరుపతికి ఆగ్నేయమూలలో 3-4 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ పుణ్యక్షేత్రానికి, ఆటోలు, బస్సులు వెళ్తుంటాయి. పట్టుమని పది నిమిషాల్లో చేరుకోవచ్చు.

## 'దయ' అనే బరువు

పెనిమిటి అయిన శ్రీనివాసుడు ఏడుకొండలపైన 'ఆనందనిలయం'లోనా! ఆయన పత్ని అలమేలుమంగ ఆ కొండకింద తగ్గులో తిరుచానూరు 'శాంతినిలయం'లోనా!

విచిత్రంగా వుంది కదూ!

ఇలా వుండడంలో విశేషమైనకారణం ఒకటి ఉందంట!

చాలకాలం కిందట ఏడుకొండలకు దీటైన కొండలో అంతే ఎత్తులోనే 'శాంతినిలయం' అనే బంగారుమేడలో వుండేది పద్మావతి. కాని **'ఆనందనిలయం'**లోని అయ్యవారి కంటే, **'శాంతినిలయ'** అయిన అమ్మవారు భక్తులపై **"ఒకింత దయ"** ఎక్కువగా చూపుతుంది! ఆ **'కాసింతదయ'** అనే బరువువల్ల, ఈ తల్లి వున్న కొండ భూమిలోనికి దిగబడిపోయిందంట! అందువల్లే ఆనందనిలయుడు అంత ఎత్తులో, ఈమేమో ఇంతకింద వుండడం! – అని పెద్దలమాట!

ఇంకో విషయం!

ఆ స్వామి, ఆనందనిలయుడు శంఖుచక్రాలను ధరించి, ఎక్కడికో పరుగెత్తి పోవాలన్న తొందర్లో వున్నట్లుగా ఎప్పుడూ నిలబడే అగుపిస్తాడు. గంభీరంగా వున్న ఆయనకు ఏం చెప్పుకోవాలన్నా భయమే! ఆ బెదురువల్ల, అనుకొన్నవన్నీ అడగడానికి మరచిపోతాం.

మరి ఇక్కడో!

అలమేలుమంగమ్మతల్లి ఎలాంటి తొందర్లు లేకుండా రెండు చేతుల్లో చల్లని పద్మాలను పట్టుకొని, అభయ, వరదహస్తాలతో చనువుగా **"ఏం కావాలో అడగండర్రా!"** అన్నట్లుగా తిరంగా నిండుగా పద్మంపైన కూర్చొని నవ్వుతూ దర్శనమిస్తుంది. మనం చెప్పుకొన్న వన్నీ ఓపికగా



వింటుంది. విన్నవాటిని విభుడైన వేంకటేశ్వరునకు వినిపిస్తుంది. అంతటితో ఊరుకోదు. తన నాథునిపై ఒత్తిడి తెస్తుంది. భక్తులకు కోరిన వరాలను ఇప్పిస్తుంది.

ఒకవేళ స్వామివారు ఆమెమాటను వినకుండా 'బెట్టు'గా వుంటేనో! అప్పుడు అమ్మ అంటుంది కదా! స్వామీ! తిరుమలేశా! నా వల్లనే కదా! నీ గుండెమీద పదిలంగా, "వ్యూహలక్ష్మి"గా వున్న నా వునికి వల్లనే కదా! నీవు 'శ్రీనివాసుడి'గా అయ్యావు. నా కోసం వైకుంఠాన్ని విడిచి రావడమేగాక, ఈ భూలోకంలో కూడ నా దయకోసం అర్రులు చాస్తూ, ఈ పద్మసరోవరతీరాన తపస్సు చేశావు కదా! అప్పుడే ఆ విషయాన్ని మర్చిపోతివా స్వామీ! అంటూ భక్తులకోసం శిఫారసు చేస్తుంది.

సున్నితంగా స్వామివారి మనస్సును భక్తులమీదికి మళ్లింపచేసి ప్రసన్నం చేస్తుంది. దండిగా, మెండుగా, నిండుగా అనుగ్రహింప చేస్తుంది అమ్మలకు అమ్మ అలమేలుమంగమ్మ!

ఇంకేముంది! అమ్మ మాటను కాదనలేక, అమ్మమాటను జవదాటలేక "సరే! సరే! అంటున్నా కదా! నా కంటె కూడా భక్తులపై నీకు కొంచెం దయ ఎక్కువే కదా!" అంటూ ఏడుకొండలవాడు ఏమాత్రం చెరగని, తరగని చిరుమందహాసంతో భక్తుల కోరికలను తీరుస్తూ వున్నాడు! తిరుచానూరు అలమేలుమంగమ్మవల్ల ఏడుకొండల మీద నిత్యమూ జరుగుతున్న తంతు ఇదే!

అందువల్లే, అలమేలుమంగమ్మను దర్శిస్తేనే, తిరుమలయాత్ర పూర్తి అవుతుందన్నది సత్యమైనమాట!

ఇక్కడ ఇంకోమాట!

భక్తుల విషయంలో ఈ ఇద్దరూ ఒక్కటే! భక్తులకోసం, లోకకల్యాణకోసం ఇద్దరూ కూడ బలుక్కుంటారు. అసలు ఇద్దరూ వేరు

వేరు అయితే కదా! ఆనందనిలయుని 'దయా' స్వరూపవే అలమేలుమంగ! కనుకే ఆనందనిలయుని హృదయంలో అలమేలుమంగ ఉంటుంది. ఆమె మనసులో ఆ స్వామి వుంటాడు. అందువల్లే – భక్తులు ఇలా ప్రార్థిస్తారు.

**నారాయణస్య హృదయే భవతీ యథాస్తే,**
**నారాయణోపి తమ హృత్కమలే యథాస్తే**
**నారాయణస్త్వమపి నిత్య ముభౌ తథైవ**
**తౌ తిష్ఠతాం హృది మమాపి దయావతి శ్రీః**

అలమేలుమంగమ్మా! ఆనందనిలయుని హృదయంలో నీవు వుంటావు! నీ హృదయంలో ఆ స్వామి వుంటాడు. మీ ఇరువురూ నిండు దయతో మా గుండెల్లో పదిలంగా కొలువై వుండండి! –అని.

దయగలతల్లి శ్రీ అలమేలుమంగ(పద్మావతి) తిరుచానూరులో అర్చామూర్తిగా ఎలా వెలసిందో, తెలుసుకోవాలంటే సుమారు ఐదువేల ఏండ్ల నాటి గాథను సంక్షిప్తంగా అయినా చెప్పుకోవాల్సిందే మరి!

భృగుమహర్షి చేసిన నిర్వాకంవల్ల అలిగిన శ్రీమహాలక్ష్మి వైకుంఠాన్ని వీడి భూలోకం చేరింది. ఆమెను వెదుకుతూ శ్రీనివాసుడు భూలోకం చేరుకున్నాడు. లక్ష్మికోసం వెదకి వెదకి వేసారిన శ్రీనివాసుడు ఆదివరాహక్షేత్రం చేరుకొన్నాడు. పిదప ఆకాశరాజు కూతురు పద్మావతిని వివాహం చేసుకొన్నాడు. కాని మహాలక్ష్మిలేని జీవితం వ్యర్థమని భావించిన వేంకటేశ్వరుడు లక్ష్మీదేవి కొల్హాపురంలో వుందని అక్కడికి వెళ్లాడు.

## కొండలరాయని కొల్హాపుర సందర్శనం

అదొక మహానగరం! కొండల్లో కోనల్లో తిరిగిన శ్రీనివాసునికి కొల్హాపురం అద్భుత ప్రపంచంగా కనపడింది. ఎక్కడ చూచినా ఎత్తైన బంగారు గోపురాలు! ఎటుచూసినా మణిమయ మందిరాలు! విశాలమైన వీధులు! రహదారులు! ఓర్పుగా నేర్పుగా పెంచిన మనోహరమైన ఉద్యానవనాలు! పుష్పవాటికలు! నయన మనోహరంగా, వీనుల విందుగా సంగీత నాట్యకళలత అలరారుతున్న సభామందిరాలు! రండి! లోపలికి రండి! కడుపార తృప్తిగా భోజనం చెయ్యండి అంటూ ఆహ్వానిస్తున్న నిరతాన్నదాన సత్రాల నిర్వాహకులు! ఎక్కడ చూసినా సుసంపన్నంగా, శోభాయమానంగా ప్రకాశిస్తున్న కొల్హాపుర మహానగరంలో ప్రవేశించాడు కొండలరాయడు. ఆ నగరం నడిబొడ్డున ఎత్తైన ప్రాకారాలతో వింత వింత కాంతులతో ప్రకాశిస్తున్న అద్భుతమైన భవనం! అదే శ్రీమహాలక్ష్మి మందిరం!



శ్రీనివాసుడు ఆశ్చర్యంతో తలమునకలై ముందుకు నడుస్తూ ఆ భవన ద్వారాలలో ప్రవేశించాడు. ముందుగా ఉక్కు ప్రాకారం, దాటాడు. ఆ తర్వాత వరుసగా కంచు, సీసం, రాగి, ఇత్తడి, వెండి, బంగారు, పుష్పరాగం, పద్మరాగం, గోమేధికం, వజ్రం, వైఢూర్యం, ఇంద్రనీలం, ముత్యాలు, మరకతమణులు ప్రవాళం(పగడం)... ఇలా వీటిలో నిర్మింపబడ్డ ప్రాకారాలను దాటి, ఆ ప్రాకారాల నట్టనడుమవున్న 'చింతామణి' గృహంలో ప్రవేశించాడు తిరుమల పరంధాముడు. ఆ గృహంలోని వేదికపైన శ్రీమహాలక్ష్మి దర్శనంకోసం కళ్లను నిక్కించి చూశాడు. ఆ తల్లి కనపడితేగా? కనపడకపోగా, ఆ పరిసరాలు మాత్రం పరిమళాలు సువాసనాలతో గుప్పుమంటున్నాయి. ఆమె దర్శనంకోసం, ఆర్తిగా వచ్చేవారు, ఆనందంగా తిరిగి వెళ్లేవారు కనపడుతున్నారుకాని తనకుమాత్రం లక్ష్మీదేవి అగుపించడం లేదని తీవ్రంగా పరితపించాడు.

ఆమె దర్శనం మాత్రం కానందువల్ల నిరాశకు లోనయ్యాడు. అయినా పట్టువదలని పరంధాముడు శ్రీమహారాజ్ఞి అయిన లక్ష్మిని ప్రసన్నం చేసి కొనడానికి కొల్హాపురక్షేత్రంలో తపస్సును ప్రారంభించాడు.

ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. ఏకంగా పదేండ్ల పాటు ఆ తల్లి దర్శనంకోసం నిద్రాహారాలు మాని తపస్సు చేశాడు. అయినా జగన్మాత దర్శనం మాత్రం కలగలేదు. ఇంతలో శ్రీనివాసా! ఇది విను! అంటూ గంభీరంగా ఆకాశవాణి విన్పించింది.

**ఆకాశవాణి!**

"శ్రీమహాలక్ష్మి దర్శనంకోసం, అనుగ్రహం కోసం ఆర్తిగా ఆత్రుతపడుతున్న ఆనందనిలయవాసా! జాగ్రత్తగా విను.

తిరుమలేశా! ఈ మహానగరంలో కొలువైవున్న శ్రీమహాలక్ష్మి నీకు దర్శనం ఇవ్వదుగాక ఇవ్వదు. ఇక్కడి నుండి దక్షిణంగా వెళ్ళు : 'కృష్ణవేణి' అనే పుణ్యనది కనపడుతుంది. ఆ నదీమతల్లికి దక్షిణంగా ఇరవై రెండు యోజనాల దూరంలో 'సువర్ణముఖి' అనే దివ్యమైన పుణ్యనది ప్రవహిస్తోంది. ఆ నదికి ఉత్తరతీరంలో అనేక మంది యోగుల, మునుల ఆశ్రమాలు వున్నాయి. అలాంటి పవిత్రమైన ప్రదేశానికి నీవు వెళ్లి. అక్కడ నీ కుంతాయుధం (ఈటె, బల్లెం)తో ఒక సరస్సును నిర్మించు. ఆ పవిత్ర జలాల్లో దేవలోకం నుంచి తెప్పించిన బంగారు పద్మాలను ప్రతిష్ఠించు. ఆ తర్వాత నియమంగా, శ్రద్ధగా, భక్తిగా 12 ఏండ్లపాటు శ్రీమహాలక్ష్మిని ఉపాసన చెయ్యి. అలా చేసినటైతే నీ తపస్సు ఫలిస్తుంది.

సుప్రసన్నరాలైన సిరులతల్లి శ్రీమహాలక్ష్మి సహస్రదళాలు బంగారు పద్మంలో ప్రశాంతరూపంతో, ప్రశాంతచిత్తంతో అవతరించి మళ్లీ నిన్ను చేరుకుంటుంది. వెళ్లిరా" అన్న వాక్కులు విన్న వేంకటేశుడు వెంటనే గరుడునిపై

ముందుగా ఆదివరాహక్షేత్రంలో స్వామిపుష్కరిణిలో స్నానంచేసి సువర్ణముఖీతీరం చేరుకొన్నాడు. పద్మసరస్సు ఏర్పాటుచేసిన తపస్సు ప్రారంభంలో కొంతకాలం క్షీరాన్ని మాత్రం తీసుకొంటూ, మరి



కొంతకాలం నిరాహారంగా వుంటూ బీజాక్షరాలతో నిక్షిప్తమైన శ్రీమహాలక్ష్మి మంత్రాన్ని జపిస్తూ సుమారు 12 ఏండ్లు తపస్సు చేశాడు. పదమూడవ ఏట కార్తీకమాసం, శుక్లపక్షం, పంచమీ శుక్రవారం, ఉత్తరాషాఢా నక్షత్రం కూడిన, విజయలగ్నం కూడిన శుభదినాన అత్యంత శుభప్రదమై వేళలో, శ్రీమహాలక్ష్మి ఆ పద్మసరస్సులో శ్రీనివాసుని ఎదుట ఇలా అవతరించింది.

**అలమేలుమంగ ఆవిర్భావం**

పద్మసరోవరంలో శ్రీనివాసుడు నాటిన సహస్రదళాల బంగారు పద్మం ఆశ్చర్యంగా, అద్భుతంగా వికసిస్తుండగా, ఆ పుష్పసౌరభాలు నలుదిక్కులా వ్యాపించాయి. ఇంతలో పవిత్రజలాలనుంచి ఆ పూర్తిగా బంగారు కమలం పైకి వచ్చింది. ఆ స్వర్ణపద్మంలోని కర్ణిక మధ్యలో బంగారురథం. దానిమీద బంగారు పద్మపీఠంపైన ఆ సీమరాలైన శ్రీమహాలక్ష్మి పదహారేళ్లు నిండని యువతిగా ఆవిర్భవించి దర్శనమిచ్చింది. వజ్రవైదూర్య మరకత మాణికాది హారాలతో సుగంధ సుమనోహర పుష్పమాలికలతో అలంకృత అయిన శ్రీమహాలక్ష్మి అవతరిస్తుండగా వింత వింత వెలుగులు అంతటా వ్యాపించాయి. ఆత్యంత కల్యాణప్రదమైన శుభఘడియల్లో శంఖనాదాలు. భేరీ మృదంగనాదాలు అన్ని దిక్కుల్లో మారుమ్రోగాయి. నింగి నుండి దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు. గంధర్వులు ఆనందంతో ఆడారు. పరవశించి గానం చేశారు.

పద్మంలో ఆవిర్భవించింది కనుక ఆ జగన్మాతకు అందరూ పద్మావతి! పద్మావతి!! అని కొందరు ఘోషిస్తూ ప్రార్థించారు. మరికొందరు 'అలర్ మేల్ మంగ' – అంటే పద్మంపైన ప్రకాశిస్తున్న దివ్యకాంత కనుక "అలమేలుమంగ!" "అలమేలుమంగ!" అని ఆ తల్లిని ఆనందంగా పిలుస్తూ సాగిలబడి నమస్కరించారు.

## అలమేలుమంగ అద్భుతరూపం

అలమేలుమంగ అద్భుతరూపం పద్మసరోవరంలో ఆవిర్భవించిన అమ్మ అలమేలుమంగమ్మ సుకుమారమైన సుందరరూపం వర్ణనాతీతం! ఆయమ సొంపు సోయగం నయన మనోహరం! అమ్మ ముఖారవిందం పూర్ణ చంద్రునిలా గుండ్రంగా వుంది. అందంగాను ఉంది. ఆ అందాన్ని ఇంకా పెంచుతూవున్నట్లుగా ఎర్రని పెదవులపై చెరగని, తరగని చిరుమందహాసం! ఆ పెదవుల మధ్యలో దోబూచులాడుతూ కనపడీ కనపడకుండా వున్న ముత్యాలవంటి పలువరుస! సంపెంగవంటి నాసిక! ఆ నాసిక అందాన్ని మరింత రెట్టింపు చేస్తూవున్న రతనాల ముక్కెర! ఆ నాసికకు ఇరువైపులా దయారసాన్ని పొంగింపచేస్తున్న సుందరమైన పద్మంవంటి విశాల నేత్రాలు! నేత్రాల అంచున ఇరువైపులా ఓంకారాలలాగా భాసిస్తున్న కర్ణద్వయం! నిగనిగలాడే చెక్కిళ్ల సొంపును మరింత ప్రస్ఫుటం చేస్తున్న మణిమయ కర్ణాభరణాలు! నాసికకు పైన కస్తూరీ కుంకుమలతో భాసిస్తూ వున్న ఫాలభాగం! ఆ ఫాలభాగంపైన పద్మసరోవరంలోని జలాలపై నుండి వీస్తున్న చల్లని పిల్లవాయువులకు సుతారంగా కదలాడుతున్న నల్లని తుమ్మెదలవంటి ముంగురులు! ఆ జగన్మాతే అఖిలలోకాల మహాసామ్రాజ్ఞి! అన్నట్లుగా దివ్యకాంతులతో మిరుమిట్లు గొలుపుతూ ఆమె శిరసుపైన చక్కగా అమరిన అందాల నవరత్న కిరీటం! మామిడి చిగురులవంటి ఎర్రని వర్ణంతో ప్రకాశిస్తున్న ఆ తల్లి దివ్యమంగళశరీరం ఆపాదమస్తకం అంతటా లావణ్యంతార వింత వింత సొబగులు ఆవహించాయి. మెడలో కంఠాభరణాలు! చేతులకు నవరత్నాల గాజులు! కాళ్లకు కడియాలు! కాలివేళ్లకు బంగారు మట్టెలు! నడముకు వడ్డాణం! ఆ జగన్మాత పై రెండు చేతుల్లో పద్మాలను ధరించింది. పద్మాలహారాన్ని మెడలో అలంకరించుకొంది. కింది



కుడిచేయి అభయముద్రతోను, ఎడమచేయి వరద ముద్రతోను వుంటూ పదహారేళ్లైన నిండని నవయౌవ్వన యువతిగా స్వర్ణకమలంలో శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించింది.

జగన్మాత ఆవిర్భవాన్ని భృగు నారద తుంబుర మహర్షులు యోగులు, మునులు, ఇలా ఎందరో దర్శించి కీర్తించారు.

అద్భుతావహంగా అవతరిస్తున్న అలమేలుమంగను ఆనందనిలయుడు కన్నులార్పక తిలకిస్తూ, అంతులేని ఆనందాన్ని పొందాడు. ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు అలకమాని, భూలోకంలో తనను పద్మావతి పేరుతో తనను చేరుకోవడానికి వచ్చిన శ్రీమహాలక్ష్మి మెడలో, శ్రీనివాసుడు తన కలువలమాలను అలంకరించి ఆమెను ఆలింగనం చేసుకొన్నాడు.

ఆ శుభవేళలో సమస్తదేవతలు, యక్షగంధర్వ కిన్నర కింపురుషాది దేవగణాలు. ఆ దివ్యదంపతులపై పుష్పవర్షం కురించాడు. మంగళవాద్యాలను మోగించారు. శ్రీనివాసునితో కూడివున్న శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించిన బ్రహేంద్రాది అఖిలదేవతలు అనేక విధాలుగా స్తుతించారు.

**"పద్మహస్తే నమస్తుభ్యం ప్రసీద హరివల్లభే!**
**ఋగ్యజు స్సామ రూపాయై విద్యాయైతే నమో నమః**

ఇలా కీర్తించిన దేవతలను ఉద్దేశించి, శ్రీనివాసుని అనుమతితో శ్రీమహాలక్ష్మి ఇలా పలికింది. ఓ దేవతలారా! మీరు ఇప్పుడు చేసిన స్తోత్రంతో నన్ను బిల్వదళాలతో అర్చిస్తే చాలు. వాళ్లు పోగొట్టుకున్న సంపదలను, పదవులను పొందడమేకాక, ఇంకా వృద్ధిని పొందుతారు. చివరకు ముక్తిని కూడా పొందుతారు. అంతేగాక నేను ఆవిర్భవించిన 'కార్తీక పంచమి' రోజున ఈ పద్మసరోవరంలో స్నానం చేస్తే చాలు.

దీర్ఘాయువు, ఐశ్వర్యం, విద్య తేజోవంతులైన సంతానం పొంది సుఖించగలరని పద్మావతి వరాలను ప్రసాదించింది.

శ్రీనివాసుడు ఆమెను తన వక్షఃస్థలంలో ''వ్యూహలక్ష్మి''గా ఉంచుకొని తిరుమలకు వెళుతుండగా, ఈ క్షేత్రంలో అర్చామూర్తిగా కొలువై వుండవలసిందని బ్రహ్మాది దేవతలు ఆమెను ప్రార్థించారు.

ఆనాటి నుండి "స్వతంత్రవీరలక్ష్మి"గా "విరహలక్ష్మి"గా స్వామివారు లేకుండానే, తిరుమలలోని స్వామిమాదిరిగానే స్వతంత్రంగా ఉత్సవాలను ఊరేగింపులను జరుపుకొంటున్న శ్రీమహారాజ్ఞిగా జగదేకమాతగా విరాజిల్లుతున్నది అలమేలుమంగమ్మ!

చతర్ముఖ బ్రహ్మదేవుడు పద్మావతి అమ్మవారు అవతరించిన 'పంచమితీర్థం' నాటికి ముందు పదినాళ్ల పాటు జరిగే కార్తీకబ్రహ్మోత్సవాలను ఘనంగా ఘనంగా నిర్వహించినాడు. తిరుమలలో మాదిరే, స్వతంత్రంగా శ్రీమహారాజ్ఞి అయిన అలమేలుమంగమ్మ పూటకొక్క వాహనంలో, పదినాళ్లపాటు బ్రహ్మదేవుడు ఉత్సవాలను ఘనంగా నిర్వహించినాడు. "పంచమినాడు". "పంచమితీర్థం" పేరుతో అమ్మవారు అవతరించిన పద్మసరోవరంలో 'చక్రస్నానం' వైభవంగా జరుపబడుతుంది. సరిగ్గా పంచమితీర్థం"నాడు జరిగే అవబృథోత్సవ వేళకు తిరుమల శ్రీస్వామివారినుండి "పసుపుకుంకుమ, చీర, రవిక, పసుపుచందనం, పూలమాలు, పిండివంటలు" మున్నగు వాటితో సారెను ఏనుగు అంబారిపైన తీసుకవస్తారు.

## పంచమితీర్థం

తిరుమల శ్రీనివాసుడు తన పట్టపుదేవేరి పుట్టినరోజు ''పంచమితీర్థం'' వేడుకలకు పంపిన పసుపు చందనాదులలో



"పద్మపుష్కరిణి" తీరాన శ్రీఅలమేలుమంగకు, శ్రీసుదర్శన భగవానునికి వేదమంత్ర ఘోషలతో మంగళవాయిద్య పురస్సరంగా స్నపన తిరుమంజనం జరుగుతుంది. తిరుమంజనాదులు పూర్తి అయిన వెంటనే సుముహూర్తంలో శ్రీసుదర్శన భగవానునికి పద్మసరోవరంలో ఘనంగా చక్రస్నానాదులు జరుపడంతో పంచమితీర్థ వేడుకలు మంగళప్రదంగా శుభావహంగా పరిసమాప్తమవుతాయి. పంచమితీర్థంనాడు తిరుచానూరు పద్మసరోవరంలో జరిగే చక్రస్నానమహోత్సవంలో వేలాదిమంది భక్తులు, పాల్గొంటారు. అత్యంత భక్తి ప్రపత్తులలో శ్రీచక్రత్తాళ్వార్‌తో పాటు పుష్కరిణిలో మునకలిడి పునీతులవుతారు.

ఆనందనిలయుని పట్టపుదేవేరి అలమేలుమంగ అవతరించిన ''పంచమితీర్థ'' వేడుకలను, కార్తీక బ్రహ్మోత్సవాలను చూచి ఆనందించవలసిందే తప్ప ఎంతని వర్ణించగలం! ఏమని వర్ణించగలం! అందువల్ల మనం అందరం మౌనంగా ప్రశాంత చిత్తంతో తిరుమల పరంధాముని పట్టపురాణి పద్మావతి అమ్మవారిని కన్నులారా దర్శించుకుందాం. ఆ అమ్మ దయను పొందుదాం!

అమ్మదయ ఒక్కటివుంటే చాలు! అన్నీ ఉన్నట్లే!!

**ఓం శ్రియై నమః**

## శ్రీనివాసుడు చేసిన సూర్యప్రతిష్ఠ

పద్మసరోవరానికి తూర్పుతీరాన పశ్చిమాభిముఖంగా శ్రీసూర్యభగవానుని ఆలయం వుంది. ఈ సూర్యస్వామిని సాక్షాత్తు శ్రీనివాస భగవానుడు స్వయంగా ప్రతిష్ఠించి అక్కడే మహాలక్ష్మికోసం తపస్సు చేశాడు. 12 ఏండ్ల తర్వాత ఆ సరస్సులో బంగారు పద్మంలో ఆవిర్భవించింది ఆ తల్లి. అలా ఆనందనిలయునిచే ప్రతిష్ఠింపబడిన ఈ సూర్యుని ఆలయం ఎన్నోమార్లు పునరుద్ధరింపబడింది. ఇటీవల 1866

ఏప్రిల్ 23న హథీరాంజీ మఠంవారు జీర్ణోద్ధరణ చేశారు. వైఖానస ఆగమం ప్రకారం నిత్య పూజలేకాక ప్రతి ఆదివారం ఉదయంపూటా, హస్తానక్షత్రం రోజున, శ్రీరథసప్తమి రోజున శ్రీ సూర్యనారాయణ స్వామివారికి అభిషేకాలతో గ్రామోత్సవం జరుగుతుంది.

## శుకమహర్షి విశిష్టఅతిథులు బలరామకృష్ణులు

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయప్రాంగణంలోనే శ్రీబలరామకృష్ణుల సన్నిధి వుంది. భారతయుద్ధ సమయంలో ముందుగా బలరాముడు, ఆ తర్వాత ఆయనను వెదకుతూ శ్రీకృష్ణుడు వచ్చాడు. వాళ్ళిద్దరికి శుకమహర్షి ఆతిథ్యమిచ్చాడు. అందుకు గుర్తుగా వెలసింది ఈ కృష్ణస్వామి ఆలయం. 12వ శతాబ్దంనుంచి అంచెలంచెలుగా నిర్మింపబడిన ఈ ఆలయం, 1467లో సాళువనరసింగరాయల, 1541 అచ్యుతరాయుల కాలంలో ఉత్సవాదులతో అభివృద్ధి చెందింది. పాంచరాత్రాగమం ప్రకారం ప్రతిరోజు మూడు పూటలా నివేదనలతో పాటు, ప్రతినెల రోహిణికీ, ప్రతి సంవత్సరం శ్రీకృష్ణాష్టమి – శ్రీకృష్ణజయంతికీ అభిషేకార్చనలు శ్రీరుక్మిణీసత్యభామా సమేత శ్రీకృష్ణస్వామికి గ్రామోత్సవం జరుగుతుంది.

## శ్రీ సుందర(రాజ)వరదుని సన్నిధి!

శ్రీపద్మావతి అమ్మవారి ఆలయప్రాంగణంలోనే వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీసుందరరాజస్వామిసన్నిధిని గూర్చి 1541, 1547 శాసనాల్లో ప్రస్తావింపబడింది. 1906 జేష్ఠమాసంలో మహంతులపాలనలో జీర్ణోద్ధరణ చెయ్యబడిన ఈ ఆలయంలో పాంచరాత్రాగమం ప్రకారం నిత్యార్చనలు, ప్రతినెల ఉత్తరాభాద్రనక్షత్రం రోజున అభిషేకార్చనలు, ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో మూడురోజులపాటు అవతారోత్సవాలు జరుపబడుతున్నై.



## తెప్పలపై తిరుమలేశుని రాణి!

ప్రతిఏటా జ్యేష్ఠమాసంలో పున్నమికి పూర్తి అయ్యేట్లుగా ఐదురోజులపాటు సాయంవేళల్లో పద్మసరోవరంలో జరిగే తెప్పోత్సవాల్లో, మొదటి రోజు శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణస్వామివారు; రెండవరోజు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీసుందరరాజస్వామివారు; చివరి మూడు రోజులు శ్రీపద్మావతి అమ్మవారు తెప్పలపై శోభాయమానంగా దర్శనమిస్తారు.

## శుక్రవారపుతోట ఉత్సవం

శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయానికి దక్షిణ దిక్కున కేవలం వంద అడుగుల దూరంలో అందమైన ఉద్యానవనం కనపడుతుంది. ఇదే ''శుక్రవారపు తోట''. చక్కగా తీర్చిదిద్దిన పూలమొక్కలతోపాటు అరటిచెట్లువున్న విశాలమైన ఈ పూలతోట మధ్యలో 16 శిలాస్తంభాలతో నిర్మితమైన “వసంత మండపం” వుంది. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం వేళ ఈ మండపంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, పసుపు, చందనం మున్నగు ద్రవ్యాలతో తిరుమంజనం, నివేదనలు జరిగిన తర్వాత అమ్మవారు ఆస్థానమండపంలో “సహస్ర దీపాలంకరణసేవ”లో పాల్గొంటారు.

## వేంకటేశురాణికి వసంతోత్సవాలు

ప్రతి సంవత్సరం వైశాఖమాసం పున్నమికి మూడు రోజులపాటు శ్రీఅలమేలుమంగమ్మకు వార్షిక వసంతోత్సవాలు ఘనంగా జరుగుతవి. ప్రతిరోజు నిత్యపూజాదులు అయిన తర్వాత అమ్మవారు శుక్రవారంతోటలోని వసంతమండపానికి వేంచేస్తారు. పాలు, పెరుగు, తేనె, పంచామృతం, పసుపు, చందనం వంటి అభిషేక ద్రవ్యాలతో అంగరంగవైభవంగా తిరుమంజనాదులు జరిగిన తర్వాత, ఘనంగా

ఆలయం మహాప్రదక్షిణ మార్గంలో ఊరేగిస్తారు. ప్రత్యేకంగా పున్నమినాటి సాయంవేళ శ్రీపద్మావతిఅమ్మవారికి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తారు.

## సాక్ష్యం చెప్పిన అలమేలుమంగ!

ఐదువందల ఏండ్ల కిందట నిజంగా జరిగిన అద్భుత సంఘటన ఇది!

వస్త్రాలను నేసే కులాల్లో పద్మసాలీలను, జాంద్రవారిని ప్రధానంగా పేర్కొనవచ్చు. వీళ్ల ఇద్దరిదీ ఒకే కులం. ఒకే వంశం. ఒకే వృత్తి. రాకపోకలు ఇచ్చిపుచ్చుకోవడాలు కూడా వుండినాయి. కాని వీళ్లలో వీళ్లకు పొరపొచ్చాలు వచ్చాయి. ముఖ్యంగా తిరుపతి, తిరుచానూరు, యోగిమల్లవరం, నారాయణవరం, మున్నగు ప్రాంతాల్లో వ్యాపించిన ఈ చేనేత వృత్తులవారికి (16వ శతాబ్దంలో) మరో వివాదం తోడయింది. అదేమంటే!

తిరుచానూరు "అలమేలుమంగ" మా ఆడపడుచు అనీ, కాదు కాదు మా ఆడపిల్ల అంటూ, ముందుగా తామే ఆ తల్లికి పసుపుకుంకుమలు, సారెను తామే ముందుగా ఇవ్వాలని ఇద్దరూ వాదించుకొన్నారు. చివరికి ఇద్దరికీ గురువైన తాళ్ళపాక చినతిరువేంగళనాథుణ్ణి ఆశ్రయించారు.

ఈయనే తాళ్లపాక అన్నమయ్య మనుమడు. ఇతణ్ణే 'చిన్నన్న' అని అంటారు. అలమేలుమంగ అన్నమయ్యకు బాల్యంలో ప్రసాదాలు తినిపించినట్టుగానే, మనుమడు ఈ చిన్నన్నకు కూడా చిన్ననాడే అలమేలుమంగ స్వయంగా చనుబాలు తాపిందంట! అందువల్లే చిన్నన్నకు కవిత్వం అబ్బింది. చిన్నన్నతో ఎప్పుడంటే అప్పుడు అలమేలుమంగ మాట్లాడేదంట!



చిన్నన్న ఇద్దర్నీ సముదాయించి "అలమేలుమంగమ్మ"ను సాక్ష్యం చెప్పవమ్మా! నీవు ఎవరి ఆడపడుచువో అని ప్రార్థించాడు. అందరూ చూస్తుండగా అలమేలుమంగమ్మ వేయి వెలుగులతో ప్రత్యక్షమయ్యింది. అందరూ చెవులు రిక్కించి వింటుండగా వజ్రకిరీట విరాజిత, నవరత్నాలు తాపిన వరదాభయహస్తాలతో చిరునవ్వుతో, నిండుగా గంభీరంగా దర్శనమిస్తూ ఇలా పలికింది.

"నేను పద్మసాలీయుల ఆడపడుచును. పుట్టింటి వారైన పద్మసాలీయులు ముందుగా నాకు చీర, సారె సమర్పించిన తర్వాతనే ఇతరుల మర్యాదలను స్వీకరిస్తాను"

అలమేలుమంగ పలికిన కమనీయమైన సాక్ష్యంతో సమస్య తీరిపోయింది. సరిగ్గా 1541 అక్టోబరు 23వ తేదీ గురువారం శుభకృత్తు నామసంవత్సరం కార్తీకపున్నమి, గురువారంనాడు ఈ సంఘటన జరిగింది.

దీనికి గుర్తుగా రాగిరేకు శాసనంకూడ ఉంది.

## కొల్హాపురం మహాలక్ష్మికి కొండలరాయడి సారె!

భృగుముని చేసిన అనుచితకార్యంవల్ల విష్ణువుపై శ్రీమహాలక్ష్మి అలిగి వైకుంఠాన్ని విడిచి భూలోకంలో కొల్హాసురుడనే దుష్టరాక్షసుణ్ణి సంహరించింది. ఆ రక్కసుడు మరణిస్తూ, ఆ పురం తన పేరుతో ఉండాలని వరం కోరతాడు. అందుచేత కొల్హాసురభయంకరి అయిన "శ్రీమహాలక్ష్మి" మహారాష్ట్రంలోని కొల్హాపురక్షేత్రంలో స్థిరంగా నిలిచివుంది. అష్టాదశ శక్తిపీఠాల్లో ఇది ఒక్కటి. ప్రతి సంవత్సరం దసరా నవరాత్రుల సందర్భంగా కొల్హాపురంలోని "శ్రీమహాలక్ష్మి" అమ్మవారికి తిరుమల శ్రీవారినుండి పసుపుకుంకుమ చీరసారెలు పంపించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం.

కొల్హాపురంలోని శ్రీమహాలక్ష్మి, శ్రీవేంకటేశ్వరుని ప్రార్థనమేరకు తిరుచానూరులో "పద్మావతి"గా అవతరించిందని పురాణకథనం!

## పద్మావతికి పరంధాముడి సారె!

పద్మావతి పుట్టినరోజుకు జరిగే పదినాళ్ల పండుగలే కార్తీక బ్రహ్మోత్సవాలు. చివరిరోజున అంటే, అలమేలుమంగమ్మ అవతరించిన "పంచమితీర్థం" నాటికి తిరుమలపరంధాముడు ప్రియంగా పుట్టినరోజు సారెను పంపిస్తాడు.

రెండుపట్టుచీరలను, రెండు పట్టురవిక గుడ్డలను, పసుపుముద్ద, శ్రీగంధపు కర్ర, పచ్చి పసుపుకొమ్ములతోవున్న పచ్చని పసుపు చెట్లు, పూలమాలలు, తులసీమాలలతో పాటు ఒక బంగారుహారం (నగ), ఇవికాక పిండివంటలు ఒక పడి (51) పెద్దలడ్లు, ఒక పడి (51) వడలు, ఒక పడి (51) అప్పాలు, ఒక పడి (51) దోసెలు.

ఇలా వీటన్నింటిని ఆ రోజు ఉదయం ముందుగా తిరుమలలో శ్రీవారిమూలమూర్తికి సమర్పిస్తారు. ఆ తర్వాత వీటిని దేవస్థానం అధికారులు, పరిచారకులు, సిబ్బంది, కొత్త వెదురుబుట్టలలో పెట్టుకొని, కాలినడకన అలిపిరి పాదాల మండపం దగ్గరలోవున్న శ్రీపద్మావతి పసుపు మండపం దగ్గరికి వస్తారు. అక్కడి నుంచి పసుపుకుంకుమ, చీర సారెలను ఏనుగు అంబారీపైన పెట్టుకొని మేళతాళాలతో శ్రీ కోదండరామ స్వామివారిఆలయం శ్రీ గోవిందరాజస్వామి ఆలయాల మీదుగా తిరుచానూరుకు చేరుకుంటారు.

అక్కడ శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం అర్చకులు, అధికారులు తిరుమల శ్రీవారి సారెకు దివ్యమంగళనీరాజనాలతో ఘన స్వాగతం ఇస్తారు. పిదప తిరుచానూరు పురవీధులగుండా ఊరేగింపుగా వెళ్ళి శ్రీ పద్మావతి అమ్మవారికి సమర్పిస్తారు. వాటితో శ్రీపద్మావతి అమ్మవారికి,



శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు తిరుమంజనాదులు ఘనంగా జరిపిన పిదప పద్మసరోవరంలో సుదర్శన చక్రత్తాళ్వారుకు అర్చకులు పవిత్ర స్నానం చేయిస్తారు. సరిగ్గా ఆ సమయంలో వేలాది మంది భక్తులు, పవిత్ర స్నానాలు చేస్తారు.

## అలమేలుమంగమ్మకు ఆరగింపులు

శ్రీనివాస పరంధాముని పట్టపుదేవేరి పద్మావతికి ఉదయం సుప్రభాతవేళలో పాలు, పండ్లు ఆరగింపు చేస్తారు.

ప్రతిరోజు ముప్పూటలా పులిహోర, మిరియపు పొంగలి చక్కెరపొంగలి, దధ్యోదనాలను ఆరగింపు చేయడంతో పాటు, ప్రత్యేకంగా మొదటి నివేదనలో సీరా(రవకేసరి)ను, మధ్యాహ్నం రెండవ నివేదనలో లడ్డులను, వడలను ఆరగింపు చేస్తారు.

నిత్యమూ జరిగే శ్రీపద్మావతి పరిణయోత్సవవేళలో అప్పాలు, చక్కెరపొంగలి, పులిహోరలు తప్పనిసరిగా ఉంటాయి.

ప్రతి సాయంత్రం వేళ జరిగే ఊంజల్‌సేవలో సిరులతల్లికి శనగగుగ్గిళ్ళ (సుండలు)ను నివేదిస్తారు.

రాత్రి ఏకాంతసేవా (పవళింపు) సమయంలో గోరువెచ్చని పాలు, పంచకజ్జాయం నివేదింపబడతాయి.

ప్రతి గురువారం తిరుప్పావడ సేవలో పులిహోరలతోపాటు ప్రత్యేకంగా జిలేబీలు నివేదింపబడతాయి.

ప్రతి శుక్రవారం మధ్యాహ్నంవేళ పద్మావతికి ప్రత్యేకంగా పాయసం ఆరగింపు చేయబడుతుంది. శుక్రవారపు తోటలో ఆ మధ్యాహ్నం అభిషేకానంతరం వడపప్పు, పానకం, మిరియపు పొంగలిని, పిదప అలంకరణ అయిన తర్వాత పులిహోర, దోసెలు, సుండలు నివేదింపబడతవి.

### స్వర్ణ రథోత్సవాలు

బంగరుతల్లి పద్మావతికి రెండు దివ్యరథాలు వున్నాయి. ఒకటి చెక్కతేరు. రెండవది బంగారు తేరు.

ప్రతిఏటా కార్తీక బ్రహ్మోత్సవంలో తొమ్మిదవనాటి ఉదయం తిరుమలేశునిపత్ని పద్మావతికి చెక్కరథోత్సవం జరుగుతుంది. ఇదిగాక

తిరుచాన అలమేలుమంగ ప్రతి ఏటా ముచ్చటగా మూడు మారులు బంగారుతేరులో ఊరేగింపబడతారు. వార్షికవసంతోత్సవాల్లో భాగంగా వైశాఖమాసం పున్నమినాటి సాయంత్రం వేళలో మొదటిసారి, శ్రావణమాసం పున్నమికి ముందు శుక్రవారం వరలక్ష్మీవ్రతంనాటి సాయంత్రం రెండవమారు, బ్రహ్మోత్సవంలో గరుడవాహనం జరిగేనాటి సాయంవేళలో ఇలా మూడుమార్లు, పాలజలధికన్య పద్మావతి అమ్మవారు స్వర్ణరథంలో దర్శనమిస్తూ భక్తులకు మనోరథాలను అనుగ్రహిస్తుంది.

### గజవాహనోత్సవం

అలమేలుమంగమ్మ అవతరించిన నక్షత్రం ఉత్తరాషాఢ! కార్తీకమాసం శుద్ధపంచమీ శుక్రవారంనాటి అభిజిత్ లగ్నంలో ఉత్తరాషాఢా నక్షత్రంలో బంగారు పద్మంలో ఆవిర్భవించిన పద్మావతికి ప్రతి ఏటా పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరగడం సంప్రదాయం. అలాగే ప్రతినెలా అదే నక్షత్రం రోజున సాయంత్రంవేళ శ్రీ పద్మావతిఅమ్మవారు బంగారు గజవాహనంపై ఘనంగా ఊరేగుతూ "గజలక్ష్మి"గా దర్శనమిస్తారు.

**ఓం శ్రియై నమః**

* * *

# 3. తీర్పు కోరిన తిరుమలేశుడు

వేంకటరమణస్వామికి ఎన్నోపేర్లు వున్నా, ఆ అన్నింటిలో సరిగ్గా సరిపోయే పేరు మాత్రం ఒకటి వుంది. అదే 'సంకటహరణుడు' అని. అందుకనే భక్తులు వేంకటరమణా! సంకటహరణా!! అని గొంతెత్తి, ఏడుకొండలు మార్మోగేలా గట్టిగా పిలుస్తుంటారు. తమ సంకటాల్ని పోగొట్టుకుంటారు.

కొందరికి అనారోగ్యసంకటం. మరికొందరికి దారిద్ర్య సంకటం, ఇంకొందరికి పెళ్లికాకపోవడం, పెళ్లి అయినా సంతానం కలగకపోవడం... ఇలా ఎన్ని సంకటాలో... ఎన్నెన్ని సంకటాలో!

ఇల్లాంటి ఎన్నో సంకటాల్ని పోగొట్టే స్వామికి ఒక పెద్ద సంకటం వచ్చి పడిందంట! ఏడుకొండలవాడు తనకొచ్చిన సంకటాన్ని గూర్చి గొంతెత్తి రోజూ చెబుతునే వున్నాడు.

సుమారు వెయ్యేండ్ల నుండి తన దగ్గరకు వచ్చిన ప్రతి భక్తునితో చెబుతునే వున్నాడు. తన వాకిట్లో అడుగు పెట్టిన ప్రతియాత్రికునితో తన సంకటాన్ని గూర్చి విన్పిస్తూనే వున్నాడు.

ఇంతకు ఏడుకొండలవాడికి కలిగిన సంకటం ఏమిటంటే, ఎవడో ఆయన్ను కొట్టాడంట? కొట్టడం అట్లా ఇట్లా కాదు. ఏకంగా మొహం వాచేట్లు కొట్టాడు. దేంతో కొట్టాడయ్యా అంటే, ఇదిగో! పొడవుగా వున్న ఈ గడ్డపారతోనే, ఇంతలావు పాటి గడ్డపారతోనే అంటూ ఆ గునపాన్ని తన మొదటి గడపలో, అందరికీ బాగా కనపడేట్లుగా చాల ఎత్తున వేలాడదీసి చూపిస్తున్నాడు.

అబ్బో! ఇంత పెద్ద గడ్డపారతోనే! ఎలా కొట్టాడండీ! ఇంతకూ నిన్ను కొట్టిన ఆ పెద్దమనిషి ఎవరండీ!

అయినా ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దండి. నువ్వేం ఏం జెయ్యకపోతే మొహం వాచేట్లు అలా కొడతాడా? నిజం చెప్పు, నీ వేదో ఘనకార్యం చేసుంటావు. అందుకే ఇలా జేశాడు కదా! పైగా ఆ గడ్డపారను అంత ఎత్తున కట్టి అందరికీ చూపిస్తూ, పెద్దగా రాద్ధాంతం చేస్తున్నావు. బలేవాడివయ్యా వెంకయ్యస్వామీ!

ముందు నువేం జేశావో నిజం చెప్పు.

"వెయ్యేండ్లనాడు ఈ కొండమీద అనంతయ్య అనే భక్తుడు వుండేవాడు. ఆయనకు దేవుడి కంటె, అంటే నా కంటె కూడా గురువు మీదే భక్తి. గురి! గురువంటే ప్రాణం! ఆ గురువు చెప్పాడంట! శ్రీరంగక్షేత్రం నుంచి తిరుమలకు వెళ్లు. అక్కడ పూలతోటను పెంచు. దాని కోసం ఒక నీళ్లగుంటను తవ్వు. ఆ పువ్వులతో అనుదినం ఆనందనిలయుణ్ణి అలంకరించు అన్నాడంట!" గురువు మాట వేదం. ఆలస్యం లేకుండా వేంకటాచలం చేరుకున్నాడు. వెంటనే నీళ్లకోసం గుంటను తవ్వడం ప్రారంభించాడు. ఆయనకు తోడు ఆయన భార్య. ఆ తల్లి ఆయనకు సరిజోడు. 'గోవిందా! అంటూ ఆయన మట్టి తవ్వడం, వెంకటేశా! అంటూ దాన్ని ఆమె దూరంగా పోయడం. ఇదీ వాళ్లిద్దరి నిత్యకృత్యం రామనామం!

నా కోసమే దీక్షగా భక్తిగా పనిచేస్తున్న వీళ్లిద్దర్నీ చూశా! జాలి వేసింది. వాళ్లు చేస్తున్న పనికి కొంచెం సాయం చేద్దామని పన్నెండేళ్ల కుర్రవాడి వేషంతో వెళ్లాను. "నేను సాయం చెయ్యనా" అని అడిగాను. అనంతయ్య కళ్లెర్రజేసి చురచుర చూశాడు. కొంచం భయపడుతూ "నాకు కూలి డబ్బులు వద్దులే. ఊరికే చేస్తాను" అన్నాను. అనంతయ్య అంతులేని కోపంతో తిట్టాడు. ఇంకా మీదపడి తంతాడేమో అని భయపడ్డాను. నేను వచ్చినవేళ మంచిది కాదేమో అని వెళ్లిపోయాను.



ఆ తర్వాత కొన్ని రోజులకు మళ్లీ వచ్చి చూశాను. గుంటను లోతుగానే తవ్వాడు. అనంతయ్య ఇంకా తవ్వుతూ మట్టిని అందిస్తూనే వున్నాడు. ఆయన భార్య మట్టిని దూరంగానే పోస్తూ వుంది. కాని ఆమె బాగా ఆయాసపడుతోంది. దగ్గరికి వెళ్లి చూశా. ఆమె నిండుచూలాలు. అందుకే అలసిపోతోంది. పాపం! వెంటనే నేను "తల్లీ! ఆ మట్టిగంపను ఇటివ్వు. దూరంగా పోసొస్తా" అని తీసుకున్నాను. ఆమె ఎంత బాధపడుతోందో? వెంటనే మట్టిగంపను ఇచ్చింది. దూరంగా మట్టిని పోసి వస్తున్నా.

ఇంతలోనే అనంతయ్య చూడనే చూశాడు. అంతే! ఉగ్రుడయ్యాడు. గుంటపైకి వచ్చి 'ఎవడవురా నీవు? ఈ పని చెయ్యమని ఎవరైనా అడిగార్రా వెధవా?' అంటూ భరింపరాని, వినరాని తిట్లపురాణం చదివాడు. బిత్తరపోయివున్న భార్యను చూస్తూ "పనికిమాలినదానా! నీకైనా తెలివిలేదా! ఒకసారి వద్దన్నానే కదా. మళ్లీ వచ్చాడు. నీకు అంత చేతకాకపోతే, నేనే చేసుకునేవాణ్ణి కదా." అంటూ ఆమెనూ, నన్నూ తిట్టినా ఆయన కోపం తగ్గలా. ఇంకా ఎక్కువైంది. చేతిలోని గునపంతో నా వెంట పడ్డాడు. తప్పించుకొని పరిగెత్తా. వెంటబడి ఆ గడ్డపారను నాపైకి విసరివేశాడు. అది నా గడ్డానికి తగిలి గాయమయ్యింది. ఇదిగో! ఇదే ఆ గాయం. బొట బొటా నెత్తురు కారుతోనే వుంది. దానికి పచ్చకర్పూరం పొడిని ప్రతిరోజూ అద్దుకుంటూనే వున్నా! అనుకోండి.

ఇప్పుడు చెప్పండి. నేను జాలిపడి సాయం చెయ్యడం తప్పా? కూలి కూడ వద్దన్నా కదా! అయినా మొహం వాచేట్లు కొట్టేంత తప్పు కాదే ఇది. కలియుగ ధర్మం కాబోలు.

ఇప్పుడు చెప్పండి. అనంతయ్యకు ఏం శిక్ష వెయ్యాలో?

ఇంతటితో ఆగాడా? ఇంకో తప్పు కూడా చేశాడు అతగాడు. దాన్ని గూడా మీకు చెప్తా. వినండి మరి!

**'అనంతయ్య తోట చాల బాగుంది. అందంగా వుంది. ఒక్కసారైనా ఆ తోట అందాల్ని చూచి తీరాల్సిందే!' అని అందరూ అనుకొంటుంటే, మెచ్చుకుంటుంటే విన్నాం. దాన్ని చూడాలని నేనూ, నా హృదయలక్ష్మి వ్యూహలక్ష్మి ఇద్దరం ఉబలాట పడ్డాం. ఆ తోట అందాల్ని ఆస్వాదించి ఆనందిద్దాం అని ఇద్దరం వెళ్లాం. అది కూడా తప్పేనా?**

అనంతయ్య అభిరుచుల్ని మెచ్చుకోడానికే కదా వెళ్లాం. అబ్బ! నిజంగా ఆ తోట అందచందాలు ఒకటా! రెండా! అబ్బో! ఎన్నెన్ని రంగుల పువ్వులు. ఎన్నెన్ని ఘుమ ఘుమలు, దవనాలు, మరువాలు, తోటంతా కలియ దిరుగుతూ అందాల్ని చూశాం. ఆనందించాం. ఆ సమయంలో చాపల్యంకొద్దీ ఒకటి రెండు పూలను తుంచాం. వాసన చూశాం. మరి కొన్నింటిని సిగల్లో పెట్టుకొన్నాం.

అంత మాత్రానికే ఆ అనంతయ్య అంతులేని కోపం చూపిస్తాడా! భార్యాభర్తలు అనుకోకుండా, మాటువేసి మా ఇద్దర్నీ పట్టుకొని బంధిస్తాడా. నేను మగరాయుణ్ణి కనుక ఎట్లో తప్పించుకొని వచ్చాలే! పాపం నా పెండ్లాం. ఆడకూతురు కదా. సుకుమారి. తప్పించుకోడానికి గింజుకుంది. పిట్టపిల్లలాగా కీచు కీచుమని గీపెట్టింది. కాని ఆ అనంతయ్య కొంచం కూడా కనికరం లేకుండా. అమెను సంపెంగ మానుకు తీగలతో కట్టివేస్తాడా! ఇదెంతటి ఘోరతప్పిదం?

ఇప్పుడు జెప్పండి. అతను చేసిన తప్పిదాలకు ఏ శిక్షలు వెయ్యాలో చెప్పండి. ఓ భక్తులారా మీరే తీర్పరులు...

భక్తులారా! వీటికి ఏ శిక్షలు వెయ్యాలో చెప్పండి. అలా నీళ్లు నములుతారేం! చెప్పండి మరి! ఉహూ... మీరేం జెబుతారు. చెప్పనే చెప్పరు. చెప్పలేరు కూడా. ఎందుకంటే మీరు అందరూ ఆయనకు తోటి భక్తులే కదా!



అందుకే, మీరు అందరూ మౌనం విడిచి పెట్టి, తీర్పు చెప్పేంతవరకు, నేనే ఒక పని చేస్తా!

**"ఇదిగో! ఈ గునపం (గడ్డపార)తోనే నా గడ్డాన్ని పగలగొట్టాడు. అందరూ చూడండహో! అంటూ నా వాకిట్లో అందరికీ కనబడేట్లుగా చాలా ఎత్తున వేలాడదీస్తా. అనంతయ్య భక్తి బండారాన్ని బయటపెడ్తా! ఇదేగాక, ఇంకా పచ్చకర్పూరాన్ని అద్దుకొని గడ్డం మీది గాయాన్ని కూడా నా దగ్గరికి వచ్చిన ప్రతి భక్తుడికీ చూపిస్తా"**

ఇంక రెండో తప్పుకు, అంటారా? ఆ రోజే నేనే శిక్ష వేశాలే! వ్యూహలక్ష్మిని పూలగంపలో పెట్టుకొని భయభక్తులతో మోసుకొని రమ్మన్నా. వచ్చాడు. దానికి అనంతయ్యకు కన్యాదాన ఫలం సిద్ధించింది. నాకు **'మామ'** అయ్యే ఫలం దక్కింది. అందుకే ప్రతి బ్రహ్మోత్సవంలో రథోత్సవం రోజున "అనంతయ్య'కు ఘనంగా కానుకలిస్తూ గౌరవిస్తూనే వున్నా.

అన్నట్లు మరిచిపోయా. ఈ సంఘటన తర్వాత అనంతయ్య 'అనంతాళ్వారు' అని గౌరవంగా పిలువబడుతున్నాడు. ఆయన తోటా, ఇల్లూ గుడికి నైరుతి మూలలో ఉన్నాయి.

భక్తులకు ఈ రెండు మధుర సన్నివేశాలు గుర్తుండటం కోసమే ప్రతిఏటా **ఆడిమాసం (కర్కాటక)మాసం** పుబ్బ నక్షత్రం రోజున, **ఆలయ ప్రదక్షిణంగా ఒకసారీ, బ్రహ్మోత్సవంలో చివరి రోజున అప్రదక్షిణంగా రెండవసారీ,** అనంతాళ్వార్ తోటకు ఊరేగింపుగా వెళ్లి అనంతయ్యను ఈనాటికీ సత్కరించి వస్తున్నాను తెలిసింది కదా! మీరు అందరూ, అనంతయ్య తోటను, ఆయన సమాధిని దర్శించండి. తరించండి.

**ఓం భక్త వశ్యాయ నమః**

# 4. ఆనంద నిలయంలో
# ఆండాళ్ పాశురాల పారాయణ

ఏడుకొండలవాడు ఏడేడు లోకాల్లో ఈడే లేని, సరిజోడే లేని విచిత్రమైన దేవుడు! వింత వింత వెలుగుల దేవుడు!

తిరుమలలోని విచిత్రాలు అన్నీ ఇన్నీ కాదు. ఆయన ఉన్న 'బంగారుమేడ' విచిత్రమే. ఆయన రూపే విచిత్రం! ఆయన నిలువెత్తు అలంకారాలు విచిత్రమే! ఆయనకు చేసే నివేదనలు విచిత్రాతి విచిత్రం! ఆయనకు నిర్వహించే ఉత్సవాలేమీ, ఊరేగింపులేమీ ఇవన్నీ విచిత్రమే! ఇన్ని విచిత్రాలను చూస్తూ ఆనందంగా అనుభూతులను పొందడానికే నిత్యం వేలాదిమంది భక్తులు తిరుమలకు తరలి రావడం మరీ విచిత్రాతి విచిత్రం!

ఈమాట నూటికి నూరుపాళ్లు సత్యమైనమాట! అందులోను ఏడాదిలో ఒకనెల మాత్రం తిరుమలక్షేత్ర చరిత్రలోనే మరీ విచిత్రం!

**ఆ నెలే ధనుర్మాసం.**

ఈ ధనుర్మాసం మార్గశిరం (మార్గళి), పుష్యం(తై). ఇలా రెండు నెలల్లో కలసి వస్తుంది. అనగా ప్రతి సంవత్సరం డిశంబరు 15 నుండి జనవరి 14 వరకు గల మాసాన్ని "ధనుర్మాసం" అంటారు. ఈ ధనుర్మాసంలో తిరమల ఆలయంలో చోటు చేసుకొనే విచిత్రాల్ని తెలుసుకుందాం.

**ధనుర్మాసంలో సుప్రభాత పఠనం ఉండదు**

తిరుమలలో శ్రీవారి ఆలయం ఏడాది పొడవునా ప్రతిరోజు తెల్లవారుజామున 3 గంటల వేళ తెరవబడుతుంది.



"కౌసల్యాసుప్రజా రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అన్న సుప్రభాత పఠనంతో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిరోజు బ్రాహ్మీముహూర్తంలో మేల్కొలుపు సేవ జరుగుతుంది. ఇది ఏడాది పొడవునా జరుపబడుతుంది. కాని ఒక్క ధనుర్మాసంలో మాత్రం సుప్రభాత పఠనం ఉండదు! మరి ఏముంటుంది! అంటే!

**ఆండాళ్ పాశురాల పారాయణ ఉంటుంది**

ధనుర్మాసంలో ప్రతిరోజు తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత పఠనానికి బదులుగా గోదాదేవి గానం చేసిన ముప్పది పాశురాల "తిరుప్పావై"ని పఠిస్తూ శ్రీ వేంకటేశ్వరస్వామివారిని మేల్కొలుపుతారు.

ఈ నెలరోజులపాటు కేవలం జియ్యంగారులు, ఏకాంగి, శ్రీవైష్ణవ ఆచార్యులు మాత్రమే ఏకాంతంగా "తిరుప్పావై" పాశురగానాన్ని నిర్వహిస్తారు. "సుప్రభాత సేవ"లో మాదిరిగా ఇతర భక్తులకు ఇందులో ప్రవేశం లేదు. ఉండదు.



తమిళ సాహిత్యంలో నాలుగు వేలపాటలు (పాశురాలు) వున్న "నాలాయిర దివ్య ప్రబంధం" చాల ప్రసిద్ధమైంది. ఈ దివ్య ప్రబంధం పాటల్ని శ్రీవైష్ణవ ప్రపంచంలో పరమ శ్రీవైష్ణవ భక్తాగ్రేసరులైన పన్రెండుమంది ఆళ్వారులు పరవశిస్తూ గానం చేశారు. ఈ నాలుగు వేలపాటలు వేదాలతో సమానం.

వాటిల్లో ముప్పై పాటలు వున్న ఈ 'తిరుప్పావై'ని శ్రీవేంకటేశ్వరుని పరమభక్తురాలుగా ప్రసిద్ధిని పొందిన "గోదాదేవి" రచించింది. ఈ తల్లి పన్రెండు ఆళ్వారులలో ఏకైక స్త్రీ ఆళ్వారుగా, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అవతారంగా సంభావింపబడుతూ వుంది. ఈ గోదాదేవి "ఆండాళ్" అని కూడ పేరు పొందింది.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుణ్ణి భర్తగా పొందవలెననే ఉద్దేశంతో "మార్గశిర మాసం"లో గోపికలు కాత్యాయనీ వ్రతం చేశారు. అలాగే గోదాదేవి కూడా తనను తాను గోపికగా భావించుకొని ధనుర్మాసంలో నెలరోజులపాటు ఆ వ్రతాన్ని ఆచరించింది. నెలరోజులపాటు ప్రతి దినం. వేకువజామున్నే శ్రీవిల్లిపుత్తూరులో వేంచేసివున్న వటపత్రశాయి అయిన శ్రీవిష్ణువును గూర్చి రోజుకొక్క పాటను. తన్మయిస్తూ పరమభక్తితో గానం చేసింది. ఈ వ్రతాన్ని ముప్పై రోజులపాటు ఆచరించి చివరకు శ్రీరంగనాథుణ్ణి పరిణయమాడి "ఆండాళ్"గా చిరకీర్తిని పొందింది.

ఆండాళ్ అనగా భగవంతుణ్ణి వశం చేసుకొన్న పరమభక్తురాలైన స్త్రీ అని అర్థం. గోదా – అనగా పూలమాల ఇచ్చినది. ప్రధానంగా శ్రీవేంకటాచలపతిని గూర్చి

**"వెయ్యదోర్ తళలు మిళ్ శక్కరక్కై**
**వేంగడ వర్కన్నై విదికిత్తియే"**

అంటూ ఆనందంగా గానం చేసింది ఆండాళ్.



**"వేయి వెలుగుల ప్రకాశంతో, శంఖు చక్రాలను ధరించి దర్శనమిస్తున్న తిరువేంకటపతికి నేను సంపూర్తిగా అంకితమవుతున్నాని "నాచ్చియార్ తిరుమొళి"లో విన్నవించుకొని ఆనందనిలయుణ్ణి ఆండాళ్ శరణాగతి పొందింది."**

గోదాదేవి చెప్పిన భక్తి పూర్వకమైన అంకిత భావాన్ని దృష్టిలో వుంచుకొని భగవద్రామానుజులవారు తిరుమల తిరుపతి ఆలయాల్లో కూడ ధనుర్మాసంలో తిరుప్పావై పఠనను ప్రతి ఏటా ధనుర్మాసంలో అనుష్ఠింపచేయునట్లు కట్టడి చేశారు.

భగవద్రామానుజులవారి ఏర్పాటు ప్రకారం నెలరోజుల పాటు ధనుర్మాసంలో బంగారు వాకిలిముందు ప్రతిరోజూ వేకువజామున ముప్పై పాశురాలను పూర్తిగా, జియ్యంగార్లు, ఏకాంగి ఇతర వైష్ణవాచార్యులు పఠిస్తారు. ఏకాంతంగా సాగే ఈ పాశురాల పారాయణం పూర్తి అయిన తర్వాత శ్రీస్వామివారికి తోమాలసేవ అనే పుష్పాలంకరణ జరుగుతుంది.

**వేంకటేశ్వరుడే శ్రీకృష్ణుడు! – వ్యూహలక్ష్మే ఆండాళ్!**

మరోవిచిత్రం ఏమంటే ధనుర్మాసం ముప్పై రోజులపాటు, శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తిని శ్రీకృష్ణుడిగాను, వక్షఃస్థల వ్యూహలక్ష్మిని ఆండాళ్‌గాను భావించి అలాగే అలంకరిస్తారు. శ్రీస్వామివారి నడుములో ''తిరుప్పావై'' అనే బంగారు పతకాలమాలను కటిబంధంగా అలంకరిస్తారు. ఇక వక్షఃస్థలంలో కుడివైపు వున్న వ్యూహలక్ష్మికి ఎర్రని కెంపులను పొదిగిన బంగారు చిలకబొమ్మను అలంకరిస్తారు. అలాగే హృదయంమీద ఎడమవైపున పచ్చని తమలపాకులు, పూలతో, ఆకులతో తయారు చేసిన చిలుక బొమ్మను కూడ అలంకరిస్తారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పరమభక్తాగ్రేసరుడు తాళ్లపాక అన్నమాచార్యులుకూడ చూడికుడుతనాంచారి అయిన గోదాదేవిని సాక్షాత్తు శ్రీమహాలక్ష్మిగా కీర్తించాడు.



చూదరమ్మ సతులాల సోబాన పాదరమ్మ
కూడున్నది పతి చూడికుడుత నాంచారి ॥పల్లవి॥

శ్రీమహాలక్ష్మి యట సింగారాల కేమరుదు
కామునితల్లి యట చక్కదనాల కేమరుదు
సోమునితోబుట్టు వట సొంపుకళల కేమరుదు
కోమలాంగి ఈ చూడికుడుతనాంచారి ॥చూడ॥

కలశాబ్ధికూతు రట! గంభీరాల కేమరుదు
తలప లోకమాత యట! దయ మరి ఏమరుదు
జలజలనివాసిని యట! చల్లదన మేమరుదు
కొలదిమీర ఈ చూడికుడుతనాంచారి ॥చూడ॥

అమరవందిత యట! అట్టే మహిమ ఏమరుదు
అమృతముచుట్ట మట! ఆనందాల కేమరుదు



తమితో శ్రీవేంకటేశుడు తానె వచ్చి పెండ్లాడె
కౌమెరవయసు ఈ చూడికుడుతనాంచారి ॥చూడ॥

తోమాలసేవలో కూడ మళ్లీ జియ్యంగార్లు, ఏకాంగి, వైష్ణవచార్యులు ముప్పైపాశురాల్లో ఏ రోజు పాశురాన్ని ఆ రోజు రెండు మార్లు గానం చేస్తారు. అంతటితో తోమాలసేవ పూర్తి అవుతుంది. ధనుర్మాసంలో ప్రతిరోజు జరిగే పుష్పాలంకరణమనే తోమాలసేవలో శ్రీవారి వక్షఃస్థలంలో బంగారు చిలుక – తమలపాకులు, పూలతో చేసిన చిలుక బొమ్మలను భక్తులు, ఉదయం నుంచి రాత్రి వరకు కన్నులారా చూడవచ్చు.

**బిల్వదళాలతో సహస్రనామార్చన**

ఏడాది పొడవునా ప్రతిరోజూ తిరుమల శ్రీవారికి తోమాలసేవ అయిన వెంటనే మొదటి అర్చనగా వేయినామాలతో సహస్రనామార్చన జరుగుతుంది. ప్రతిరోజు జరిగే ఈ సహస్రనామార్చనలో తులసిదళాలను ఉపయోగిస్తారు. కాని,

ధనుర్మాసంలో మాత్రం ప్రతిరోజూ మొదటి అర్చనగా సాగే సహస్రనామార్చనలో మారేడు (బిలువం)దళాలతో అర్చకస్వాములు శ్రీవారి పాదపద్మాలను అర్చిస్తారు.

బిల్వ(మారేడు) దళాల్లోను, బిల్వవనంలోనూ శ్రీమహాలక్ష్మి వుంటుందట! “ఓం నమో బిల్వవనస్థాయై విష్ణుపత్న్యై నమః” అని శ్రీమహాలక్ష్మి అమ్మవారిని కీర్తించడం వుంది. అందువల్లే ధనుర్మాసంలో తిరుమల శ్రీవారి సహస్రనామార్చనలో బిల్వదళాల్ని ఉపయోగిస్తారు.

**వేడి వేడిగా నేతి పొంగళ్లు, బెల్లపు దోసెలు**

ధనుర్మాసంలో నెలరోజులూ, తిరుమలేశునికి విచిత్రంగానే కొన్ని నివేదనలు అదనంగా నివేదింపబడతాయి. తెల్లవారు జామున శీతాకాలం చలిలో వేడి వేడి పొంగళ్లు, పాయసాలతో పాటు శ్రీనివాసుడికి “బెల్లపు దోసె” ప్రత్యేకంగా నివేదింపబడుతుంది. అరఅంగుళం మందంతో

విశాలంగా గుండ్రంగా వుండే ఈ నేతి దోసెను బెల్లంపాకంలో ముంచి ప్రక్కన పెడతారు. ఇలా తయారుచేసిన "బెల్లపుదోసెలు" ధనుర్మాసంలో నెలంతా ప్రతిరోజూ ప్రత్యేక నివేదనగా వుంటాయి.

**చిన్ని కృష్ణునికే పవళింపుసేవ!**

ఏడాదిపొడవునా ప్రతిరోజు రాత్రి చివరగా తిరుమల శ్రీవారి ఆలయంలో 'ఏకాంతసేవ' అనే పవళింపుసేవ జరుగుతుంది. బంగారు నవారా పట్టెమంచంపై మెత్తనిదూది పరుపుపైన శ్రీనివాసస్వామివారి వెండి భోగమూర్తికి శయనింపు భాగ్యం కలుగుతుంది. కాని

ధనుర్మాసంలో నెలరోజులు మాత్రం ప్రతిరోజు రాత్రి చివరగా జరిగే 'పవళింపుసేవ'లో భోగశ్రీనివాసమూర్తికి బదులుగా **శ్రీ వెన్నముద్ద కృష్ణుని వెండి విగ్రహమూర్తి** మాత్రమే పాల్గొంటాడు.

**మేల్కొలుపులు చిన్ని కృష్ణునికే!**

ప్రతిరోజు రాత్రి బంగారు తూగుటుయ్యాల మంచంపై పవ్వళించిన చిన్ని కృష్ణుణ్ణి తెల్లవారుజామున జియ్యంగారులు, వైష్ణవాచార్యులు, గోదాదేవి "తిరుప్పావై" పాశురాలను గానం చేస్తూ మేల్కొల్పుతారు. ఇలా నెలరోజులపాటు ధనుర్మాసమంతా ఏకాంతంగా జరిగే తిరుప్పావై పఠనం అనంతరం చిన్నికృష్ణుని వెండిమూర్తికి గోరువెచ్చని నీటితో స్నానం చేయించిన తర్వాత పాలు, వెన్న, బెల్లపుదోసె, వేడి వేడిగా వున్న పొంగళ్లను నివేదిస్తారు.

**తిరుమలక్షేత్రం – తిరుప్పావై మహిమ**

"తిరుమలక్షేత్రానికి – తిరుప్పావై"కి వున్న సన్నిహిత సంబంధం చాల గొప్పది!

పూర్వం ఉగ్రాస్యుడు అనేరాజు "తిరుప్పావై"ని పారాయణం చేసి 'శంకరదత్తుడు' అనే కొడుకును పొందాడు. అతడు విష్ణుద్వేషి. వైకుంఠనగర రాజైన గోవిందునిపైకి దండెత్తి ఓడిపోతాడు. శంకరదత్తుడు



దేశదిమ్మరిగా తిరుగుతూ తిరుమలక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శిస్తాడు. సరిగ్గా అది ధనుర్మాస సమయం. శంకరదత్తుడు వైష్ణవం స్వీకరించి 'వేంకటదాసు' అని పేరు మార్చుకొని, ఒక సంవత్సరంపాటు "తిరుప్పావై"ని తిరుమలలోనే పాండవతీర్థంలో వుంటూ నిత్యమూ పారాయణం చేశాడు. 'తిరుప్పావై' పాశురాల పారాయణ ఫలితంగా శ్రీవేంకటేశ్వరస్వామి గోవిందునికి కలలో కనపడి వేంకటదాసు (శంకరదత్తుడు)కు తిరిగి రాజ్యాన్ని ఇప్పిస్తాడు.

తిరుప్పావై మహిమను తెలియజేసే ఈ ఘట్టం 'గురు పరంపరా ప్రభావం' అనే తమిళగ్రంథంలో తెలుపబడింది.

**సర్వవేదాలసారం**

**పాతకంగళ్ తీర్కుం పరమ నడి కాట్టుం**
**వేద మనైత్తుక్కుం విత్తాహుం – కోదై తమిళ్**
**ఐయ్యైందుం ఐందుం అరియాద మానిడరై**
**వైయ్యం సుమప్పదుం వంబు.**

ముప్పై పాశురాల 'తిరుప్పావై' సర్వవేదాలసారం! ఆండాళ్ సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి! మనమందరం ద్వాపరయుగం నాటి గోపికలమని భావిస్తూ, పురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానుణ్ణి కీర్తిస్తే చాలంట! అందరికీ సర్వశ్రేయస్సులూ, శుభాలు కలుగుతాయని ప్రచారం చేశారు భగవద్రామానుజులవారు. అందుకనే వారికి 'తిరుప్పావై జీయర్" అనే ప్రసిద్ధి ఏర్పడింది.

వారు ఉపదేశించినట్లు 'తిరుప్పావై' పారాయణం చేస్తూ ధనుర్మాసంలో వేంకటాద్రి కృష్ణుణ్ణి, ఆ గోవిందుని వక్షఃస్థలంలో చిలుకలతో విరాజిల్లుతూ వున్న వ్యూహలక్ష్మి అయిన ఆండాళ్ (గోదాదేవి)ను కన్నులారా దర్శించి ధన్యులమవుదాం.

* * *

# 5. మార్కండేయుని వేంకటాచలయాత్ర

మార్కండేయమహర్షికి 'సమస్తలోకాల్లోని అన్ని తీర్థాల్లోనూ స్నానాలు చేయాలనీ, బ్రహ్మాండాల్లోని అన్ని పుష్కరిణిల్లోనూ మునకలు వెయ్యాలనీ ఓ విశిష్టమైన ఆశ కలిగింది.

తనకేమో ఎంతకూ తరగని, పెరగని వయస్సు. పైగా చిరంజీవి. ఇంకేం కావాలి? తన కోరిక తీరడానికి. ఇలా అనుకున్నదే ఆలస్యం! తీర్థయాత్రలకు బయలుదేరాడు. తనకు ఎదురుపడిన, కనపడిన తీర్థాలన్నింటిల్లోనూ, ఇతరులద్వారా తెలుసుకున్న తీర్థాల్లోనూ స్నానాలు చేశాడు. అక్కడి అనుష్ఠానాలూ, తీర్థవిధులూ ఆచరించాడు.

ఇలా అంతు లేకుండా తిరుగాడుతున్నందువల్ల మార్కండేయ మహర్షికి ఏదో తెలియని రుగ్మత కలిగింది. ఎక్కడ లేని నీరసం వచ్చింది. పాపం! ఇంతా చూస్తే భూమండలంలోని కొన్నివందల తీర్థాల సందర్శనం మాత్రమే! ఇలా జరిగిందే! భూలోకం అంతా తిరిగేది ఎప్పుడు? ఇవిగాక సమస్తలోకాల్లోని తీర్థాల్లో స్నానం చేసేదెప్పుడు? – అనే అసంతృప్తి మిగిలింది. అయ్యో! తన కోరిక తీరదేమో! అనే నిరాశకు లోనయ్యాడు మార్కండేయుడు.

పూర్వం తాను పట్టిన మంకుపట్టు వల్ల పరమేశ్వరుడే కరగిపోయి తన ప్రాణం నిలబెట్టడమే గాక, చిరంజీవత్వాన్ని ప్రసాదించాడు కదా! అందువల్ల నిరుత్సాహ పడరాదు. అయితే ఏం చెయ్యాలో తెగ ఆలోచించాడు. అందుకు ఒక అద్భుతమైన ఊహ తట్టింది. అంతే దాన్ని అమలు చేశాడు.

చతుర్ముఖబ్రహ్మదేవు డున్నాడు కదా! ఆయన్ను గూర్చి తపస్సు చేద్దాం – అనుకొని ప్రారంభించాడు కూడా! బ్రహ్మ దేవునికి ఆశ్చర్యం



కలిగింది. ఇదేమిటి? సాక్షాత్తు పరమశివుడే చిరంజీవత్వాన్ని ప్రసాదించిన మార్కండేయుడేమిటి? తనను గూర్చి తపస్సు చెయ్యడ మేమిటి? ఆనందంతో వెంటనే ప్రత్యక్షమయ్యాడు.

'అయ్యా! మహర్షీ! ఎందుకోసం ఈ తపోదీక్ష! ఏం కోరిక మిగిలింది?' అన్నాడు – బ్రహ్మదేవుడు.

"సృష్టికర్తా! బ్రహ్మదేవా! నాకొక ఆశ కల్గింది. నా ఆశ అడియాస కాకుండా నెరవేర్చు. ఎందుచేతంటే ఇప్పటికే నాకు తెలిసిన తీర్థాల్లో, విన్న తీర్థాల్లో స్నానాలు చేశాను. ఈ కొద్దిపాటి తీర్థాల సందర్శనంతోనే నేను నీరసించిపోయాను. నా శరీరం శుష్కించిపోయింది. దీనివల్ల నా కోరిక తీరదేమోననే భయం ఏర్పడింది. అందువల్ల, సమస్త బ్రహ్మాండాల్లోని సర్వతీర్థాల్లోనూ స్నానం చెయ్యాలనే నా కోరిక తీరేట్లుగా వరం అనుగ్రహించండి!" అంటూ రెండు చేతులనూ జోడించాడు మార్కండేయమహాముని.

ప్రసన్నవదనంతో మందహాసం చేస్తూ బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు.

"మార్కండేయమహాశయా! నీ తపస్సు అమోఘం! అద్భుతం! నీ కోరిక ఆశ్చర్యం! నీ కున్న కోరిక అడిగావు – బాగుంది. కానీ అది ఎన్నటికీ తీరని కోరిక! నీకే కాదు – ఆ పరమశివునికి గాని, నాకు గాని అలాంటికోరిక తీరదుగాక తీరదు. ఎందుకంటే, బ్రహ్మాండాలు అనంతం! మరి వాటిల్లోని తీర్థాలు కూడా అనంతమే! అందువల్ల నెరవేరని ఆ వరం ఇవ్వడంలో అర్థమే లేదు. కానీ, ఒక్కమాట! సమస్తతీర్థాలను సేవించలేక పోతున్నానే అని నీవు చింతించవద్దు. ఆ తీర్థాలన్నింటినీ దర్శించినఫలం వచ్చే ఉపాయం మాత్రం చెబుతాను. దాన్ని ఆచరించు. చాలు.

**అస్తి శ్రీవేంకటో నామ ప్రథితః పర్వతోత్తమః**
**ద్రవిడేషు మహాపుణ్యః సేవితః త్రిదశై ర్గిరిః**

**తస్య శృంగే సుమహతీ పుణ్యా పాపవినాశినీ**
**స్వామిపుష్కరిణీ నామ సరసీ సర్వకామదా ॥**

భూమండలంలో మేరుపర్వతానికి దక్షిణంగా 'శ్రీవేంకటం' అనే పేరుతో ఒక అద్భుతమైన పర్వతం ఉంది. ఉత్తమోత్తమం అయిన ఆ వేంకటాచలశిఖరాన్ని అన్నివేళల్లోనూ దివ్యశక్తిసంపన్నులైన ఎందరో దేవతలు సేవిస్తుంటారు.

ఎవరో ఎందుకు? ప్రతిరోజూ బ్రాహ్మీముహూర్తంలో నేనూ, నాతో పాటు ఎందరో దేవతలు **"శ్రీస్వామిపుష్కరిణి"**లో స్నానంచేసి, శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శిస్తాం. అంతేకాదు – మార్కండేయా! నిన్ను యముని బారినుండి రక్షించిన 'రుద్రుడే' ఆ క్షేత్రపాలకుడు. అలాంటి దివ్యమైన ఆ క్షేత్రంలో **శ్రీస్వామిపుష్కరిణి** అనే మహిమాన్వితమైన సరస్సు ఉంది. ఆ కోనేరు సర్వపాపాలను పోగొడుతుంది. అనంత పుణ్యాలు కలిగిస్తుంది. అన్ని కోరికలనూ తీరుస్తుంది.

అంతటి గొప్పక్షేత్రంలోని ఆ స్వామిపుష్కరిణీ తీర్థంలో స్నానం చెయ్యి, నీకు ఎలాంటి బడలిక లేకుండానే సులువుగా నీ కోరిక నెరవేరడంతోపాటు, సమస్త తీర్థాలను సేవించిన ఫలంకూడా సిద్ధిస్తుంది.

మార్కండేయమునీ! ఇంకొక్కమాట.

**శ్లో॥ ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే**
**ఆయాంతి సర్వతీర్థాని స్వామిపుష్కరిణీ జలే ।**
**తత్ర స్నాత్వా నరః సద్యో ముక్తి మేతి న సంశయః**
**యస్యజన్మ సహస్రేషు పుణ్యమేవార్జితం పురా ॥**

ధనుర్మాసంలో అనగా మార్గశిరమాసం శుద్ధ ద్వాదశినాటి అరుణోదయవేళలో ప్రతి ఏటా – పద్నాలుగు లోకాల్లోని తీర్థాలన్నీ



ఏడుకొండలవాని సన్నిధిలోని **"శ్రీస్వామిపుష్కరిణి"**లో దివ్యరూపంతో స్నానాలు చేస్తాయి. ఎందుకో తెలుసా?

అన్ని లోకాలవాళ్లూ ఆ యా తీర్థాల్లో స్నానం చేసినందువల్ల తమకు సంక్రమించిన మహాపాతకాలన్నింటినీ – ప్రతి సంవత్సరం ధనుర్మాసం లోని వైకుంఠద్వాదశి నాటి సూర్యోదయవేళలో **స్వామిపుష్కరిణీ** తీర్థంలో స్నానం చేసి, ఆ తీర్థాలు పోగొట్టుకుంటాయి. ఇది పరమ సత్యమైన మాట.

ఒక్కప్పుడు ఈ తీర్థాలన్నీ శ్రీమన్నారాయణుని దగ్గరికి వెళ్ళి, మొర పెట్టుకున్నాయట! భక్తులు తమలో మునిగినందువల్ల తమకు సంక్రమించిన పాతకాలు నశించేమార్గం గానీ, మంత్రం గానీ, ఉపదేశించం"డని.

అందుకు భగవానుడు ఇలా అన్నాడు.

"మీరందరూ సంవత్సరానికి ఒక్కరోజు, అనగా మార్గశిరశుద్ధద్వాదశి (వైకుంఠ ద్వాదశి) నాటి సూర్యోదయసమయంలో వేంకటాచలక్షేత్రంలో ఉన్న **"స్వామిపుష్కరిణి"** అనే తీర్థంలో స్నానం చెయ్యండి. మీ మీ పాతకాలన్నీ నశిస్తాయి. నిర్మలమై ప్రకాశిస్తారు. నేనుకూడా ఆ తీర్థం ఒడ్డునే **"వేంకటేశ్వరుడు"**గా కొలువై దర్శనమిస్తాను" – అని.

అందువల్ల చిరంజీవీ! సరిగ్గా ఆనాటికి తిరుమలక్షేత్రానికి వెళ్లి, ఆ సరస్సులో స్నానం చెయ్యి. ఆనాటిపర్వదినాన్ని **"శ్రీస్వామి పుష్కరిణీతీర్థ ముక్కోటి"** అంటారు. ముక్కోటితీర్థాలు "స్వామి పుష్కరిణి"లో కలిసే ఆనాటి మంగళప్రదమైన సమయంలో స్నానంచేసే మహాభాగ్యం అందరికీ కలుగదు. వేలజన్మల్లో పుణ్యాన్ని అర్జించుకొన్నవాళ్లకు మాత్రమే ఆనాడు తిరుమల శ్రీవారికోనేటిలో స్నానంచేసే అదృష్టం కలుగుతుంది. వాళ్లకు తప్పక జీవన్ముక్తి సిద్ధిస్తుందని చెప్పబడింది. అంతమాత్రమే కాదు:

**తత్ర స్నానం ప్రకుర్వంతి యే నరాః ప్రీతమానసాః**
**తే సర్వైః పాపై ర్ముచ్యంతే సగోత్ర జ్ఞాతి బాంధవాః**

"ఆనాడు భక్తి ప్రపత్తులతో "స్వామిపుష్కరిణి"లో స్నానం చేసినవారు, వారివంశంలోని సగోత్రీకులందరూ పాపాలనుండి విముక్తులవుతారని వేంకటాచలమాహాత్మ్యం వక్కాణిస్తోంది" – అంటూ ముగించాడు బ్రహ్మదేవుడు.

సృష్టికర్తకు శిరసా నమస్కరించి, వేంకటాచలయాత్రకు వెంటనే బయలుదేరాడు – మార్కండేయుడు.

సరిగ్గా, స్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటి నాటికి తిరుమలక్షేత్రం చేరుకొన్న మహర్షికి ఒక అద్భుతమైనదృశ్యం గోచరించింది.

సమస్త బ్రహ్మాండాల్లోని తీర్థాలన్నీ వరుస కట్టి దివ్యరూపాలతో "స్వామిపుష్కరిణి"లో మునుకలు వేస్తూ తమ తమ పాపాల్ని పోగొట్టుకోవడం చూస్తూ – ఆశ్చర్యపడుతూ, వాటికి చేతులెత్తి నమస్కరించాడు. ఇన్ని తీర్థాల పాపాల్ని ఇట్టే కడిగివేస్తున్న **శ్రీస్వామిపుష్కరిణి**కి తూర్పుతీరాన సాష్టాంగదండప్రణామాలు సమర్పించాడు. ఆ కోనేటిలోని నిర్మలజలాన్ని భక్తితో స్పృశించి, కళ్లకద్దుకొని, తలపై సంప్రోక్షించుకొని ఇలా ప్రార్థించాడు.

**"తల్లీ! పుష్కరిణీమాతా! నీ పవిత్రజలాల్లో దిగి స్నానం చేస్తున్నందులకు నా భాగ్యం ఏమని చెప్పగలను! ఈనాటి అరుణోదయ వేళలో నీ విమలోదకస్నానం చేత నాకు సమస్త తీర్థాల ఫలాన్ని ప్రసాదించు. అలాగే 'నాలోని దోషాలను, కలుషాలను నిర్మూలించు తల్లీ!" – అంటూ సంకల్ప పూర్వకంగా స్వామివారి పుష్కరిణిలో మూడుమార్లు మునుకలు వేశాడు. ఆ తర్వాత –**



**మార్కండేయం పూర్వభాగే**
**మార్కండేయవినిర్మితమ్ ।**
**తత్ర స్నాంతి నరా యే తు**
**తేషా మాయుః ప్రవర్ధతే.**

అంటూ 'స్వామి పుష్కరిణి'లో తూర్పుభాగాన తాను స్నానంచేసిన ప్రాంతం "మార్కండేయతీర్థం" అని పేరు పొందుతుందనీ, ఇందులో ఎప్పుడు స్నానంచేసినా దీర్ఘాయుస్సు కలుగుతుందనీ, ముఖ్యంగా 'శ్రీస్వామిపుష్కరిణీతీర్థముక్కోటి" నాడు చేస్తే – రోగబాధలు తొలగి, అన్నికోరికలు తీరుతాయి అనీ వరమిచ్చాడు.

ఇలా పుష్కరిణీ స్నానం ఆచరించిన మార్గండేయుడు క్షేత్రసంప్రదాయంప్రకారం ముందుగా పుష్కరిణికి పడమటి గట్టున ఉన్న శ్రీభూవరాహస్వామివారిని దర్శించి,

**శ్లో॥ జలౌఘమగ్నా సచరాచరా ధరా**
**విషాణ కోట్యాఽఖిల విశ్వమూర్తినా,**
**సముద్ధృతా యేన వరాహరూపిణా**
**స మే స్వయం భూర్భగవాన్ ప్రసీదతు ॥**

**శ్లో॥ పోత్రి రూప! నమస్తుభ్యం పురుషోత్తమ! తే నమః**
**స్వామిపుష్కరిణీ తీరవాసినే వరదాచ్యుత**
**శ్రీవేంకటవరాహాయ విశ్వమంగళకారిణే**
**భక్తానాం రక్షిణే తుభ్యం భగవన్! సతతం నమః**

"జలప్రళయంలో, సమస్తచరాచరాలైన వస్తువులతో కూడా మునిగి పోయిన భూమండలాన్ని తన కొమ్ముకొనలపై సముద్ధరించడానికి స్వయం వ్యక్తమై అవతరించిన ఓ శ్రీఆదివరాహభగవన్! నన్ను అనుగ్రహించు.

వరాహరూపంలో విరాజిల్లుతున్న పురుషోత్తమా! నీకు నమస్కారం. స్వామిపుష్కరిణీ తీరవాసివై వరాలు ప్రసాదిస్తూ, విశ్వమంగళకారకుడవై భక్తులను రక్షిస్తున్న శ్రీవేంకటవరాహదేవా! నీకు నిరంతరం నమస్కారాలు సమర్పిస్తున్నాను" - అని ప్రార్థించాడు.

శ్రీవరాహస్వామిదర్శనానంతరం మార్కండేయుడు ఆనందనిలయుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించి,

**శ్లో॥ పాహి మాం వేంకటాధీశ!**
**ప్రణతార్తిప్రభంజన!**
**ఆత్మబంధో! కృపాసింధో!**
**సతతం తే నమో నమః ॥**

అందరి ఆత్మబంధుడవు, దయాసముద్రుడవు అయిన శ్రీ వేంకటేశ! నమస్కరించిన వాళ్లబాధలు పోగొట్టే స్వామీ! నీకు ఎల్లప్పుడు నమస్కారాలు'' - అని శ్రీనివాసుణ్ణి స్తుతించి, సంతుష్టుడై, శ్రీస్వామిపుష్కరిణీ మాహాత్మ్యాన్ని, శ్రీనివాసుని దయాళుత్వాన్నీ కీర్తిస్తూ - తిరుమలక్షేత్రయాత్రను సఫలం చేసుకొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి సంపూర్ణ అనుగ్రహాన్ని పొంది, మళ్లీ తపస్సుకు వెళ్లాడు.

**ఓం నమో శ్రీవేంకటేశాయ**

# 6. సప్తర్షులు దర్శించిన సప్తగిరీశుడు

సప్తర్షులు ఏడుమంది. వాళ్లే కశ్యపుడు, అత్రిమహర్షి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠమహర్షి. ఈ ఏడుమంది మహర్షులు ఒకటీ, రెండూ కాదు కొన్నివేల యుగాలు తపస్సులు చేశారు. ఆ తపోబలంతో నక్షత్రమండలంలో నక్షత్రాలుగా ఇప్పటికీ ప్రకాశిస్తూనే ఉన్నారు. ఆకాశంలో రాత్రిపూట, ఉత్తరదిక్కున ఈ సప్తర్షిమండలాన్ని కన్నులారా దర్శించవచ్చు.

ఈ ఏడుమందీ ఒక జట్టు. ఎక్కడికి వెళ్లినా అందరూ కలిసే వెళ్తారు. తీర్థయాత్రలకైనా సరే! లేదా ఏ లోకాలకైనా సరే! కలిసికట్టుగా వెళ్తుంటారు. వింతలు, విశేషాలు చూస్తూ పరస్పరం చెప్పుకొంటూ, చర్చించుకొంటూ ఆనందిస్తూంటారు. వారి సంచారంలో, వారి యాత్రల్లో, వారి చర్చల్లో లోకకల్యాణకారకాలైనవి ఎన్నో ఉంటాయి.

నక్షత్రమండలంలో ముక్కు మూసుకొని తపస్సుల్లో మునిగి ఉన్న వీళ్లకు, కాలచక్రం ఎంత తిరిగిందో తెలియదు. ఏ యుగం గడుస్తున్నదో కూడా వారికి తెలియదంటే ఆశ్చర్యం లేదు. కొన్నివేల ఏండ్ల తర్వాత తపస్సులనుంచి తేరుకొన్న ఈ సప్తర్షులు, కొన్నిరోజులు అలా తిరిగొద్దాం అనుకొన్నారు. ఎక్కడో ఎందుకు ముందు వైకుంఠానికి వెళ్దాం. ఆ తర్వాత కైలాసం వెళ్దాం అనుకొన్నారు. అనుకొన్నదే తడవు అందరూ సరే అంటే సరే అని కూడబలుక్కున్నారు. ఇంకేం తపోబలం ఉన్నవారు కదా! ఋషులందరూ నక్షత్రలోకంనుండి నేరుగా శ్రీ వైకుంఠంలోని బంగారువాకిళ్ల ముందర వాలారు.

లోపలికి వెళ్దాం అనుకొన్నంతలో వారికి ఒక దృశ్యం కంటబడింది. అందరూ ఆశ్చర్యపడ్డారు. ఏమది అంటే!

ద్వారపాలకులైన జయవిజయులు తమగదల్ని వైకుంఠద్వారం వద్ద ఇరుప్రక్కలా గడపకు ఆనించారు. వాకిలిముందర కూర్చొని తీరిగ్గా గవ్వలాట ఆడుకొంటున్నారు. వాళ్లు పరిసరాల్నే మరచిపోయి ఆటలో నిమగ్నమయ్యారు.

అదీ! ఆ ఋషుల ఆశ్చర్యానికి కారణం.

ఏమైతే ఏం? ఆ ఋషుల్లో ఒకరు దగ్గారు. ఒకరు తుమ్మారు. ఒకరేమో గోవిందా! అన్నారు. మరొకరు నారాయణా! అన్నారు. ఇంకొకరు వైకుంఠవాసా! లక్ష్మీపతీ! ఇలా అందరూ ఎవరికిష్టమైన రీతుల్లో గట్టిగానే అన్నారు.

ఈ శబ్దాలన్నీ చెవుల్లో పడ్డ జయవిజయులు తిన్నగా తలలు పైకెత్తి ఋషులను చూశారు.

ఎవరు స్వామీ! మీరందరూ. కొన్నివేల ఏండ్లుగా మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే! చూచినట్లు కూడ గుర్తుకు రావడం లేదే! సరే! మీరు ఎవరైతే మాకేం గాని, లోపల మాస్వామి లేడు. కొన్నివేల ఏండ్లైంది. ఏలోకానికి వెళ్లాడో? మాకైతే తెలియదు, నిజమే చెబుతున్నాం. తొందరపడి శాపనార్థం పెట్టకండి. అయినా మీరు సర్వజ్ఞులు కదా! మీకు చెప్పేదేముంది అన్నారు.

తెల్లబోయిన ఋషులందరూ అక్కడనుంచి కదిలి కైలాసం వెళ్లారు. కైలాసంలో పరిస్థితి వైకుంఠంకంటె అయోమయంగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. చుట్టూరా పరికించి చూశారు. ఇంతలో ఇద్దరు శివకింకరులు పరిగెత్తుకొంటూ వచ్చారు. నల్లగానే కాక కొంచెం వింతగానే ఉన్నారు. ఒళ్లంతా బూడిద పూసుకున్నారు. ఇంచుమించు దిగంబరంగా ఉన్నారు.

ఎవరు మీరు! ఋషులలాగే ఉన్నారే! మా సాంబశివయ్య వెళ్లి కొన్ని యుగాలైంది. యాడికి పోయుండారో మాకైతే తెలవదు. శివయ్యతోపాటు



బసవణ్ణ, గణపయ్య, కుమారయ్య అందరూ పోయింద్రు. అన్నీ తెలిసినోళ్లలాగే ఉన్నారే! మీ బుద్ధితో కనుక్కొని అక్కడికే ఎళ్లండి మరి – అని అన్నారు.

ముక్కున వేలేసుకొన్న మునులందరూ, ఇంతకూ హరి హరు లిద్దరూ ఎక్కడి కెళ్లినట్లు? ఆ బ్రహ్మకైనా తెలుస్తుందేమో! చూద్దాం. అనుకొంటూ అందరూ కట్ట కట్టుకొని సత్యలోకంలో వాలారు.

ఇక్కడ మరీ విచిత్రం! అటు వైకుంఠంలోను, ఇటు కైలాసంలోను ఒకరిద్దరైనా కనపడ్డారు. మరి బ్రహ్మగారి సత్యలోకంలో, ఒక్కరంటే ఒక్కరైనా కన్పడితేగా, మాట్లాడటానికి. చుట్టూ పరికించి చూశారు. ఆ స్థలం ఆహ్లాదంగా ఉన్నా నిశ్శబ్ద గంభీరంగా ఉంది. ఆ వాతావరణాన్ని ఎంతమాత్రం భరించలేక ఉసూరుమంటూ బయట పడ్డారు సప్తఋషులు.

ఇంతలో వారికి ఎదురు పడ్డాడు నారదమహర్షి. సప్తర్షులు, దేవర్షి నారదుడు పరస్పరం అభివాదం చేసుకున్నారు.

ఋషివరేణ్యులారా! వేల ఏండ్ల తర్వాత తమరి అందరి దర్శనభాగ్యం ఒక్కచోటే కలుగుతున్నది. అయినా, మీరందరూ ఇక్కడ కన్పడడంలో విశేషం! – అన్నట్లుగా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు ఆత్రం పట్టలేక దేవర్షి.

అయ్యా! నారదమునీ! నిజమే! మా నక్షత్ర లోకంలో మేం తపోనిమగ్నులమై వేల ఏండ్లు అయ్యింది. త్రిమూర్తుల్ని దర్శిద్దామని మూడు లోకాలకీ వెళ్లాం... కానీ! అని సప్తర్షులు అంటుండగానే నారదుడు బిగ్గరగా నవ్వుతూ..

"మీకు త్రిమూర్తుల దర్శనం అయ్యుండదు. ఎలా అవుతుంది. వాళ్లు అక్కడ ఉంటేగా? వాళ్లే కాదు. మీరు ఎన్ని లోకాలకి వెళ్లినా, అన్ని లోకాల్లోను ఎవరూ ఉండరు గాక ఉండరు. ఎందుకని అంటారేమో! దానికి కారణం చెబుతాను. సావధానంగా వినండి.



భూలోకంలో భరతఖండానికి దక్షిణభాగంలో 'వేంకటాచలం' అనే పరమాద్భుతమైన పర్వతం ఉంది. ముల్లోకాల్లోనూ దాని మహిమలు అనంతం, అప్రమేయం. అక్కడ ఆ దివ్య శిఖరాలపైన శ్రీ వైకుంఠపతి శ్రీమన్నారాయణుడు "వేంకటపతి" గా వేంచేసి ఉన్న విషయం మీకందరికీ తెలిసిన సంగతే! ఆ భక్తవత్సలుడికి బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఘనంగా బ్రహ్మోత్సవాల పేరిట పదినాళ్లపాటు వేడుకలు జరుగుతున్నై. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ సంబరాలను చూడటానికి, పాల్గొనడానికి సకలలోకాలవాండ్లు భూలోక వైకుంఠానికి వెళ్లారు. వెళ్తూనే ఉన్నారు. అందులోను సాంబశివుడేమో వేంకటాచల క్షేత్రపాలకుడు! ఇక బ్రహ్మదేవుడేమో ఆ ఉత్సవాల నిర్వాహకుడు. అందువల్లే సమస్త లోకాలు ఖాళీగా ఉన్నాయి, ఉంటాయి కూడ.

అయినా, మీ పరిసరాల్లో ఏం జరుగుతోందో, ఏమాత్రం తెలుసుకోకుండా, ముక్కు మూసుకొని మీ లోకంలో మీరుంటే ఎలా?



అది సరే. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రమ్మని, ఈ వేళకే మీకూ ఆహ్వానం అంది ఉండాలే!

సరేలే! మనం మళ్లీ త్వరలో సప్తగిరి శిఖరాల్లో బ్రహ్మతిరునాళ్ల సంబరాల్లో కలుసుకుందాం. నారాయణ! నారాయణ!! అంటూ అదృశ్యమయ్యాడు నారదమహర్షి.

అలాగా! అనుకొంటూ నాలుగడుగులు వేశారో లేదో సప్తర్షుల ఎదుట గరుడభగవానుడు ప్రత్యక్షమయ్యాడు, తిరుమలేశుని బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రంతో!

"మహర్షులారా! మీకోసం నక్షత్రమండలంలో వెతికాను. ఆ తర్వాత ముల్లోకాలూ తిరుగుతున్నాను. ఇక్కడ మీ దర్శనభాగ్యం కలిగింది ధన్యుణ్ణి. బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలకు ఇదే మా ఆహ్వానం! అందరూ విచ్చేయండి" – అంటూ ఎంత వేగంగా వచ్చాడో, అంత వడిగా రివ్వున ఎగిరిపోయాడు గరుత్మంతుడు.

పక్షిరాజు పలికిన స్వాగతానికి సంబరపడ్డారు సప్తర్షులు. ఎందుకు ఆలస్యం? వేంకటాచలం వెళితే, బ్రహ్మోత్సవాల వైభవాన్ని తిలకించవచ్చు. ముక్కోటి దేవతలందర్నీ, వాళ్ల మొక్కు లందుకుంటున్న ఆపదమొక్కులవాణ్ణీ దర్శించవచ్చు. అనుకొంటూ భూలోకవైకుంఠానికి ప్రయాణం కట్టారు. వాళ్లకి ఏ వాహనాలూ అక్కర్లేదుగా! వారి సంకల్పమే 'సప్తగిరుల' దరికి చేర్చింది.

అంతరిక్షం నుండే ఏడుకొండల అద్భుత తేజస్సును వీక్షిస్తూ చేతులెత్తి మొక్కారు. ఆ కొండల మధ్యలో వింతవింత కాంతులతో మహా అద్భుతంగా మిరుమిట్లు గొలుపుతున్న 'బంగారుమేడ' ఆనందనిలయ విమాన శిఖరాన్ని ఆశ్చర్యంగా, ఆనందంగా కన్నులారా చూస్తూ, ఇన్నాళ్లకు, కాదు కాదు, ఇన్ని వేల ఏండ్లకు ఈ అవకాశం కలగడం తమ అదృష్టంగా భావించారు ఆ మునులందరూ. ఏడుకొండలలో ఎటు చూసినా, ఏవైపు పరికించినా

సందడే! సంబరమే. కొండలంతటా కోలా హలమే! ఏమీ ఈ క్షేత్ర వైభవం. ఏ కొద్దిమంది మాత్రమే వెళ్లగలిగి, ఎప్పుడూ నిశ్శబ్ద గంభీరంగా, నిరామయంగా ఉండే శ్రీ వైకుంఠలోకం ఎక్కడ? దేవ దానవ మానవ యక్ష కిన్నర గంధర్వాది సర్వలోకాల వాండ్లకు వారూ, వీరూ అనకుండా భక్తుల ఆనంద సందోహంతో, నిత్యమూ సందడిగా ఉండే భూలోక వైకుంఠం వేంకటాచల వైభవం ఎక్కడ! అహో! అదిగో! బ్రహ్మచారులు, యతీశ్వరులు, యోగులు, మంత్రవేత్తలు, అవధూతలు, సన్యాసులు, గృహస్థులు, వానప్రస్థులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు, పూర్వసువాసినులు, విధురులు, కుంటి గుడ్డి వికలాంగులు, అధికారులు, పండితులు, పామరులు, చక్రవర్తులు, రాజ్యాధికారులు... ఇలా ఒక్కరా, ఇద్దరా, లక్షలాదిమంది భక్తవరేణ్యుల గోవిందనామ ఘోషలతో, భజనలతో, నృత్యాలతో, ఆటపాటలతో, సంగీత నీరాజనాలతో, ఉపాసనలతో, దీపారాధనలతో, వింత వింత శోభలతో ప్రకాశిస్తున్న సప్తగిరుల సౌందర్యం ఏమని చెప్పేది. ఎంతని వర్ణించేది? ఇలా సప్తర్షులు అనుభవిస్తూ, ఎవరికివారు తమలో తాము శ్రీ వేంకట పర్వత శోభను, వైభవాన్ని పరిపరివిధాలుగా ఆనందంతో అనుభూతులను పొందారు.

**శ్లో॥ శ్రీ వేంకటేశ మతి సుందర మోహనాంగం**
**శ్రీభూమికాంత మరవింద దళాయతాక్షమ్**
**ప్రాణప్రియం ప్రవిమల సత్కరుణాంబురాశిం**
**బ్రహ్మేశ వంద్య మమృతం వరదం భజామి"**

అంటూ మునులు ప్రార్థిస్తూ, సాక్షాత్తు సాంబశివుని క్షేత్ర పాలక పర్యవేక్షణలో, చతుర్ముఖ బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో సకలలోకవాసుల సమక్షంలో జరుగుతున్న అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ తిరునాళ్లను మొదటి నుంచి,చివరి వరకు కన్నులారా వీక్షిస్తూ, కొండలరాయని కమ్మనైన దివ్యప్రసాదాలను ఆస్వాదిస్తూ సంతృప్తిని పొందారు.



శ్రీనివాస భగవానుని బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణ మొదలుకొని, ప్రతిరోజు ఉదయం, రాత్రి వరుసగా జరిగే పెద్దశేషవాహనం, హంసవాహనం, సింహ, ముత్యపు పందిరి, కల్పవృక్షం, సర్వభూపాల వాహనం, మోహినీ అవతారం, గరుడోత్సవం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్యప్రభ, చంద్రప్రభవాహనం స్వర్ణ రథోత్సవాలలో చివరగా అశ్వవాహనం... ఇలా కన్నులారా దర్శించారు సప్తర్షులు. ఆమరునాడు ఉదయం శ్రీస్వామిపుష్కరిణిలో జరిగే "చక్రస్నానం" లో కూడ పాల్గొన్నారు.

## స్వామిపుష్కరణీ స్నానం వేంకటేశ్వర దర్శనం మహాప్రసాద స్వీకారం త్రయ త్రైలోక్య దుర్లభమ్

శ్రీస్వామిపుష్కరిణీ పుణ్యజలాలు దివ్యమైన ఔషధాలు! ఇక వేంకటేశ్వరుడేమో మృత్యు, రోగాదులను పోగొట్టే అద్భుతవైద్యుడు! శ్రీ స్వామిపుష్కరిణీ స్నానం, శ్రీ వేంకటభగవానుని దర్శనం, శ్రీస్వామివారి ప్రసాదం స్వీకరించడం అనే ఈ మూడు కార్యాలు పరమాద్భుతమైనవి. ఇవి ముల్లోకాల్లో ఎవరికీ ఒనగూడవు. అదృష్టంకొద్దీ మనకు సిద్ధించాయి అంటూ సప్తర్షులు, శ్రీస్వామిపుష్కరిణీతీర్థంలో శ్రీ సుదర్శన చక్రభగవానునితో పాటు మునకలిడినారు.

తదుపరి ఆనందనిలయ గర్భాలయంలో ఘనవేంకటేశుని దివ్యమంగళ మూర్తిని నిలువెల్ల కన్నులు చేసికొని కన్నులార్పకుండా దర్శనం చేసికొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఘనంగా మంగళప్రదంగా పూర్తి అయిన తర్వాత శ్రీవారి మహామణిమండపంలో ఆస్థానం జరిగింది. ఉత్సవాలకు వచ్చిన భక్తులందరినీ అనుగ్రహించి వరాలను ఇచ్చాడు వేంకటపతి. ఆ సందర్భంలో సాంబసదాశివుడు, బ్రహ్మదేవుడు, సప్తర్షులను ఒక మాట అడిగారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ సంరంభాన్ని దర్శించారు కదా! శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని దర్శనం మీకందరికీ ఏ ఏ అనుభూతులను

కలిగించింది. శ్రీనివాస భగవానుడు ఒక్కడే అయినా, ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా దర్శనమిస్తాడు. దివ్యానుభూతులను అనుగ్రహిస్తాడు. ఎవరి దర్శనం వారిదే! ఎవరి అనుభూతి వారిదే! ఇది శ్రీ వేంకటేశ్వరుని భక్తులందరి అనుభవంలో ఉన్నదే. అందువల్ల ఓ సప్తర్షులారా! స్వామివారి దర్శనంలో మీ అనుభవాలను, అనుభూతుల్ని ఒక్కొక్కరు ఒక్కొక్క శ్లోకంలో మాత్రమే తెల్పండి. అందులోను అందరూ ఒక నియమం తప్పక పాటించాలి. అదేమంటే తమ తమ పేర్లలోని తొలి అక్షరంతో మాత్రమే శ్లోకాన్ని చెప్పాలి. చాల సంక్షిప్తంగాను ఉండాలి. అని బ్రహ్మదేవుడు చెబుతూ కూర్చొన్నాడు.

ఆనందనిలయుని ఆ నాటి కొలువులో ముక్కోటి దేవతలు ఉన్నారు. అంతేకాదు. దేవ, దానవ, యక్ష, కిన్నర, కింపురుష, మానవులు ఇలా ఎందరెందరో చెవులు రిక్కించి ఆత్రుతగా ఆ ఋషులు ఏం చెబుతారో, అని నిక్కి నిక్కి చూస్తున్నారు.

సప్తర్షులు లేచి నిలబడ్డారు. సప్తగిరీశునికి సాష్టాంగ దండప్రణామాలను సమర్పించారు. శ్రీనివాస భగవానుడు లక్ష్మీసమేతంగా చిన్మయహాసం చేస్తూ, ప్రారంభించమని తల పంకించాడు.

తొలిగా కశ్యపుడు ఇలా పలికారు :

**శ్లో॥ కాది హ్రీమంత విద్యాయాః, ప్రాప్త్యైవ పరదేవతా**
**కలౌ శ్రీ వేంకటేశాఖ్యా, తామఉహం శరణం భజే.**

'క' తో మొదలై 'హ్రీం' తో ముగిసే 16 అక్షరాల రహస్యమైన మంత్రానికి ప్రధాన పరదేవత, ప్రస్తుతం ఈ కలియుగంలో **"శ్రీ వేంకటేశ్వరుని"** గా దర్శనమిస్తున్నది. ఆ పరదేవతను ఇప్పటి శ్రీ వేంకటేశ్వరుడిగా దర్శనభాగ్యం పొందిన కశ్యపుడను నేను శరణం పొందుతున్నాను.

పిదప అత్రిమహర్షి ఇలా చెప్పారు.



**శ్లో॥ అకారాది క్ష కారాంత, వర్ణై యః ప్రతిపాద్యతే**
**కలౌ స వేంకటేశాఖ్యః, శరణం మే రమాపతిః**

అ కారం మొదలుగా క్ష కారాంతం వరకు ఉన్న అన్ని అక్షరాలలో ప్రతిపాదింపబడిన రమాపతి ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్నాడు. నేను అత్రిమహర్షిని ఆ స్వామివారిని శరణం అంటున్నాను.

ఇంతలో భరద్వాజుని వంతు వచ్చింది.

**శ్లో॥ భగవాన్ భార్గవీకాంతో భక్తాభీప్సిత దాయకః**
**భక్తస్య వేంకటేశాఖ్యో భరద్వాజస్య మే గతిః**

భార్గవి అనగా లక్ష్మి. సాక్షాత్తు భార్గవీకాంతుడు శ్రీనివాసుడు. భక్తుల కోరికలన్నింటిని తీరుస్తున్నాడు. అలాంటి వేంకటేశ్వరుణ్ణి భరద్వాజుడను నేను శరణాగతి వేడుతున్నాను. నాకు ఆయన తప్ప వేరే గతి లేదు.

తదుపరి విశ్వామిత్రుడు ఇలా అన్నారు.

**శ్లో॥ విరాట్ విష్ణుః విధాతా చ విశ్వం విజ్ఞాన విగ్రహః**
**విశ్వామిత్ర స్య శరణం వేంకటేశ విభుస్సదా**

విరాట్ పురుషుడైన శ్రీమహావిష్ణువే ఇప్పటి ఈ శ్రీ వేంకటేశ్వరుడు. ఆయనే విధాత. విజ్ఞాన విగ్రహుడైన ఆ శ్రీనివాసుడే విశ్వమంతా కూడ. అలాంటి జగత్ప్రభువును, శ్రీ వేంకటేశ్వరుణ్ణి ఈ విశ్వామిత్రమహర్షి శరణం అంటున్నాడు.

ఆ తర్వాత గౌతమ మహర్షి వంతు వచ్చింది.

**శ్లో॥ గౌః గౌరీశ ప్రియో నిత్యం, గోవిందో గోపతి ర్విభుః**
**శరణం గౌతమస్యాస్తు వేంకటాద్రి శిరోమణిః**

గౌరీప్రియుడు పరమేశ్వరుడు. ఆయనకు అత్యంత ప్రియుడు ఈ గోవిందుడు. గోవులకు పాలకుడు. గోపికలకు పతి. సమస్త జీవులకు విభుడు!

... ఇన్ని విధాలుగా భాసిస్తూ ప్రస్తుతం వేంకటాద్రి శిరోమణిగా దర్శనమిస్తున్న శ్రీనివాస భగవానుణ్ణి, ఇదిగో! ఈ గౌతముడు శరణం వేడుతున్నాడు.

ఆ తర్వాతి వంతు జమదగ్నికి వచ్చింది.

**శ్లో॥ జగత్కర్తా జగద్భర్తా జగద్ధర్తా జగన్మయః**
**జమదగ్నిః ప్రపన్నస్య జీవేశో వేంకటేశ్వరః**

సమస్త జగాలను నడిపిస్తున్న కర్త! భరిస్తున్న భారకుడు! ధరిస్తున్నవాడు కూడా ఆ స్వామే. ఇన్ని రకాలుగా భాసిస్తూ విశ్వవ్యాపకుడైన జగన్మయుడు, సకల జీవేశుడు అయిన వేంకటేశ్వరుణ్ణి శరణం అంటున్నాడు ఈ జమదగ్ని.

చివరగా వశిష్ఠమహర్షి ఇలా పలికారు.

**శ్లో॥ వస్తువిజ్ఞాన మాత్రం య న్ని ర్విశేషం శుభం చ సత్**
**తత్ బ్రహ్మైవాహ మస్మీతి వేంకటేశం భజే సదా ॥**

ఆశ్రితులైన భక్తులకు సంపూర్ణంగా సర్వశుభాలను అనుగ్రహిస్తూ సాక్షాత్తు పరబ్రహ్మ తత్త్వంగా ప్రకాశిస్తున్న శ్రీ వేంకటేశ్వర భగవానుణ్ణి ఈ వశిష్ఠమహర్షి నిత్యమూ భజిస్తున్నాడు. సభలోని బ్రహ్మాది దేవతలందరూ చప్పట్లు చరిచారు. చాలా మెచ్చుకొన్నారు.

వెంటనే శ్రీ వేంకటభగవానుడు మందస్మిత వదనారవిందంతో భక్తులందరినీ చూస్తూ, సప్తర్షులతో ఇలా అన్నాడు. మహర్షులారా! మీరు చేసిన ఈ స్తోత్రాలు చాల మహిమాన్వితాలు. వీటిని ఎవరు పఠించినా, పారాయణం చేసినా, సకల భయాలు పోతాయి. దోషాలు నశిస్తాయి. అంతమాత్రమే కాదు. సర్వశ్రేయస్సులు, సర్వశుభాలు కలుగుతాయి. సర్వసంపదలతో వర్థిల్లుతారు. అంటూ రత్నశాలువలతో సప్తర్షులను సత్కరిస్తూ దివ్యాశీస్సులతో అనుగ్రహించాడు.



ఇలా సప్తర్షులు సప్తగిరీశుని మీద చెప్పిన స్తోత్రాలు శ్రీ వేంకటేశ్వరునికి ప్రీతికారకాలయ్యాయి అంతేకాదు భక్తులకు కలిసంతారకములై వరలినాయి.

ఈ సప్తర్షులు ఆశువుగా చెప్పిన స్తోత్రాలను విన్నా, పఠించినా, భయం పోతుంది. సర్వదా విజయం సిద్ధిస్తుంది అని బ్రహ్మాది దేవతలు ఇలా అన్నారు.

**శ్లో॥ సప్తర్షి రచితం స్తోత్రం**
**సర్వదా యః పఠేన్నరం**
**సోఽభయం ప్రాప్నుయాత్**
**సత్యం సర్వత్ర విజయీ భవేత్.**

ఇలాగ సప్తర్షులు తమయాత్రను భూలోక వైకుంఠంలో సిద్ధిప్రదం చేసుకొని ఆ వైకుంఠదివ్యధామంలో తామనుభవించిన, అనుభూతి చెందిన ఆధ్యాత్మికరసానందాన్ని నెమరు వేసుకొంటూ, నక్షత్రమండలం చేరుకొన్నారు. ఇలా సప్తర్షులు చేసిన సప్తగిరీశుని స్తోత్రాలు నాటినుంచి నేటికీ అటు వేంకటభగవానునికీ, ఇటు వేంకటేశుని భక్తులకు ప్రీతికారకములై వరలుతున్నాయి.

**శ్లో॥ నమః శ్రీ వేంకటేశాయ ।**
**శుద్ధజ్ఞాన స్వరూపిణ**
**వాసుదేవాయ శాంతాయ ।**
**శ్రీనివాసాయమంగళమ్.**

**ఓం నమో శ్రీవేంకటేశాయ**

# 7. తిరుమల దర్శనం కంటే ముందు....

**శ్లో॥ వా'సు'దేవ ఇతి వా'మ'దేవ ఇ–**
**తృస్తి కల్పక మహీరుహద్వయం,**
**యద్యపీహ "సుమ" భేద సంభవః**
**నాస్త్యథాపి ఫలభేద సంభవః**

సప్తగిరుల్లో భక్తులకు కోరికలను తీరుస్తున్న కల్పవృక్షాలు రెండు ఉన్నాయి. వాటిల్లో మొదటిది ఏడుకొండలపైన ఉంది. రెండవది ఆ కొండలకు కింద ఉంది. మొదటిదాని పేరు **'వాసుదేవ'**. రెండవది **'వామదేవ'**.

రెండింటిలో 'సుమ' (పుష్పం) భేదం ఉన్నప్పటికీ, ఒకేవిధ మైన ఫలాల్ని ప్రసాదించడంలో పోటీపడుతున్న ఈ కల్పవృక్షాల్లో ఒకటి శ్రీవైకుంఠంనుంచి వచ్చి, స్వయంవ్యక్తమై 'వేంకటేశ్వరుడు' అనీ, రెండవది పాతాళంనుంచి స్వయంభువుగా భూమిని చీల్చుకొని పైకి వచ్చి, 'కపిలేశ్వరుడు' అని పిలువబడుతున్నాయి.

సప్తగిరుల క్షేత్రాధిదైవం శ్రీవేంకటేశ్వరుడు! కాగా, ఆ క్షేత్రానికి పాలకుడుమాత్రం కపిలేశ్వరుడు! ఆయనే ఈ కొండమీద 'రుద్రుడు' అని పిలువబడుతున్నాడు.

తిరుమలమీద ఆ కొండలరాయడు వెలసిన గాథ ఎంత అద్భుతమో! కొండక్రింద వేంకటాచలపర్వతగుహలో శ్రీ కామాక్షీ సహిత కపిలేశ్వరస్వామి స్వయంభువుగా ఆవిర్భవించిన గాథ అంతకంటె ఆశ్చర్యకరం!

తిరుపతినుంచి తిరుమలకు వెళ్లే మార్గంలో బస్టాండుకు 3 కిలోమీటర్ల దూరంలో, తిరుమల పర్వతం పైనుండి జాలువారే నయనమనోహరమైన జలపాతంతో విరాజిల్లుతున్న సుప్రసిద్ధమైన శైవ గుహాలయ క్షేత్రం కపిలతీర్థం.



భగీరథచక్రవర్తి తపఃఫలంగా దివినుండి భువికి, అక్కడనుండి పాతాళలోకానికి ప్రవహించిన గంగ, భూలోకంలో **'భాగీరథీ గంగ'**గా, పాతాళంలో **'భోగవవతీ గంగ'** గా ప్రసిద్ధికెక్కింది.

ఆ భోగవతీగంగ పక్కనే కపిలమహర్షి తన ఆశ్రమంలో అద్భుతమైన ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించి, ఆరాధించేవాడు. ఆ అద్భుతశివలింగం, రోజురోజుకు వింత వింత తేజస్సులతో ప్రకాశించడంతోపాటు, ఊర్ధ్వముఖంగా పెరుగుతూ పెరుగుతూ, భూమిని చీల్చుకొని, వేంకటాచలక్షేత్ర మూలంలో పర్వతగుహలో స్వయంభువుగా వెలసింది. ఆ శివలింగం ఇంకా పెరగకుండా చెయ్యాలని శ్రీమహా విష్ణువు గోపాలకుడై రక్షిస్తుండగా, బ్రహ్మదేవుడు 'కపిలధేనువై' **'మావర్ధస్వ, మావర్ధస్వ'** 'చాలు చాలు ఇక పెరగవద్దు' అంటూ క్షీరంతో అభిషేకించాడు. అంతే ఆ లింగం పెరగడం ఆగిపోయింది.

కపిల మహాముని పూజించిన శివలింగం కనుక **'కపిలేశ్వర లింగం'** అనీ, **'కపిలేశ్వరుడు'** అని పేర్లు ఏర్పడ్డాయి.

అలా పెరుగుతూ వచ్చిన శివలింగంతోపాటు పాతాళంలో పక్కనేవున్న **'భోగవతీ గంగ'** కూడ పైకి పెల్లుబికింది. అదే **'కపిలతీర్థం'** పేరుతో పరమపావనమైన పుణ్యతీర్థంగా ప్రసిద్ధికెక్కింది. వేంకటాచల పర్వతసానువులనుండి జాలువారే జలపాతంలో **శక్రతీర్థం (ఇంద్ర) విష్వక్సేనతీర్థం, పంచాయుధతీర్థాలు, అనలతీర్థం, బ్రహ్మతీర్థం, సప్తర్షి తీర్థాలు** – ఇలా **16 తీర్థాలు కపిలతీర్థంతో** కలిపి మొత్తం **17 తీర్థాలు** అన్నీ భక్తులను పాపాలనుండి విముక్తుల్ని చేసి, పునీతుల్ని చేస్తున్నాయి. ఇవిగాక కపిలతీర్థపుష్కరిణికి నైరుతిలో **'త్రిమూర్తుల తీర్థాలు'** అనే మూడు పుణ్యతీర్థాలు కలవడంతో అనేకపుణ్యతీర్థాల సంగమమై ఉంటూ భక్తుల ఘోరకల్మషాలను పోగొడుతున్నది–ఇష్టార్థాలను ప్రసాది స్తున్నది– ఈ కపిలతీర్థం!

కృతయుగంలోని శ్రీకపిలేశ్వరమహాలింగాన్ని, త్రేతాయుగంలో అగ్నిదేవుడు పూజించినందువల్ల **'ఆగ్నేయలింగం'** అని పిలువబడింది. ద్వాపరయుగంలో సుదర్శనుడు పూజించిన ఈ శివలింగం కిందిభాగం రజతవర్ణంతోను, మధ్యలో సువర్ణకాంతులతోను, అగ్రభాగం తామ్ర వర్ణంతోను దర్శనమిస్తుంటుంది. అంతేగాక, స్వయంభువైన ఈ శివలింగం పశ్చిమ, ఉత్తర, తూర్పు, దక్షిణ, ఊర్ధ్వదిక్కుల్లో పంచముఖాలతో విరాజిల్లుతూ **'పంచముఖేశ్వరుడు'**గా కూడా పిలువ బడుతున్నాడు. ముఖ్యంగా, కపిలేశ్వరుడు పశ్చిమాభిముఖంతో, మూడు కన్నులతో గంభీరంగా దర్శనమిస్తూ, కోరికలను వెంటనే ప్రసాదిస్తున్న **'సద్యోజాతమూర్తి'**గా పేరొందినాడు.

ఈ గుహాలయంలో స్వయంభువుగా వెలసిన **శ్రీ కపిలేశ్వర స్వామివారితో**పాటు, ఆయన దేవేరి **శ్రీ కామాక్షీదేవి** (పార్వతీదేవి), **శ్రీసిద్ధి వినాయకస్వామి, శ్రీవల్లీదేవసేనాసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ దక్షిణామూర్తి, శ్రీ అగస్త్యేశ్వరస్వామి, శ్రీ కోటిలింగేశ్వరస్వామి నవగ్రహదేవతలు, శ్రీ శివసూర్యస్వామి** మున్నగు మూలమూర్తులతో పాటు **శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ చంద్రశేఖరస్వామి మనోన్మణి, శ్రీనట రాజస్వామి, శివకామసుందరి, గణపతి, కుమారస్వామి** మున్నగు పంచలోహ ఉత్సవమూర్తులుకూడా చోటుచేసుకున్నాయి.

పూర్వం సుదర్శనుడు ఈ తీర్థంలో తపస్సు చేసినందువల్ల సుదర్శన తీర్థం, చక్రత్తాళ్వారు తీర్థం అని పేరు ఏర్పడింది. ఆ పేరు మరుగున పడిపోగా భగవద్రామానుజులవారు పుష్కరిణికి నాలుగు మూలల్లో సుదర్శన ప్రతిష్ఠచేసి, **'చక్రత్తాళ్వారు తీర్థం'** అన్నపేరును ఉద్ధరించారు.

వేంకటాచల క్షేత్రానికి వెళ్లే ముందుగా పర్వత మూలంలో ఉన్న కపిలతీర్థంలో పితృతర్పణాది తీర్థవిధు లాచరించి, శ్రీకామాక్షీసమేత కపిలేశ్వరులను దర్శించిన తర్వాతనే తిరుమలకు వెళ్లి 'స్వామిపుష్కరిణి'లో



స్నానంచేసి, తొలుత శ్రీవరాహస్వామిని దర్శించి, పిదప శ్రీనివాసుణ్ణి దర్శిస్తేనే తిరుమలయాత్ర పూర్తిగా సిద్ధిస్తుం దని **'శ్రీవేంకటాచల సేవా క్రమం'** అనే గ్రంథం స్పష్టం చేస్తోంది.

దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తిలో, పూర్వం **'మాధవు'**డనే పండితుడు ఉండేవాడు. సర్వ విద్యావేత్త, అందగాడు అయిన అతనికి **'చంద్రలేఖ'** అనే సుగుణాలరాశితో పెళ్లయింది. ప్రారబ్ధకర్మ అన్నట్లుగా ఆ బ్రాహ్మణయువకుడికి **'కుంతలా'** అనే వేశ్యతో పరి చయమయ్యింది. ఆమెవలలో చిక్కుకున్న ఆ విప్రుడు భ్రష్టుడై, తల్లి దండ్రులను, భార్యను వదలేశాడు. పుత్రుని మీది దిగులుతో తల్లి దండ్రులు చనిపోయినా ఆ పాపాత్ముడు వెళ్లలేదు. చివరకు భార్య గతించినా మనసు కరగలేదు. ఇంతటి వ్యామోహంలో ఉన్న మాధవుణ్ణి వేశ్య అసహ్యించుకుంది. అయినా వదలలేదు. విధివశాత్తు ఆ కుంతలకూడా మరణించగా దేశాలు తిరుగుతూ మాధవుడు కపిల తీర్థం చేరుకొన్నాడు. అక్కడ శ్రాద్ధాదికర్మల్ని నిర్వహిస్తున్న ఇతరులను చూచి, తన తల్లి దండ్రులు జ్ఞాపకం వచ్చి పశ్చాత్తాపపడ్డాడు. తన తల్లిదండ్రులకు కూడా మట్టితో పిండప్రదానం చేసి, శ్రీ కామాక్షీకపిలే శ్వరులను సేవించి, అక్కణ్ణుంచి వేంకటాచలం చేరుకొన్నాడు. కడిగిన ముత్యంలా ఉన్న మాధవునికి శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. కపిలతీర్థ స్నానంవల్ల పునీతుడవైన నీవు, వచ్చే జన్మలో ఆకాశరాజుగా జన్మిస్తావనీ, అతనిపుత్రిక పద్మావతితో తనకు వివాహం జరిపిస్తావనీ వరం ఇచ్చాడు.

శ్రీవేంకటేశ్వరస్వామికి పద్మావతితో వివాహం జరుగునట్లు అనుగ్రహించిన స్వామి శ్రీకపిలేశ్వరుడు. శ్రీనివాసుడు తాను ఆకాశ రాజుకూతురు పద్మావతిని మోహించానని, పెళ్లిరాయబారం చెయ్యమని తల్లి వకుళమాతకు చెప్పాడు. కొండల్లో తిరిగే మనమెక్కడ? చక్రవర్తికూతురు పద్మావతి ఎక్కడ? అని తల్లి ప్రశ్నిస్తుంది. అమ్మా! నీవు శ్రీకామాక్షీ సమేత కపిలేశ్వరస్వామిని ప్రార్థించి ఆకాశరాజు దగ్గరికి వెళ్లు. నెరవేరుతుందన్నాడు–

వేంకటేశ్వరుడు. కపిలేశ్వరునిఅనుగ్రహం వల్లే ఆకాశరాజు, వకుళమాతకు ఎదురేగి ఆహ్వానించి, శ్రీనివాసునికి పద్మావతిని ఇచ్చి పెళ్లి చేశాడు. వివాహం కావలసినవారు శ్రీకామాక్షీ కపిలేశ్వరులను సేవిస్తే చాలు. తప్పక పెళ్ళి అవుతుంది. వేంకటాచలక్షేత్రం ఎంత ప్రాచీన క్షేత్రమో అంతకంటె ప్రాచీనమైన క్షేత్రం **'కపిలతీర్థం'**మని **"శ్రీవేంకటాచలమాహాత్మ్యం"** తెలుపుతోంది.

శ్రాద్ధాదుల్ని నిర్లక్ష్యం చేసినవారు, మరచి పోయినవారు, పితృదేవతల శాపాలకు గురి అయి, అష్ట కష్టాలు పడుతున్నవారు **"కపిల తీర్థం"**లో తీర్థవిధులు ఆచరించి, తిరుమలయాత్ర చేస్తే చాలు. దోషాలు పోయి, కోరికలు తీరుతాయని కపిలతీర్థస్థలపురాణం తెలుపుతోంది.

ఇంతటి మహిమాన్వితమైన కపిలతీర్థం నిత్యమూ అభిషేకాలతో, అర్చనాదులతో, నవగ్రహశాంతులతో కల్యాణోత్సవాలతో, లక్ష బిల్వఅర్చనలతో, కార్తికమాసంలో విశేషహోమాలతో, మాఘమాసంలో మహాశివరాత్రి బ్రహోత్సవాలతో, దేవీనవరాత్రి ఉత్సవాలతో సందడిగా ఉన్న ఈ క్షేత్రంలో శ్రీకామాక్షీకపిలేశ్వరస్వామివార్లతో పాటు, ఈక్షేత్ర ప్రాంగణంలో శ్రీలక్ష్మీనారాయణులు, శ్రీరుక్మిణీసత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి సన్నిధులుకూడా ఉన్నాయి. కపిలతీర్థానికి పడమటి ఒడ్డున పర్వతగుహలో ప్రాచీనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రం ప్రవేశద్వారంలో, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, దాని వెనుక, శ్రీనమ్మాళువారలగుడి కూడా ఉన్నాయి.


ఇలా శైవవైష్ణవాలయాల సమ్మిశ్రితమై అత్యంత మహిమాన్వి తంగా వెలుగుతున్న తీర్థరాజం, అత్యంత ప్రాచీనమైన క్షేత్రం కపిలతీర్థం. ఇక్కడ ప్రతిసంవత్సరం మాఘమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మహాశివరాత్రి నాటిరాత్రి లింగోద్భవకాలంలో నాలుగుజాముల్లో కూడా



మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు, అదేరోజు తిరుమల క్షేత్రంలో క్షేత్రపాలకుడైన రుద్రునికి అభిషేకాలు జరపడం మరో విశేషం!

వేంకటాచలక్షేత్రంలో క్షేత్రపాలకుడైన రుద్రుడు, కొండ క్రింద శ్రీవేంకటేశ్వరునికి వివాహం చేయించిన, కల్యాణప్రదాత శ్రీకపిలేశ్వరుడే!

భక్తులను కూడా పాపవిముక్తుల్ని చేసి సర్వాభీష్టాలను నెర వేరుస్తున్న శ్రీకామాక్షీకపిలేశ్వరులను తిరుమల యాత్రికులు విధిగా దర్శించి, తమయాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకుందురు గాక!!



**ఓం నమశ్శివాయ**

# 8. అన్నమయ్య ఆకలి తీర్చిన అలమేలుమంగ!

**సు**మారు ఆరువందల ఏండ్లకిందట జరిగిన దివ్యగాథ! ఇప్పుడు దీన్ని కథ అంటున్నాం. కాని ఇది ఏడు కొండల్లో నిజంగా జరిగిన ఆనందమయమైన సంఘటన! మోకాళ్లమెట్ల దగ్గర చోటు చేసుకున్న అద్భుత వృత్తాంతం!

ఏమిటిది? అంటే.

అన్నమయ్య పేరు అందరూ వినే వుంటారు. ఆయన ఊరు తాళ్లపాక. తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ ఒక కొడుకు పుట్టాలి అంటూ సంతానంకోసం తిరుమలయాత్ర చేశారు. ఆనందనిలయుణ్ణి వేడుకొన్నారు. గరుడ గంభం దగ్గర సాగిలబడి వరపడినారు.

వేంకటేశుడు వరాలరాయుడు కదా! అడిగినవారికి లేదంటాడా! సాగిలబడి మగతగా వున్న నారాయణసూరి దంపతుల చేతుల్లో తన బంగారు నందక ఖడ్గాన్ని పెట్టాడు. ఆ ఖడ్గానికి ఉన్న చిరుగజ్జలు గల గల లాడాయి. ఆ సవ్వడితో ఆలుమగలు ఇద్దరికి మగత తొలగింది. కళ్లు తెరిచారు. అంతే! వారి యాత్ర సఫలమయ్యింది.

పరబ్రహ్మమైన ఆనందనిలయుని వరప్రసాదంతో లేక లేక పుట్టాడు **''అన్నమయ్య''**. గోముగా పెరిగాడు. అతిగారాబం వల్ల మంకుపిల్లవాడుగా తయారయ్యాడు. ఎనిమిదేళ్ల అన్నమయ్య. సరిగా బడికి పోడు. అల్లరిగా గాలికి తిరుగుతాడు. కూని రాగాలు తీస్తూ పాతగుళ్ల చుట్టూ. పొలాలెంబడి తిరుగుతాడు.

సోమరిగా పనీపాటా లేకుండా కాలక్షేపం చేస్తున్న అన్నమయ్యను ఇంట్లో అందరు అరిచారు. తలో మాటా అన్నారు, ఎనిమిదేళ్ల చిన్న బుడతడు కదా! అని కూడా ఆలోచించని చుట్టాలందరూ తిట్టారు, తిమ్మారు.



తాము వేడుకొంటేనే కదా! అన్నమయ్య బంగారు నందక ఖడ్గాంశంతో తమకు పుట్టాడన్న విషయాన్ని కూడా తల్లిదండ్రులు అప్పుడే మరచిపోయారు. అదే మాయ! అందువల్లే 'ఇనుప కొడవలి'ని చేతికిచ్చారు. గడ్డిని తెమ్మన్నారు.

అయోమయంలో పడ్డాడు అన్నమయ్య. ఆవేదనతో గడ్డిని కోయటంలో వేలు తెగింది. తన గ్రహచారం బాగలేదనుకొన్నాడు, 'ఇనుప కొడవలి"ని విసిరికొట్టాడు. ఇంటినుంచి పారిపోయాడు. తెగిన గాలిపటంలాగా గాలి ఎటు వీస్తే అటు ఏడుస్తూ పరిగెత్తాడు.

ఒంటరిగానే పోతున్నాడు. ఒక గమ్యం లేదు. ఎటు పోతున్నాడో తెలియదు. ఎటు పోవాలో తెలియదు. ఎందుకు పోతున్నాడో తెలియదు. ఏడుస్తూ పోతున్న అన్నమయ్యకు దూరంగా కొన్ని శబ్దాలు విన్పించినై.

గోవిందా! గోవిందా! ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా! గోవింద!!...అంటూ గోవిందనామాలు చెవుల్లో పడ్డాయి. ఆనందం అయింది. ఎన్నో యుగాలనుంచి ఆ గోవిందనామాలతో తనకు ఎంతో అనుబంధం వున్నట్లుగా తోచింది. తెలియని తన్మయత్వం కలిగింది.

ఇంతలో గుంపుగా వున్న యాత్రికులు అన్నమయ్య దగ్గరికి వచ్చారు. తెగిన వేలుతో, కారుతున్న నెత్తురుతో ఏడుస్తున్న అన్నమయ్యను చూశారు. జాలిపడ్డారు. ఎవరు నాయనా! నీవు. అని అడుగుతూ పక్కనే వున్న ఒక ఆకు పసరును అన్నమయ్య చేతికి పూశారు. వెంటనే గాయం మాయం అయ్యింది. అన్నమయ్య చెప్పిన కథంతా విన్నారు. మేం తిరుపతి కొండకు పోతున్నాం. నీవూ మాతోపాటు రా! తర్వాత ఆలోచిద్దాం. అంటూ అందరూ భజన చేస్తూ ముందుకు సాగారు. అన్నమయ్య కూడా వాళ్లవెంటే తిరుమలకొండకు నడిచాడు.

అలిపిరి నుంచి తిరుమలకొండ ఎక్కాడు. అందరూ గోవిందా! అంటూ వడివడిగా తిరుమలకొండను ఎక్కుతూ వుండినారు. ఎవరి ధ్యాస వారిదే! ఎవరి ధ్యానం వారిదే! ఇలా అందరూ ముందుకు సాగిపోయారు.

బాగా పొద్దు ఎక్కింది. ఎండ ఎక్కువగా వుంది. బాలుడైన అన్నమయ్య వెనక బడ్డాడు. ఒంటరివాడయ్యాడు. బాగా దప్పికగా వుంది. ఆకలిగా కూడా వుంది. ఉసూరుమంటూ అలాగే కాళ్ళీడ్చుకుంటూ మోకాళ్లమెట్ల దగ్గరికి వచ్చాడు, చుట్టూ చూశాడు మనుషుల జాడే లేదు. అందరూ వెళ్లిపోయారు. సరేలే అనుకొంటూ మోకాలిమెట్ల పర్వతాన్ని ఎక్కడానికి ప్రారంభించాడు అన్నమయ్య. ఒకటి రెండు మెట్లు ఎక్కాడు.

నీరసం ఎక్కువైంది. కళ్లు బైర్లుకమ్మాయి. కళ్లు తిరుగుతున్నాయి. ఎవరో కిందికి తోస్తున్నట్లుంది. కిందపడిపోతున్నా రక్షించండి! రక్షించండి అంటూ అరుస్తూ స్పృహ లేకుండ కిందపడ్డాడు అన్నమయ్య.

'కొంత సేపయింతర్వాత' అన్నమయ్యా! లే నాయనా! ఓ అన్నయ్యా నిన్నే! లేచి కూర్చో! అన్న పిలుపుతో అన్నమయ్య మేలుకొన్నాడు. చుట్టూ పరికించి చూశాడు. ఎవరూ కనపడలా. కాని మళ్లీ అదే పిలుపు! గొంతు మాత్రం వినపడుతున్నది.

మా అమ్మలాగే ఆప్యాయంగా, ఆత్మీయంగా పిలుస్తున్నది. అనుకుంటూ అన్నమయ్య మళ్లీ చుట్టూ చూశాడు. ఎవరు కనపడ్డం లేదు.

"అమ్మా! ఎవరు నీవు! మా అమ్మ లక్కమాంబవలె పలకరిస్తున్నావు. నీ చల్లని మాట వినపడుతున్నది కాని, నాకు ఏమీ కన్పించడం లేదు తల్లీ! దయతో కాపాడు తల్లీ" అన్నాడు అన్నమయ్య. కిలకిల నవ్వుతూ 'నాయనా! అన్నమయ్యా నేను అలమేలుమంగను. ఆనందనిలయుని



పట్టపురాణిని. ఇపుడు నీవున్న కొండ తిరువేంకటపు కొండ! సాలగ్రామాల మయం. అంతేకాదు. శ్రీనివాసుడుకూడ సాలగ్రామ శిలామూర్తి! అందువల్ల కాళ్లజోళ్లతో ఈ కొండను ఎక్కడం మహాపాపం! నీ కాళ్లకున్న చెప్పులను విడిచిపెట్టి చూడు. నీకు కనపడుతుంది. అంటూ అలమేలుమంగ ప్రేమగా పలికింది.



కాలిజోళ్లు విడిచిన వెంటనే అన్నమయ్యకు అమ్మ అలమేలుమంగమ్మ దివ్య దర్శనం అయ్యింది. ఆ పక్కనే కోటి సూర్యకాంతులతో భాసిస్తున్న తిరుమల కొండ కనిపించింది. అలమేలుమంగమ్మకు సాష్టాంగ నమస్కారం చేశాడు. చుట్టూ పరికించి చూస్తూ! అబ్బ! ఈ కొండంతా సాలగ్రామాలమయమే! నేను తెలియక చేసిన తప్పును క్షమించు తల్లీ! అంటూ ప్రార్థించాడు.

"నాన్నా! అన్నయ్యా లేచి కూర్చో! బాగా అలసివున్నావు. ఆకలిగా వుంది కదూ! ఎప్పుడు తిన్నావో ఏమో!... ఇదిగో ఇవి నీకోసమే తెచ్చాను.

ఇది శ్రీస్వామివారు నిత్యం ఆరగించే లడ్డు. ఈ లడ్డు స్వామివారికి చాల ఇష్టమైంది. అత్యంత రుచికరమైన దివ్యమైన ప్రసాదం! మెల్లగా తిను. అంటూ నోటి కందించింది అలమేలుమంగమ్మ!



ఇంకా. ఇదేమో పులిహోర! నిదానంగా తిను. ఇదేమో చక్కెర పొంగలి! ఈ చక్కెరపొంగలి కూడ మీ అయ్య వేంకటేశునికి బలే ఇష్టం. ఆ స్వామి తినగా మిగిలినవి నీ కోసమే తెచ్చా, తొందరపడకు, నిదానంగా ఆరగించు. మరి ఇదేమో మిరియపుపొంగలి. దండిగా నెయ్యి వేసి చేసింది. కమ్మగా వుంటుంది. ఇది గట్టిగా వుండే మీగడ పెరుగన్నం. అంటూ అన్నింటిని, ఇంకొంచం తిను, ఇంకొంచం పెట్టించుకో అంటూ నోట్లో ముద్దలు పెట్టింది. కొన్ని ముద్దలు అన్నమయ్య చేతిలో పెట్టింది అలమేలుమంగ!

అన్నమయ్య కడుపు నిండిందమ్మా! చాలు. ఇంక చాలు అని చెప్పినా, బుజ్జగిస్తూ అడి గడిగి మరీ బలవంతం చేస్తూ ఇంకా తినిపించింది.



అలమేలుమంగమ్మ కొసరి కొసరి, కోరి కోరి తినిపించిన తిరుమలేశుని కమ్మనైన లడ్డూలు, ప్రసాదాలవల్ల అన్నమయ్యకు ఆకలి తీరింది. అలసట తీరింది! ఒక కొత్త ఉత్సాహం ఉరకలేసింది! ఒక చైతన్యం వెల్లి విరిసింది! ఒక దివ్య తేజస్సు ఆవరించింది! ఒక ఆధ్యాత్మిక శక్తి ఆవహించింది. అవ్యక్తమైన మధురానుభూతులతో మైమరిచిన అన్నమయ్య,

**చొచ్చితిఁదల్లి నీమఱుఁగు సొంపుగ నీ కరుణా కటాక్షమె**
**ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి యో యలుమేలుమంగ నీ**
**మచ్చిక నందు నీ తరుణి మన్నన నే నిను గంటి నీకు నా**
**బచ్చెనమాట లేమిటికి బ్రాతివి చూడగ వేంకటేశ్వరా!**

అంటూ ఆనందనిలయుని పట్టపుదేవేరి అలమేలుమంగమ్మను నూరుపద్యాలతో ఆశువుగా స్తుతించాడు.

"భళా! అన్నమయ్యా! భళా! తిరుమలప్పని కొండ అదిగో! అదే నీ గమ్యం! దేవదేవుడైన శ్రీనివాసుని కొలుచుటకు వెళ్లు" అంటూ అలమేలుమంగ రెండు చేతులతో ఆశీర్వదించి అదృశ్యమయ్యింది.

ఎనిమిదేళ్ల అన్నమయ్య వింత వింత వెలుగులతో ప్రకాశిస్తున్న తిరువేంకటపుకొండను చూస్తూ "అదివో అల్లదివో హరివాసము" అని పాడుకొంటూ ఎక్కడం ప్రారంభించాడు!

**ఓం శ్రీనివాసాయతే నమః**

# ౮. శేషాద్రీశుని సేవలో..
# శేషాంశ సంభూతుడు!!

**'శ్రీవైకుంఠం'** పేరును అందరు వినే ఉంటారు. అది ఒక అంతులేని క్షీరసముద్రం! ఆ సముద్రంలోని అలలమీద వేయి పడగల ఆదిశేషుడు చుట్ట చుట్టుకొని తెప్పలాగా తేలుతూ ఉంటాడు. ఆ శేషునిపై శ్రీమహావిష్ణువు పడుకొని ఉంటాడు. ఆయనను శ్రీదేవి భూదేవేరులు సేవిస్తుంటారు. ఎదురుగా ఆ స్వామి ఆజ్ఞాపాలన కోసం గరుడ భగవానుడు సర్వసన్నద్ధమై నిలిచి ఉంటాడు. సనందాదియోగులు, సప్తర్షులు, దేవతలు మాత్రం వెళ్లి దర్శించేవాళ్లు. ఆ లోకం అనంతమైన 'ఆధ్యాత్మిక ఆనందధామం'. అచటికి వెళ్లగలిగిన వాళ్లు మాత్రమే ఆ పరమానందాన్ని మనసారా జుర్రుకోవచ్చు అంతే! బాగుంది! కాని...

ఆ శ్రీవైకుంఠం ఎక్కడుందో, ఏ దిక్కులో వెళ్లాలో, ఎంత దూరం వెళ్లాలో, ఎలా వెళ్లాలో ఎవరికీ తెలియదు. అక్కడికి ప్రత్యక్షంగా వెళ్లివచ్చిన వాండ్లెవ్వరూ మనకు తారస పడనే పడరు. అందులోను ఈ కలియుగంలో మరీ విచిత్రం!

అందుకే ఆ లోకానికి రాలేని కలియుగ మానవులకోసం ఆ ఫణీంద్రశాయి వైకుంఠంతో పాటు భూలోకానికి వచ్చాడు. ఆ శేషతల్పమే ఇక్కడ 'శేషాద్రి' అయ్యింది. ఆ శ్రీహరే శేషాద్రీశుడయ్యాడు. ఇలాగ ఆయన కొలువై ఉన్న తిరుమల క్షేత్రం భూలోక వైకుంఠంగా భాసిల్లింది. భాసిల్లుతునే వుంది.

అందుకనే తాళ్లపాక అన్నమాచార్యులు ఇలా అన్నాడు.

**అదివో అల్లదివో! హరివాసము**
**పదివేల శేషుల పడగల మయము**



**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ!**
**తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ!!**

వైకుంఠవాసుడైన శ్రీహరితో పాటు, ఆ వేయిపడగలస్వామి కూడ ప్రతియుగంలోను అవతరించి సేవిస్తుంటాడు.



**అనంతః ప్రథమం రూపం, లక్ష్మణస్తు తతః పరమ్।**
**బలభద్రః తృతీయ స్స్యాత్, కలౌ రామానుజ స్మృతః॥**

మొదట వైకుంఠంలో అనంతుడైన ఆదిశేషుడుగాను, రెండవమారు లక్ష్మణునిగాను, మూడవమారు బలరామునిగాను, కలియుగంలో భగవద్రామానుజులుగా అవతరించాడు!

సాక్షాత్తు శేషాంశతో అవతరించిన భగవద్రామానుజాచార్యులవారు తమ నూట ఇరవైఏండ్ల(1017-1137) సుదీర్ఘజీవితంలో వారు చేసిన అనేకానేకమైన అద్భుతమైన కార్యాల్లో ఘనకార్యాల్లో ప్రధానంగా రెండింటిని పేర్కొనవచ్చు.

శ్రీమద్రామానుజులవారు ప్రాచీనమైన శ్రీవైష్ణవ మతాన్ని సముద్ధరించడంతోపాటు, సమాజంలో అగ్రకులాల స్థాయి నుండి సంఘం చేత వెలివేయబడి అట్టడుగున ఉన్న నిమ్నకులాలవారికి శ్రీవైష్ణవమత స్వీకార అర్హతను కల్గించడం మొదటి అద్భుతకార్యం.

సనాతన వైదిక సంస్కృతినీ, హైందవ ధర్మాన్నీ పరిపుష్టం చెయ్యడానికి ఆసేతు హిమాచలం పర్యటించాడు. అందులో భాగంగా, శ్రీవైష్ణవ సిద్ధాంతానుసారంగా వ్యాఖ్యాన గ్రంథాలను రచించారు. దానితో పాటు ఎన్నో వైష్ణవ ఆలయాలను శ్రీవైష్ణవ క్షేత్రాలను అభివృద్ధి చేశారు. ఆ యా క్షేత్రాల్లో, ఆలయాల్లో అస్తవ్యస్తంగా, అసమగ్రంగా ఉన్న పూజలను, ఉత్సవాలను, ఆగమశాస్త్రాల నియమానుసారం సంప్రదాయబద్ధంగా తీర్చిదిద్ది వాటిని నిర్వహింపజేయడం రామానుజులు నిర్వహించిన రెండవ ఘనకార్యంగా పేర్కొనవచ్చు.

అలాగ వారు సముద్ధరించి, అర్చనాది కార్యక్రమాలను, ఉత్సవాలను పటిష్ఠంగా ఏర్పరచిన శ్రీవైష్ణవ క్షేత్రాల్లో ప్రప్రథమంగా పేర్కొనదగింది వేంకటాచల క్షేత్రం.

శేషాచలక్షేత్రానికీ శేషాంశంతో అవతరించిన రామానుజులవారికీ విడదీయరాని విడదీయలేని దివ్యఅనుబంధం పెనవేసుకుంది.

**తిరుమల కొండే దేవుడు**

తిరుమలకొండే సాక్షాత్తూ 'శ్రీనివాస పరబ్రహ్మ' అనీ ఆళ్వార్లందరూ కీర్తించారు. వాళ్లలో కొందరు తిరుపతికి వచ్చినా, కొండక్రింది నుంచే నమస్కరించారు. వాళ్ల అభిప్రాయాన్ని భగవద్రామానుజులు కూడా అనుసరించి కొండకు పాదాలతో తొక్కుతూ వెళ్లకూడదని నిశ్చయించారు. కాని రామానుజులవారి గురువు తిరుమలనంబీ, శిష్యుడైన అనంతాళ్వారు, శ్రీవారి ఆలయంలో జరిగే అర్చనాదులను తీర్చిదిద్దవలసి ఉందన్న అభ్యర్థన



మేరకు శ్రీభగవద్రామానుజులవారు మూడు మారులు మాత్రం తిరుమలకొండకు వెళ్లారు. అది కూడ మోకాళ్లతో పాకుతూ కఠోరదీక్షతో మాత్రమే కొండకు వెళ్లారు.

ఆళ్వారులనాటి నుండి తిరుమల కొండే సాక్షాత్తూ శ్రీనివాసుడనీ, అందువల్ల ఆ కొండను పాదాలతో తొక్కుతూ తిరుమలకు వెళ్లకూడదని శ్రీరామానుజులవారు నిశ్చయించారు.

కానీ, ఆ క్షేత్రంలో శ్రీనివాసుని పూజాకార్యక్రమాలు సక్రమంగా నిర్వహింపబడేటట్లుగా చూడడానికై, తప్పక తిరుమలకు రావలసిందన్న తిరుమలనంబి, అనంతాళ్వారుల అభ్యర్థనను అంగీకరించారు రామానుజుల వారు. అందుకే వారు మూడు మారులు మాత్రం మోకాళ్లతో దేకుతూ తిరుమల కొండకు వెళ్లారు.

తిరుమల క్షేత్రం, ఐతిహ్యం ప్రకారం, ఆదివరాహక్షేత్రం అనీ, తొలిదైవమైన శ్రీవరాహస్వామికి నిత్యం తొలిపూజ, తొలి నివేదన, తొలి దర్శనాదుల కట్టడిని భగవద్రామానుజులవారు పునరుద్ధరించారు. తామూ తొలిగా శ్రీవరాహస్వామిని దర్శించారు.

తిరుమల క్షేత్రంలో శ్రీవైకుంఠనాథుడైన శ్రీనివాసుడే సాలగ్రామ శిలామూర్తిగా వెలిశాడనీ, ఆ స్వామే మళ్లీ విఖనస మహర్షిగా అవతరించి, తన అర్చనా విధానాన్ని ఏర్పాటు చేసుకున్నాడనీ, అందువల్ల తిరుమల క్షేత్రంలో ఏ మాత్రం లోపం లేకుండా, రాకుండా వైఖానస ఆగమం ప్రకారంగా పూజలు జరిగి తీరాలని గట్టిగా నిర్ణయించారు. అపర శేషావతారుడైన శ్రీరామానుజులవారు.

పరమభక్తుడైన తొండమానుడు అనే రాజుకు శత్రువుల నుండి రక్షణగా శ్రీవేంకటేశ్వరస్వామి తన శంఖుచక్రాలను ఇచ్చాడు. అతను మళ్లీ తిరిగి ఇవ్వడానికి రాగా, వాటిని ఈ కలియుగంలో ధరించనంటూ స్వీకరించలేదు.

అందువల్ల శంఖు చక్రాలు లేని తిరుమలలోని ఈ మూర్తి శివుడా! కుమారస్వామి వారా! శక్తిదేవతా! అని సందేహాలు అనేకమందికి కలిగాయి. వక్షఃస్థలమహాలక్ష్మితో విరాజిల్లుతూవున్న ఈ స్వామివారికి, తన తపశ్శక్తి చేత శంఖుచక్రాలను స్వయంగా స్వామివారే ధరించునట్లు చేసి సాక్షాత్తు విష్ణువే అని నిరూపించి తిరుమలను శ్రీవైష్ణవ క్షేత్రంగా ప్రతిష్ఠించిన ఘనత శ్రీరామానుజులవారిదే! అంత మాత్రమేగాక శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న "వ్యూహలక్ష్మి"ని అందరూ దర్శించడం కుదరదు కనుక, స్వామివారి వక్షః స్థలంలో ఆభరణంగా అందరికీ కనపడేటట్లుగా "బంగారు లక్ష్మి" ప్రతిమను అలంకరింపజేశారు. ఆనాటి నుంచి నియమబద్ధంగా వక్షఃస్థల లక్ష్మితో కూడి ఉన్న శ్రీనివాసునికి శుక్రవారంనాడు మాత్రమే అభిషేకం జరగాలని నిర్ణయించి అమలు చేయించిన ఘనత రామానుజుల వారిదే!

తిరుమల శ్రీనివాసునికి పుష్పాలంటే చాల ఇష్టం. ఈ క్షేత్రంలోని పూలన్నీ శ్రీవారి పూజకే వినియోగించాలని క్షేత్ర నియమం. అందువల్లే "పుష్పమండపం" గా ప్రసిద్ధిపొందిన తిరుమలలో పుష్పకైంకర్యం కోసం అనంతాళ్వాను అనే శిష్యుణ్ణి శ్రీరంగంనుంచి తిరుమలకు పంపించి నిరాఘాటంగా కైంకర్యం చేయించిన పరమభక్తాగ్రేసరుడు శ్రీమద్రామానుజ స్వామి. ఆ సందర్భంలో అనంతాళ్వానుతో శ్రీనివాసుడు పరాచికాలాడుతూ ఆయన పెంచిన పూలతోటకు వెళ్లి దాన్ని పాడుచేశాడు. ఆ ఘట్టానికి గుర్తుగా 'బాగ్ సవారీ' ఉత్సవాన్ని ఏర్పాటు చేశాడు రామానుజులు.

తిరుమల శ్రీస్వామివారి శుక్రవారాభిషేకంలో పాపవినాశనతీర్థం, ఆకాశగంగాతీర్థం, బంగారుబావితీర్థాలు ఉపయోగించవచ్చని రామానుజులు తీర్మానించారు. శ్రీవారి తీర్థ కైంకర్యంలో పాల్గొనే తిరుమలనంబిని తాతా! తాతా! అంటూ ఒక బోయయువకుడిగా శ్రీనివాసుడు పరీక్షించిన కథను విన్న రామానుజులవారు ఆ గాథకు గుర్తుగా "తణ్ణీరముదు ఉత్సవం" ఏర్పాటు చేశారు.



అనగా ఆ రోజున తిరుమలనంబి వంశీయులు ఘనంగా స్వాగత సత్కారాలతో ఆలయంలో చందన తాంబూలాదులతో సంభావింప బడునట్లుగా ఏర్పాటుచేశారు.

తిరుమల శ్రీవారి బ్రహ్మో త్సవంలో ఐదవ రోజున గరుడోత్సవంనాడు శ్రీ విల్లిపుత్తూరు గోదా దేవి ధరించిన పూలమాలను తెచ్చి తిరుమల శ్రీవారికి ధరింపజేసే ఏర్పాటుతో పాటు, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ ధరించిన పూలమాలను, కనుమ పండుగ రోజున గోదా కల్యాణంరోజున తిరుమలకు తెచ్చి శ్రీవారికి సమర్పించే ఏర్పాటును రామానుజులవారు చేశారు.

తిరుమల శ్రీస్వామి పుష్కరిణి ఒడ్డున ప్రాచీనమైన యోగనర సింహస్వామి శిలావిగ్రహం పూజా పురస్కారాలు లేకుండా ఉండింది. ఆ మూర్తిని ఆలయంలో ప్రతిష్ఠింపజేసి, నిత్యనివేదనాదులు ఏర్పాటు చేశారు యతిరాజస్వామి వారు.

అలాగే తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో గోవిందరాజస్వామివారి మూలమూర్తిని ప్రతిష్ఠింపజేశారు. కపిలతీర్థంలో నాలుగుమూలలా శ్రీ సుదర్శనచక్ర యంత్ర స్తంభాలను ప్రతిష్ఠించి, అది "చక్రత్తాళ్వార్ తీర్థం"గా మార్పు చేయడంతో పాటు, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి మరియు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల అనంతరం ఈ 'చక్రత్తాళ్వార్ తీర్థం'లో 'చక్రస్నానం' అనే 'అవభృథం' జరిగేటట్లుగా ఏర్పాటు చేశారు. తిరుపతిలో ఆళ్వారుల అందరి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు.

ఇలా తిరుమల, తిరుపతి ఆలయాలలో అర్చనాది కార్యక్రమాలను, ఆలయ వ్యవస్థను సమున్నతంగా తీర్చిదిద్ది భవిష్యత్త రాలవారికి అందించిన ఘనత శ్రీరామానుజాచార్యులవారికి దక్కుతుంది.

తిరుమలక్షేత్రాన్ని సందర్శించిన క్షణంలో శ్రీరామానుజాచార్యుల మహిమను చాటే ఒక మధురమైన ఘట్టాన్ని తెలుసుకొని ఆనందించుదాం.

## పెరుగమ్మే పడతికి పరమపదం!

శ్రీరామానుజులవారు తిరుమలలో పెరుగును అమ్మే గొల్ల స్త్రీకి ముక్తిని ఇప్పించాడట! విడ్డూరంగా ఉంది కదూ! ఏంటో ఆ కథా కథనం?

పూర్వం తిరుమలేశునికి కొన్ని ఉత్సవాలు తిరుచానూరుల్లో జరిగేవట! తిరుమలేశునికి ఉత్సవాలు అన్నీ పూర్తిగా కొండపైనే జరగాలనీ, అందుకోసం శ్రీవారి ఆలయం చుట్టూరా వీథుల్ని చదును చేసి, వెడల్పు చెయ్యడం, మండపాలు కట్టించడం, అర్చకుల ఇండ్లను నిర్మించడం, శ్రీవైష్ణవ మఠాల్ని కట్టించడం వంటి పనుల్ని తీర్మానించారట శ్రీరామానుజులవారు. తమకు గురువైన తిరుమల నంబిని, శిష్యుడైన అనంతాళ్వారులను వీటి నిర్మాణాన్ని పర్యవేక్షించుమని వారు ఆదేశించారు.

ఆ సమయంలో ఆ యా పనుల్లో నిమగ్నమైన కూలీలకు, పర్యవేక్షిస్తున్న వైష్ణవస్వాములకు మాత్రం ఉచితంగా 'మజ్జిగ' ను ఇచ్చేదట ఒక గోపవనిత. మిగిలిన యాత్రికులకు మాత్రం పెరుగును, మజ్జిగను అమ్ముతుండేది. అమాయకంగా, నిష్కల్మషంగా ఉండే గొల్ల వనితను ఉచితంగా పెరుగు, మజ్జిగను ఇవ్వడంలో నీ అభిప్రాయం ఏమిటి? అని కొందరు అడిగారు. ఆమె అన్నది గదా! "అయ్యా! ఎండలో కష్టపడుతున్న సాములోర్లకు 'చల్ల'ను ఇస్తే నేను చల్లగా ఉంటాను. పుణ్ణెం వత్తదంట! స్వామిని చేరుకుంటానంట!" అని. వాళ్లన్నారు, కదా, "బాగుంది తల్లీ! నీవు మోక్షం ఇప్పించమని వాళ్లను అడుగు" అని తిరుమల నంబిని, అనంతాళ్వారులను చూపించారట! వాళ్లు.

వెంటనే ఆ గోపవనిత "సాములూ! మీతో గోయిందస్వామి మాట్లాడతారంట గదా! మీరు చెప్తే నాకు వైకుంఠం వత్తదంట. ఇప్పించండి సామీ!" అని అడిగింది.



"రేపు చెపుతాం తల్లీ!" అంటూ ఇద్దరూ దాటవేశారు. ఆ రాత్రి చల్లలమ్మే గొల్లస్త్రీ కోరికను ఏడుకొండలస్వామికి విన్పించారు. ఆమెకు వైకుంఠం ఇచ్చే శక్తీ మీకే కాదు, నాకు కూడా లేదు. రామానుజులు మాత్రమే ఇప్పించగలరని శ్రీనివాసుడు వాళ్లతో పలికాడట! ఆ విషయం ఆమెకు తెలిపారు వాళ్లిద్దరూ. సరిగ్గా ఆ దినాల్లోనే శ్రీ రామానుజాచార్యస్వామివారు తిరుమల కొండకు చేరుకొన్నారట!

ఎంతో భక్తిగా, ప్రేమగా, నిష్కల్మషంగా ఆమె చేస్తున్న మజ్జిగ వితరణ సేవను రామానుజులవారు వినడమే కాదు. స్వయంగా గమనించారు. ఒకరోజు ఆ వనిత ఒదిగి ఒదిగి భగద్రామానుజుల వారికి రెండు చేతులెత్తి దండాలు పెడుతూ సాగిలబడింది. "సాములూ! కొంచం చల్ల తీసుకోండి సామీ!" అంటూ, భయం భయంగా అడిగింది. కొందరు ఆమెను వారించబోయారు.

రామానుజులవారు "తల్లీ! ఇది శ్రీనివాస ప్రసాదం అంటూ స్వయంగా చల్లను తాగుతూ నీకు ఏం కావాలమ్మా!" అని అడిగారు. "సాములూ, మీరు చీటి రాసిస్తే, మీరు చెప్తే నాకు వైకుంఠం వత్తాదంట! ఈ జల్మానికి అదిప్పించండి. చాలు సాములూ" అంటూ వంగి వంగి దండాలు పెట్టింది.

వెంటనే భగవద్రామానుజులవారు ఒక తాటాకును తెప్పించి "శ్రీనివాస పరబ్రహ్మ ముక్తిని ప్రసాదించు గాక!" అంటూ ఆమె చేతిలో పెట్టారట! అంతే! వెంటనే **"పెరుగమ్మే పడతి పరమపదం"** పొందింది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఆమె పేరుతో ఎత్తైన నాలుగు స్తంభాల **"గొల్లమండపం"** ఆమె గాథకు గుర్తుగా వెలసిందని జనశ్రుతి!

సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరునికే గురుస్థానం అలంకరించి, జగద్గురువుగా భాసిస్తున్న శేషాంశ సంభూతుడైన రామానుజులవారిని నిత్యమూ స్మరించి మనం అందరం కూడా తరించుదాం.

**శ్రీ గురవేనమః**

# 10. పరమపుణ్యధామమూ... ఉత్తరద్వారదర్శనము!!

**శ్లో॥ సత్యం సత్యం పునస్సత్యం న దేవో వేంకటేశ్వరాత్**
**బ్రహ్మాండే నాస్తి, యత్కించిత్ న భూతం న భవిష్యతి.**
**– భవిష్యోత్తర పురాణం**

సత్యంగా చెబుతున్న మాట! ఒకసారి కాదు. మళ్లీ మళ్లీ చెబుతున్న సత్యమైన మాట ఇది! ఏమిటా సత్యం. అంటే ఈ బ్రహ్మాండాల్లో ఎక్కడా అటు భూతకాలంలోను ఇటు భవిష్యత్తులోను శ్రీవేంకటేశ్వరునివంటి దేవుడు లేడు. లేనే లేడు. కనపడడు కూడా" అని.

అలాంటి ఆనందనిలయుని దర్శనంకోసం ఇంటి నుంచి బయలు దేరడం, ఏడుకొండల్లో విహరించడం, బంగారుమేడ ఆనందనిలయాన్ని వీక్షించడం, ఆనందనిలయుని నిలువెత్తు దివ్యమంగళ విగ్రహాన్ని కన్నులారా దర్శించడం... ఇలా వీటన్నింటివల్ల దివ్యానుభూతులతో ఒక ఆనందాన్ని పరమానందాన్ని పొందడం అద్భుతం పరమాద్భుతం! అయితే!

'అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక ఎత్తు' అన్నట్లు ఇన్నిన్ని ఆనందాల్ని నిరంతరం పంచుతూ. భక్తులను మైమరపిస్తున్న తిరుమలక్షేత్రాన్ని ఏడాది పొడవునా దర్శించడం ఒక ఎత్తు! కాగా

ప్రత్యేకంగా ధనుర్మాసంలో ఒక నెలరోజుల్లో, ఏ ఒక్క రోజైనా తిరుమలక్షేత్రాన్ని సందర్శించే భాగ్యం కలగడం, ఆనందనిలయుణ్ణి దర్శించి వింత వింత అనుభూతుల్ని ఆనందాన్ని పొందే అదృష్టం కలగడం మాత్రం, మరో ఎత్తు! అందులోను ధనుర్మాసంలో వచ్చే వైకుంఠఏకాదశిపండుగనాడు కలియుగవైకుంఠంలో విహరించడంవల్ల, సందర్శించడంవల్ల భక్తుని మనస్సు ఆనందాల పంటలు పండేపూదోట అవుతుంది.



**వెంకన్న సన్నిధిలో వైకుంఠ ఏకాదశి**

ధనుర్మాసంలో శుక్లపక్షంలో వచ్చే 'ఏకాదశి'ని 'వైకుంఠ ఏకాదశి' అంటారు. తిరుమలక్షేత్రంలో వైకుంఠఏకాదశి, ఆ మరునాడు వైకుంఠద్వాదశి ఇలా ఇది రెండు రోజుల పండుగగా ఎన్నో విశిష్ట సేవలతో నిర్వహింపబడుతుంది.

**వైకుంఠద్వారం తెరవబడుతుంది**

వైకుంఠ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంతసేవానంతరం బంగారు వాకిళ్లు మూసివేస్తారు. పిదప తెల్లవారుజామున వైకుంఠఏకాదశినాడు సుప్రభాతసమయంలో బంగారు వాకిళ్లు తెరచినప్పటినుండి మరునాడు వైకుంఠద్వాదశినాటి రాత్రి ఏకాంతసేవ వరకు శ్రీవారి గర్భాలయానికి దగ్గరగా ఆనుకొని ఉన్న **"ముక్కోటిప్రదక్షిణ మార్గం"** తెరవబడుతుంది. ఈ ప్రదక్షిణ మార్గానికి ఉన్న ద్వారాలను వైకుంఠద్వారాలనీ, ఉత్తరద్వారాలనీ అంటారు. ఈ మార్గాన్ని 'వైకుంఠప్రదక్షిణమార్గం' అనీ అంటారు. ఈ మార్గం విద్యుద్దీపాలతో, సుగంధ, సుమనోహరమైన పులమాలలతో అలంకరింపబడిన ఈ వైకుంఠప్రదక్షిణంలో ప్రవేశించే భాగ్యం ఏడాదిలో ఈ రెండురోజులు మాత్రమే కలుగుతుంది. వైకుంఠఏకాదశి, ద్వాదశి రోజుల్లో శ్రీ స్వామివారిని దర్శించిన తర్వాత భక్తులకు వైకుంఠప్రదక్షిణంలో ప్రవేశం కలుగుతుంది. ఈ రెండు రోజులూ విమానప్రదక్షిణంలో భక్తులు అనుమతింపబడరు. వైకుంఠ ప్రదక్షిణంలో ప్రవేశించిన భక్తులకు దివ్యానుభూతులతో పాటు, పూర్వసంచిత పాపకర్మలన్నీ నశిస్తాయి. ఇష్టార్థాలన్నీ నెర వేరతాయి.

**స్వర్ణరథోత్సవం**

వైకుంఠ ఏకాదశినాడు సప్తగిరీశునికి మరో విశేష ఉత్సవం జరుగుతుంది. అదే స్వర్ణరథోత్సవం!

వైకుంఠ ఏకాదశినాడు ఉదయం 8 గంటలవేళ కలియుగవైకుంఠ నాథుడైన కొండలరాయడు శ్రీదేవీ భూదేవేరులతో కలిసి బంగారుతేరుపై

పురవీధుల్లో దర్శనమిస్తారు. వైకుంఠఏకాదశినాటి స్వర్ణరథోత్సవంలో పయనిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుణ్ణి దర్శిస్తే చాలు. భక్తుల మనోరథాలు తప్పక తీరతాయి. భక్తుల గోవిందఘోషల మధ్య జరిగే తిరుమల గోవిందుని స్వర్ణరథోత్సవదృశ్యాన్ని వర్ణించడం అక్షరాలకు అందదు. దర్శించి అనుభవించాలి. అంతే!

**శ్రీస్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటి ఉత్సవం**

వైకుంఠఏకాదశి మరునాడు 'వైకుంఠద్వాదశి'. వీటినే "ముక్కోటి ఏకాదశి", "ముక్కోటిద్వాదశి" అంటారు. వైకుంఠఏకాదశి మరునాడు వైకుంఠద్వాదశినాడు **"శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి ఉత్సవం"** జరుగుతుంది.

**ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే**
**ఆయాతి సర్వతీర్థాని స్వామిపుష్కరణీ జలే**
**తత్ర స్నాత్వా నరః సద్యోముక్తి మేతి నసంశయః**
**యస్య జన్మ సహస్రేషు పుణ్య మేవార్జితం పురా**

ధనుర్మాసంలో వైకుంఠద్వాదశినాటి అరుణోదయ వేళలో ముక్కోటి తీర్థాలు **"శ్రీస్వామి పుష్కరిణి"**లో మునకలిడుతాయి. శుభప్రదమైన ఆ వేళలో స్నానం చేసే మహాభాగ్యం అందరికీ కలుగనే కలగదట! ఎవరైతే వేలజన్మల్లో పుణ్యాన్ని ఆర్జించుకొని ఉంటారో, వారికి మాత్రమే ఈ నాడు తిరుమల శ్రీవారి కోనేట్లో స్నానం చేసే భాగ్యం కలుగుతుంది. అలాంటి వారికి సద్యోముక్తి కలుగుతుంది. అంటే వారు శరీరంతో ఉన్నా, జీవన్ముక్తిని పొందుతారని సారాంశం. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని స్కాందపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం స్పష్టం చేస్తోంది.

**శ్రీవారి చక్రస్నానం**

ఇలాంటి శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి శుభఘడియల్లో, అంటే వైకుంఠ ద్వాదశినాటి అరుణోదయవేళలో శ్రీసూర్య భగవానుడు



ఉదయిస్తుండగా తిరుమల శ్రీవారిఆలయం నుండి శ్రీ సుదర్శనభగవానుని ఉత్సవమూర్తి ఊరేగింపుగా వెళతారు. మహాప్రదక్షిణంమార్గంలో దర్శనమిస్తూ ఊరేగింపుగా శ్రీ సుదర్శన భగవానుడు 'శ్రీస్వామి పుష్కరిణి'కి చేరుకొంటారు. అక్కడ ముందుగా శ్రీసుదర్శనచక్రత్తాళ్వారుకు అర్చన అభిషేకాలు పూర్తి అయినతర్వాత శ్రీస్వామిపుష్కరిణిలో అర్చకస్వాములు మంగళ స్నానం చేయిస్తారు. దీన్నే **"చక్రస్నానం"** అంటారు. వైకుంఠ ద్వాదశినాటి సూర్యోదయవేళలో శ్రీ స్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి శుభఘడిమల్లో ముక్కోటితీర్థాలు మునిగేవేళ శ్రీ వేంకటేశభగవానుని దివ్యాయుధమైన శ్రీ సుదర్శనునికి జరిగే చక్రస్నానం సమయంలో వేలాదిమంది భక్తులు కోనేట్లో పవిత్రస్నానాలు చేస్తూ పునీతులవుతారు. ఇది మహాద్భుత ఘట్టం. ఇది సిద్ధించిన భక్తుని అదృష్టం ఏమని చెప్పగలం! ఎంతని చెప్పగలం!!

ఎందుకంటే!

**శ్లో॥ స్వామిపుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనం**
**ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్**

స్వామిపుష్కరిణిలో స్నానం చెయ్యడం, సద్గురువు పాదసేవ దొరకడం, ఏకాదశీవ్రతం ఆచరించడం అనే మూడు పవిత్ర కార్యాల్లో, ఒక్కటంటే ఒక్కటైనా కలగడం ఎంతో అదృష్టం.

ధనుర్మాసం, అందులో వైకుంఠఏకాదశి, ద్వాదశి పండుగవేళల్లో, శ్రీస్వామిపుష్కరిణీస్నానం చేసి శ్రీవారిని దర్శించే భాగ్యం కలగడం ఎంతటి వారికో మాత్రమే కలుగుతుంది.

**తిరుమలలో "ధనుర్మాసం"**

'ధనుర్మాసం' నెలలో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆరాధనల్లో, అర్చనల్లో, సేవల్లో, ఊరేగింపుల్లో కొన్ని ప్రత్యేకతలు గోచరిస్తాయి.

శ్రీవారి మూలమూర్తిని సాక్షాత్తు శ్రీకృష్ణునిగాను, వక్షఃస్థల శ్రీమహాలక్ష్మిని గోదాదేవిగా భావించి వక్షఃస్థలంలో రెండు వైపులా బంగారు చిలుకను, తమలపాకుల చిలుకను అలంకరిస్తారు. ఆ తర్వాత సహస్రనామార్చనలో శ్రీస్వామివారికి బిల్వదళాలను ఉపయోగిస్తారు. పిదప శ్రీవారికి వేడివేడిగా పొంగళ్ళను, బెల్లపు దోసెలను నివేదిస్తారు.

రాత్రి ఏకాంత సేవాసమయంలో ఈ నెలరోజుల పాటు వెన్నముద్ద కృష్ణునికి పట్టెమంచంపై శయనభాగ్యం కలిగిస్తారు, ఆ తెల్లవారుజామున సుప్రభాతసమయంలో గోదాదేవి పాశురాలను ఏకాంతంగా జియ్యంగార్లు, వైష్ణవాచార్యులు పఠిస్తూ మేల్కొల్పుతారు. ఆ తర్వాత చిన్నికృష్ణునికి గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయించి. పొంగళ్లను, బెల్లవుదోసెలను నివేదిస్తారు.

### ముల్లోకాల తీర్థస్నానఫలం

చిరంజీవి అయిన మార్కండేయమహర్షి పూర్వం బ్రహ్మ దేవుణ్ణి గూర్చి తపస్సుచేశాడు. సమస్తలోకాల్లోని అన్నితీర్థాల్లో స్నానం చేసేట్లుగా వరం ఇమ్మని అడిగాడు. అది అసాధ్యం! ఎన్నెన్ని లోకాలు ఉన్నాయో నాకే తెలియదు. ఈ బ్రహ్మాండాలు అనంతం. అందువల్ల నీవు వేంకటాచలంలోని **"శ్రీస్వామిపుష్కరిణి"**లో ధనుర్మాసంలో వైకుంఠఏకాదశి, ద్వాదశిరోజున సూర్యోదయవేళలో స్నానం చేస్తే చాలు. అన్ని తీర్థాలస్నాన ఫలితం సిద్ధిస్తుంది. ఎందుకంటే సమస్తతీర్థాలు తమ పాపాన్ని పోగొట్టు కోవడం కోసం ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి, శ్రీస్వామిపుష్కరిణి తీర్థ ముక్కోటినాటి అరుణోదయవేళలో ఆ కోనేట్లో మునకలు పెడతాయి. అట్లా నీ కోరిక నెరవేరుతుంది అని వరమిచ్చాడు బ్రహ్మదేవుడు. ఇలా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశీ, ద్వాదశీ పండుగ రోజుల్లో కలియుగ వైకుంఠమైన తిరుమలను దర్శించి ధన్యుల మవుదాం.

**ఓం నమో వేంకటేశాయ!**

# 11. మహిమల కొండ



అది ప్రాచీనమైన ఒక మహానగరం! చాల రద్దీగా ఉంది. ఆ రోజు మరీను. అందులోను నాలుగు దారుల కూడలి. రణగొణ ధ్వనులు. చాలా వేగంగా వచ్చిపోయే వాహనాలు, తమ వస్తువుల్ని అమ్ముకోవడానికి వచ్చిన వ్యాపారస్థులు, వాటిని కొనడానికి వచ్చిన జనులు, వీళ్లందరితో సందడిగా ఉంది.

ఏ వీథిలో చూచిన ఇదే పరిస్థితి. జనాలు నడవడం లేదు. పరిగెత్తుతున్నట్లుగా ఉంది. ఆడా, మగా, చిన్నా, పెద్దా తేడా లేదు. ఎవరికి వారే అన్నట్లుగా వేగంగా నడుస్తున్నారు. కాదు. కాదు. తీరికే లేనట్లు పరిగెత్తుతున్నారు. ఎందుకోసమో, ఎవరి కోసమో ఆ పరుగులు? ఎవరికి తెలుసు?

ఇంతవేగంగా, రద్దీగా ఉన్న ఆ నగరంలో ఒకచోట విచిత్రమైన ఒక దృశ్యం కంట పడింది.

ఐదుగురు మనుషులు వరుసగా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని నడుస్తున్నారు. గట్టిగా అరుస్తున్నారు. ఆ జనసమ్మర్థంలో రణగొణ చప్పుళ్లలో వారి గోడు సరిగా వినపడ్డం లేదు. వారి గోల కొంచెం కూడా అర్థం కావడమే లేదు.

ఆ దిక్కుగా వెళ్ళే జనం కొందరు వాళ్లని చూచి విసుక్కుంటున్నారు. కొందరేమో జాలి చూపిస్తున్నారు. కాని, వారికి దూరంగా పోతున్నారు. మరి కొందరు దయగలిగినవాళ్లు వాళ్ల చేతుల్లో చిల్లర డబ్బులు పడవేస్తున్నారు. ఇంకొందరు వాళ్ల ముఖాల్ని చూడటమే పాపం అనుకొంటూ ముఖం చిట్లించుకొంటూ అసహ్యించుకొంటున్నారు.

ఇంతమందిని అన్ని విధాలుగా ప్రవర్తింపజేసిన వాళ్లెవరు? గొలుసుకట్టుగా చేతుల్ని పట్టుకొని ఆ వ్యక్తులు వీథిలో ఎందుకు అరుస్తూ నడుస్తున్నారు? అంటే...

వాళ్లు ఐదుమంది బిచ్చగాళ్లు! విధి వక్రించి, విధిలేక ఒకరి మీద మరొకరు. ఇలా ఐదుమందీ ఆధారపడి బతుకుతున్న బిచ్చగాళ్లు. కాదు కాదు. దీనాతిదీనంగా బతు కీడుస్తున్న బిచ్చగాళ్లు!

వాళ్లలో ఒకడు పుట్టుకతో మూగవాడు. వాడికి మాటలే రావు. మరొకడు పుట్టుకతో చెవిటివాడు. మూడోవాడు మోచేతుల వరకు మాత్రమే ఉన్న మొండి చేతులవాడు, నాలుగోవాడు పుట్టు గుడ్డి, ఐదోవాడు ఒంటికాలు మాత్రమే ఉన్న కుంటివాడు, ఇదీ వారి పరిస్థితి.

వీళ్లు ఐదుగురూ ఒకరి చేతులు ఒకరు పట్టుకొన్నారు. వీథిలో నడుస్తూ అడుక్కుంటున్నారు. అడుక్కుంటూ నడుస్తున్నారు.



కళ్లే లేని కబోదిని బాబూ! అని ఒకడంటే, నడవలేని కుంటివాణ్ణి బాబయ్యా! అని మరొకడంటే "వా.. వా..." అంటూ నోరును కొట్టుకుంటూ నోట మాటరాని మూగవాణ్ణి అంటూ ఆక్రోసిస్తున్నాడు.

ఇలా ఐదు మంది తలోరకంగా ఒకేసారి అరుస్తూ అడుక్కుంటున్నారు. అరుపులతో కూడిన వాళ్ల యాచన ఆ దారిలో వెళ్ళే జనానికి కర్ణకఠోరంగా ఉంది.

కొందరు వాళ్లను జాలిగా చూసుకుంటూ పక్కకు తొలగి పోతున్నారు. కొందరు వాళ్ల అరుపులకు చిరాకు పడుతూ వాళ్లవైపు చూడకుండానే దూరదూరంగా వెళ్తున్నారు. కొందరు పుణ్యాత్ములు అయ్యో! పాపం! అనుకొంటూ తృణమో పణమో వాళ్ల చేతుల్లో వేస్తూ వెళ్ళిపోతున్నారు.

ఇంతలో వాళ్ల దగ్గరికి ఒక పుణ్యాత్ముడు వచ్చాడు. వాళ్ల చేతుల్లో కొంత పైకాన్ని వేస్తూ ఇలా అన్నాడు.

"ఒరే నాయనలారా! మీ జీవితాలు ఎప్పటికి తెమిలేను? మీ మీ సమస్యలు ఏనాటికి తీరేను? అనవసరంగా కర్ణకఠోరంగా గొంతులు చించుకొని అరుస్తున్నారు. హృదయవిదారకంగా ఉంది మీ పరిస్థితి. నేనొక మాట చెప్తా, వింటారా? జాగ్రత్తగా విని నా మాటను ఆచరించండి. తప్పక మీకు ఒక పరిష్కారం దొరకొచ్చు. మీ మీ జీవితాలు ఏ మాత్రం అనుమానం లేకుండా కుదుట పడతాయి తెలిసిందా?".

"అయ్యో! దరమ ప్రబువులు. సల్లంగ ఉండాల, మీరు సెప్పినట్టు సేత్తం. తొందరగా జెప్పండ్రి. మా పాణాల్ని కాపాడండి. మా జీవితాల్ని ఒడ్డు కీడ్చండి. మారాజా!" అంటూ చేతులెత్తి దండం పెడుతూ ప్రాధేయపడ్డారు.

"ఒరే! నాయనలారా! వెంటనే జనారణ్యం అయిన ఈ మహానగరాన్ని విడిచి దూరంగా వెళ్లండి. ఇక్కడి నుంచి ఉత్తరం దిక్కునకు ప్రయాణం

చెయ్యండి. అటు వైపున కొంతదూరం నడిస్తే, అద్భుతమైన మహిమలు ఉన్న ఒక కొండ చాల దూరా న్నుంచే మీకు కనిపిస్తుంది. కనపడిన వెంటనే ఆ కొండకు చేతులెత్తి దండం పెట్టుకోండి! ఆ కొండవైపు అడుగులు వెయ్యండి! ఇంక ఆలస్యం చెయ్యకండి. మీ మీ బతుకుల్ని బాగుపరచుకోండి. పోయి రాండి"– అంటూ మరికొంత చిల్లర దబ్బులు వాళ్లచేతుల్లో కుమ్మరించాడు.

వాళ్లు కృతజ్ఞతతో నిండిన చూపుల్తో ఆ పెద్దమనిషికి చేతులెత్తి దండం పెడుతూ ఆ నగరాన్ని విడిచి ఉత్తరం దిక్కుకు నడక సాగిస్తూ కొంతదూరం వెళ్లారు.

విచిత్రాతి విచిత్రం!

వాళ్లకు ఆ **మహిమల కొండ** చాలా దూరాన్నుంచే కనబడింది. ఆనందంతో చేతులెత్తి దండం పెట్టారు. అక్కడి నుంచి ఆ కొండవైపు ఆత్రంగా పట్టుమని పది అడుగులు వేశారు. అంతే!

ఆ కొండమీది చల్లని గాలి వీళ్లమీదికి వీచింది. ఇంకేముంది! పుట్టు మూగవాడికి మాట వచ్చింది. రావడమే కాదు. స్పష్టంగా శ్రీవేంకటేశుని మీద శ్లోకాన్ని చక్కగా చెబుతూ ఉన్నాడు. ఆ శ్లోకాన్ని పుట్టుచెవిటివాడు వింటూ ఆహా! అద్భుతం అంటున్నాడు. ఇక ఆ శ్లోకాన్ని మొండి చేతులవాడు శ్రద్ధగా ముత్యాల మాదిరిగా గుండ్రంగా రాస్తూ ఉండగా, పుట్టు గుడ్డివాడు, దాన్ని చూస్తూ అద్భుతం, ఎంతబాగా రాస్తున్నావయ్యా అంటున్నాడు. ఇంతలో కుంటివాడికి కాళ్లు వచ్చి, అవలీలగా ఆ మహిమలకొండ వైపు పరిగెత్తాడట ఎక్కడానికి.

ఇలా మహిమల కొండమీది గాలి సోకంగానే బాగుపడ్డ ఐదుమంది ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆ కొండను ఎక్కడానికి ప్రారంభించారు.

ఇంతలో అక్కడి ఒక యువతి సంకలో చంటిబిడ్డతో వచ్చింది. 'ఎవరమ్మా? ఎక్కడి నుంచి వచ్చావమ్మా' అని వాళ్లు అడిగారు.





"అన్నలారా! నేను పుట్టు వంధ్యను, అంటే ఈ జన్మలో ఇక పిల్లలే పుట్టరని వైద్యులు తేల్చి చెప్పిన పుట్టు గొడ్రాలిని. కాని, ఒక పుణ్యాత్ముడు నాకు చెప్పాడు. బాధపడవద్దు. అక్కడ ఒక **"మహిమల కొండ"** ఉంది. ఆ కొండపైన కోరిన వారికి కోరినట్లుగా వరాలనిచ్చే కొండంతటి దేవుడు ఉన్నాడు. నీకు సంతానాన్ని ప్రసాదిస్తాడు. బిడ్డతో కొండకు వస్తానని మొక్కుకొమ్మన్నాడు. అంతే! నా వంధ్యాత్వం పోగొట్టిన ఆ స్వామికి, ఇదిగో! నా బిడ్డను ఎప్పు డెప్పుడా చూపించేది అని పరుగులు పెడుతూ వస్తున్నాను" అని చెప్పింది.

పరస్పరం ఆ కొండ మహిమలను విని, ఆశ్చర్యంతో ఇక కొండమీది దేవుడు ఇంకెంత గొప్ప మహిమలను కలిగి ఉన్నాడో కదా! వెంటనే దర్శించాలన్న ఆత్రుతతో గోవిందా...! గోవిందా.....!! అంటూ అందరూ తిరుమల కొండను ఎక్కడం ప్రారంభించారు.

ఇలాంటి 'తిరుమలకొండ' మహిమలను, శ్రీవేంకటేశ్వరుని లీలలను తెలియ జేసే యథార్థమైన ఈ దివ్యగాథను 16 వ శతాబ్దంలో దక్షిణ దేశాన ఉండిన **"వేంకటాధ్వరి"** అనే మహాకవి తన శ్లోకంలో ఇలా అక్షర నిక్షిప్తం చేశాడు.

**శ్లో॥ మూకారబ్ధం కమపి బధిరాః శ్లోక మాకర్ణయంతి,**
**శ్రద్ధాళుస్తం, విలిఖతి కుణి, శ్లాఘయా వీక్షతేంధః**
**అధ్యారోహత్యహహ! సహసా పంగు రప్యద్రి శృంగం**
**సాంద్రాలస్యా శిశుభరణతో మంద మాయాతి వంధ్యా.**

**– వేంకటాధ్వరి (విశ్వగుణాదర్శం – చంపూకావ్యం)**

**ఓం నమో వేంకటేశాయ!**

# 12. తెప్పలపై కోనేటిరాయుడు

అది అద్భుతమైన కొండ! ఆ కొండల్లో అణువణువునా ఆనందమే! అడుగడుగునా ఆనందమే! అందుకే దాన్ని **'ఆనందాచలం'** అన్నారు. అది ఏడుకొండల సమాహారం! ఆ కొండల మధ్య భాగాన ఒక దివ్యమైన భవ్యమైన బంగారు భవనం ఉంది. దాన్ని **"ఆనంద నిలయం"** అంటారు. ఆ భవనం మధ్యభాగాన "వరాలరాయుడు" అని పేరు పొందిన దేవుడు వేంకటేశ్వరుడు ఉన్నాడు. తన బంగారు భవనం వాకిట్లో కాలుపెట్టిన భక్తులను చూస్తే చాలు! ఆ స్వామికి ఎక్కడలేని పరమానందం! ఏ మాత్రం చెరగని, తరగని చిన్మయహాసంతో ఆహ్వానిస్తాడు. ఆదరిస్తాడు. తన దగ్గరికి వచ్చిన ప్రతి భక్తుడికి ఆనందాన్ని ప్రసాదించడమే ఆయన తత్త్వం. ఆ దేవుడు నిలువెత్తుగా రూపెత్తిన ఆనందమయం! అందుకే ఆయన పంచే ఆనందాల్ని జుర్రుకోడానికే నిత్యం భక్తులు ఆనందనిలయం చుట్టూరా మూగుతారు. ఆ కొండలరాయడికి చేసే అలంకారాల్లో, ఆరగింపుల్లో, ఉత్సవాల్లో, ఊరేగింపుల్లో ఎప్పటికప్పుడు భక్తులు కొత్త కొత్త అందాల్ని కొత్త కొత్త ఆనందాల్ని కొత్త కొత్త రుచుల్ని అనుభవిస్తూనే ఉంటారు.

అలాంటి వాటిల్లో ఏడేడు జన్మల పాపాలను పోగొడుతున్న దివ్యమైన భవ్యమైన ఆనందోత్సవాలు **"కొండలరాయడి కోనేటి తెప్ప తిరునాళ్లు"**. ఇవి ఏడాదిలో ఒక్కమారు జరిగినా ఎన్నెన్నో యుగాల్లో జరిగిన తెప్పల తిరునాళ్ల సంరంభాల్ని దర్శింపజేస్తాయి, ఈ తిరుమలేశుడి తెప్ప తిరునాళ్లు!

ఆనందలోకం వైకుంఠంలో పాలసముద్రంపైన వేయిపడగల పెద్ద పాముతెప్పపై నిరంతరం తేలుతూనే ఉంటాడట.

జలప్రళయకాలంలో మరో వింత తెప్పపై తేలి యాడుతూ ఉంటాడట తిరుమలపై ఉన్న వింతశిశువు! అదే **మర్రాకు తెప్ప!**



మరొకప్పుడు ఏకంగా కూర్మావతారం (తాబేలు) ఎత్తి మంధరపర్వతాన్ని పెద్ద తెప్పగా తేలించాడట స్వామి!

ఇంకొకప్పుడు యమునానది నల్లనినీళ్లలో కాళింగుని పడగల తెప్పపై నల్లని కన్నయ్యగా చిందులేస్తూ అందరికీ ఆనందాన్ని కల్గించాడట!

మరి అన్ని యుగాలనాటి తెప్పతిరునాళ్లను చూడ గలమా! అది సాధ్యమయ్యే పనేనా! అని నిరుత్సాహపడడం చాల పెద్ద పొరపాటే అవుతుంది. ఎందుకంటే ఆనాటి తెప్పల తిరునాళ్లను ఇప్పుడు దర్శించడానికి తిరుమల క్షేత్రానికి పరుగులు పెడితే చాలు! కన్నులనిండా దర్శించవచ్చు! మనసుల నిండా ఆ ఆనందాల్ని జుర్రుకోవచ్చు.

శీతాకాలం చల్లదనం తగ్గుతూ, వేసవికాలం వెచ్చదనం ప్రారంభం అవుతున్న సంధికాలంలో ఫాల్గుణమాసం పున్నమినాటి రాత్రిపూట వెన్నెల సోయగాల్లో, సొంపుగా స్వామిపుష్కరిణీ జలాల్లో వేంకటేశ్వరుడికి జరిగే జలవిహారోత్సవాలు కన్నులతో, కన్నునిండా చూచి తీరవలసిందే! మనసుల నిండా మైమరచి ఆస్వాదించవలసిందే. ఆ అనుభవం, ఆ అనుభూతి ఎవరికి వారు పొందాల్సిందే! మాటల్లో చెప్పడం వీలు కానే కాదు. అయినా కొంతవరకైనా తెలుసుకుందాం.

తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి అత్యంత ప్రాచీన కాలం నుండే తెప్పోత్సవాలు జరిగేవి. ఈ ఉత్సవాల కొరకే క్రీ.శ. 1468లో పుష్కరిణి మధ్యలో, సాళువ నరసింహ రాయలు ఒక మండపాన్ని నిర్మించాడు. దీనినే **'నీరాళి మండపం'** అంటారు. ఆ సమయంలో ఈ మండపంలో కొలువై ఉన్న స్వామివారికి నివేదనల కట్టడి ఏర్పాటు చేశాడట! అప్పట్లో ఈ తెప్పోత్సవాలు సంక్రాంతి పండుగ మరుసటి రోజున, బ్రహ్మోత్సవాల్లోను, ఇంకా ఆ యా సందర్భాల్లో జరుపబడేవని తెలుస్తున్నది.

క్రీ.శ. 15 వ శతాబ్దానికి చెందిన అన్నమయ్య తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించాడు.

**లలిత**

**ఎందు నీకుఁ బ్రియమో యీ తెప్ప తిరునాళ్లు**
**దిందువడె సిరులతో తెప్ప తిరుణాళ్లు**

ఇంకోచోట తిరుమలేశుని తెప్పతిరునాళ్లతో దర్శనమిచ్చే శ్రీస్వామి పుష్కరిణిని –

**దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ**
**వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా ॥**

**ధర్మార్థకామ మోక్షతతులు నీ సోపానాలు**
**అర్మిలి నాలుగువేదా లదె నీ దరులు**
**నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు**
**కూర్మము నీ లోఁతు వో కోనేరమ్మా ॥**

**తగిన గంగాది తీర్థములు నీ కడళ్లు**
**జగతి దేవతలు నీ జలజంతులు**
**గగనపు బుణ్యలోకాలు నీ దరి మేడలు**
**మొగి నీ చుట్టు మాకులు మును లోయమ్మా!!**

**వైకుంఠనగరము వాకిలే నీ యాకారము**
**చేకొను పుణ్యములే నీ జీవభావము**
**యేకడను శ్రీవేంకటేశుడే నీ వునికి**
**దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా!!!**

అంటూ అన్నమాచార్యులు కీర్తిస్తాడు.

ఇలా చాలాకాలంనుంచి జరుగుతున్న తెప్పోత్సవాలు ఏ కారణం చేతో మధ్యలో ఆగిపోయాయి. మళ్లీ మహంతు ప్రయాగదాసు, తిరుమల తెప్పోత్సవాలను ఉద్ధరించి, దుర్మతినామసంవత్సర (1921) ఫాల్గుణ శుద్ధ



ఏకాదశి నుంచి 5 రోజులపాటు జరిగేటట్లుగా ఏర్పాటు చేశాడు. మళ్లీ ఆనాటినుండి నిరాఘాటంగా తెప్పోత్సవాలు సాగిపోతున్నాయి.

ప్రస్తుతం ప్రతిసంవత్సరం ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశి నుండి పూర్ణిమ వరకు ఐదు రోజులపాటు తెప్పోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇవి సాధారణంగా మార్చి–ఏప్రిల్ నెలల్లో జరుగుతాయి.

ఐదురోజులపాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటి (ఏకాదశి) రోజు సాయంకాలం 6 గంటలకు తిరుమల కోనేట్లో తెప్పలో విహరించుటకు శ్రీ సీతారామలక్ష్మణులు ఆలయం నుండి ఛత్రచామరమర్యాదలతో బయలు వెడలి, ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో ఊరేగుతూ, చివరకు కోనేటి దరిని చేరుకొని తెప్పను అధిరోహిస్తారు. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల కాంతిలో, వేదనాదాల మధ్య, మంగళవాయిద్యాలు మోగుతుండగా, అన్నమయ్య కీర్తనల్ని వింటూ, శ్రీసీతారామలక్ష్మణులు సర్వశోభాయ మానంగా తీర్చిదిద్ది అలంకరించిన తెప్పలో మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు. నాలుగువైపులా కోనేటి తీరాన మెట్లపై వేలాదిమంది భక్తజనం శ్రీస్వామివారలను కన్నులారా తిలకించి పులకిస్తారు.

మొదటిరోజు మూడు ప్రదక్షిణలు అయినవెంటనే నివేదన కర్పూర హారతి జరిగిన తర్వాత ఆర్జితసేవా భక్తులకు వస్త్ర బహుమానం జరుగుతుంది. ఆ తర్వాత శ్రీ సీతారామ లక్ష్మణులు పల్లకి నెక్కి ఛత్రచామర మర్యాదలతో ఆలయ ప్రవేశం చెయ్యడంతో మొదటిరోజు తెప్పోత్సవం ముగుస్తుంది.

ఇక రెండవరోజు ద్వాదశిరోజున శ్రీ రుక్మిణీకృష్ణులు పురవీథుల్లో ప్రదక్షిణంగా ఊరేగుతూ వచ్చి, స్వామిపుష్కరిణి లోని తెప్పనధిరోహించి మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు. ఆ తర్వాత నివేదనలు, హారతి అనంతరం శ్రీరుక్మిణీ కృష్ణులు ఆలయప్రవేశం చేస్తారు.

ఇక మూడవ రోజు త్రయోదశినాడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుచ్చినెక్కి సర్వాభరణ భూషితుడై ఛత్రచామరమర్యాద పురస్సరంగా పురవీథుల్లో ఊరేగుతూ కోనేటికి వచ్చి తెప్పలో ఆసీనులై వేదగానాల మధ్య భాజాభజంత్రీలు మోగుతుండగా, బాణసంచా కాలుస్తుండగా అశేషభక్తజనాన్ని ఆనందింపజేస్తూ మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు. చివర నైవేద్య హారతులు ఇస్తారు. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామివారు ఉభయదేవేరులతో ఆలయాన్ని చేరుకుంటారు.

ఇలాగే నాలుగవరోజు శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీవేంకటేశ్వర స్వామివారు ఐదు ప్రదక్షిణాలున్ను, ఐదవ రోజు 7 మార్లు తెప్పలో విహరిస్తారు.


ఇక్కడో మాట!

సాక్షాత్తు శ్రీవైకుంఠం నుండి వచ్చిన శ్రీవారి క్రీడావాపి అయిన స్వామి పుష్కరిణిలో ప్రధానంగా అన్ని దిక్కుల్లో తొమ్మిది తీర్థాలున్నాయి. స్మరణంతో, స్పర్శనంతో, స్నానంతో భక్తుల పాపాలు పోగొడుతున్న **"సకల పాపహారిణి" అయిన శ్రీ స్వామి పుష్కరిణిలో** జరుగుతున్న భక్తప్రియుడు, కొండంత దయగల దేవుడు **"కొండలరాయడి కోనేటి తిరునాళ్ల"**ను – కన్నులారా దర్శించుదాం. అగాధమైన సంసారసాగరంలో మన జీవిత నౌకలు తేలుతూ తరించేట్లుగా ప్రార్థించుదాం. తరియించుదాం.

**" శ్రీవైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ "**

**ఓం నమో వేంకటేశాయ!**

# 13. సప్తగిరులలో సూర్యజయంతి



**సు**సంపన్నమైన ఆధ్యాత్మిక దివ్యక్షేత్రం ఆనందాచలం! అదే వేంకటాద్రి! ఆ పుణ్యధామంలో ఆద్యంతాలు లేని ఒక ఆధ్యాత్మికశక్తి ఒక్కచోటనే కేంద్రీకృతమై రూపుదాల్చింది. అది వేదాంత వేత్తలు వెదికేటి రూపం! పొందుగ పరమయోగులు భావించేటి రూపం! బ్రహ్మాదులకు అదిమూలమైన రూపం! అది అణురేణు పరిపూర్ణమైన రూపం! ఆ రూపం కొలిచినవారి పాలి కొంగుబంగారం! అదే అదే వేంకటాద్రిపై కోనేటిదరిన నెలకొన్న ఆనందరూపం!

అలాంటి అద్భుతమైన దివ్యరూపం వెలసిన సప్తగిరులను స్మరిస్తే చాలు! సంచిత కర్మలు అన్నీ నశిస్తాయి. ఆ సప్తగిరుల్లో సంచరిస్తే చాలు! సకలపాపాలు పోతాయి. ఇక ఆ సప్తగిరీశుణ్ణి కన్నులనిండా సందర్శిస్తే చాలు! ఇహమూ, పరమూ రెండూ ఇట్టే సిద్ధిస్తాయి.

అందులోను నవగ్రహాధిపతి అయిన శ్రీ సూర్యభగవానుని జయంతి **"రథసప్తమి"** పండుగనాడు సప్తగిరీశుణ్ణి కన్నులారా దర్శించే ప్రాప్తం పొందిన భక్తులు పొందే భాగ్యాన్నిగూర్చి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

## సూర్యజయంతే "రథ సప్తమి"

సమస్త లోకాలకు వెలుగులనిస్తూ, సకల చరాచరాలకు చైతన్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష భగవానుడు శ్రీసూర్యనారాయణుడు! ఆ స్వామి ఆవిర్భవించిన మాఘ శుద్ధసప్తమి రోజును 'సూర్యజయంతి' అనీ, 'రథసప్తమి' అనీ పండుగగా జరపడం సంప్రదాయం.

## తిరుమలలో "రథసప్తమి"

కలియుగ వైకుంఠమయిన తిరుమలలో కూడ శ్రీసూర్యభగవానుని జయంతి **"రథసప్తమి"** రోజున విశేషంగా ఉత్సవాలు జరుగుతాయి.

ఆనాడు సూర్యోదయం మొదలుకొని రాత్రి చంద్రోదయం వరకు ఏడువాహనాల్లో తిరుమలేశుడు పాల్గొని కనువిందు చేస్తాడు.

ఆ రోజు జరిగే అన్ని వాహనసేవల్లోను, ఊరేగింపుల్లోను సప్తగిరీశుడు పాల్గొంటాడు. కాని ఒక్కొక్క వాహనంపైన ఆ మలయప్పస్వామి వారి వైభవం మనోహరం! ఒక్కొక్క వాహనంలోని శ్రీవారి రూపం నయనానందకరం! ఒక్కొక్క వాహనంలో ఒక్కొక్క అలంకారంలో భాసించే బ్రహ్మాండనాయకుని దివ్యమంగళరూపం అత్యంత అద్భుతం! ఒక్కొక్క వాహనంలో ఒక్కొక్క అలంకారం! ఎన్నెన్ని ఆభరణాలు! ఎన్నెన్ని నగలు! మరెన్నెన్ని పుష్పమాలలో! ఇంకెన్నెన్ని సుగంధ భరితమైన రంగురంగుల పూలదండలో! ఏ ఉత్సవవైభవం దానిదే! దేని ప్రత్యేకత దానిదే! వాటిని దర్శించిన భక్తులు ఎవరి అనుభూతులు వారివే!

## ఏడుకొండలవాడి ఏడు వాహనాలు

**'రథసప్తమి'**నాడు తిరుమల శ్రీవారు ఉదయంనుంచి రాత్రి వరకు ఏడువాహనాల్లో ఊరేగడమేగాక, మధ్యాహ్నం కోనేట్లో **"చక్రస్నానం"** జరుగుతోంది, అందువల్లే ఒకేరోజు జరిగే 'బ్రహ్మోత్సవం' అంటారు. మామూలుగా పదినాళ్ళపాటు జరిగే బ్రహ్మోత్సవంలో పాల్గొనని భక్తులు, 'రథసప్తమి'నాటి ఉత్సవాలను దర్శిస్తే చాలు. బ్రహ్మోత్సవాలను పూర్తిగా దర్శించిన ఫలితం వస్తుందని పెద్దల మాట! ప్రత్యేకంగా **'రథసప్తమి'** పండుగ రోజున శ్రీస్వామివారి ఉత్సవవైభవాన్ని దర్శించినట్లైతే నవగ్రహ దోషాలతో పాటు, అనేక ఇతర దోషాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయి.



## సూర్యప్రభవాహనం

తిరుమలలో రథసప్తమినాడు మొట్టమొదట జరిగే **'సూర్యప్రభ'** వాహనంలో గమనించవలసిన ఒక ప్రత్యేకత ఉంది.

సప్తాశ్వాలు పూన్చిన బంగారు సూర్యప్రభ వాహనంపైన శంఖచక్ర గదానందక శార్ఙ్గ పంచాయుధాలను ధరించి వజ్రకిరీటాది వజ్రాలు పొదిగిన హారాలతో, పూలహారాలతో అలంకరింపబడిన శ్రీమలయప్పస్వామి వారు సూర్యోదయానికి ముందుగా ఆలయంనుంచి మహాప్రదక్షిణ మార్గంలో గజ, తురుగ, వృషభ భక్త బృందాలతో, కోలాహలంగా భజన బృందాలతో భక్తుల గోవిందనామ ఘోషలతో ఊరేగింపుగా బయలుదేరి **"వాయవ్య మూలన"** ప్రత్యేకంగా శోభయమానంగా తీర్చిదిద్ది ఏర్పాటు చేసిన **"వేదిక"** కిందకు వచ్చి సూర్యోదయానికి ముందుగానే నిలిచివుంటారు.

ఆ సూర్యోదయవేళలో సప్తాశ్వాలు పూన్చిన బంగారు సూర్యప్రభ వాహనంపైన వున్న శ్రీవేంకటేశ్వరస్వామివారిని, ఎదురుగా ఉదయిస్తున్న శ్రీసూర్య భగవానుడు ప్రత్యక్షంగా తన అరుణ కిరణాలతో పాదాలనుంచి కిరీటంవరకు అర్చిస్తుండగా, అర్చకస్వాములు బంగారుపళ్లెంలో ఫలాల నివేదనలతో దివ్యమంగళ కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు.

బంగారు సూర్యప్రభవాహనంలో, ప్రత్యక్ష సూర్యకిరణాల వెలుగులతో శోభాయమానంగా దర్శనమిస్తున్న రథసప్తమి నాటి సప్తగిరీశుని దర్శనమే దర్శనం! ఈ దర్శనం చేసికొన్న భక్తులకు

సూర్యగ్రహ దోషాలతోపాటు, నవగ్రహ దోషాలు అన్నీ తొలగి ఆరోగ్యం కలుగుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

ఆ తర్వాత సూర్యప్రభవాహనం వాహనమండపం చేరుకొంటుంది.

**చిన్న శేషవాహనం**

ఆ తర్వాత మలయప్పస్వామివారు మాత్రమే ఐదు పడిగలువున్న వెండి చిన్న శేషవాహనంలో ఊరేగుతూ దర్శనమిస్తారు. చిన్న శేషవాహనంలోని శ్రీవారిని దర్శిస్తే చాలు! నాగదోషాలు పరిహారమవుతాయి. వివాహం, సంతానం మొదలైన కోరికలు సిద్ధిస్తాయి.

**గరుడ వాహనం**

రథసప్తమినాటి మూడవ వాహనోత్సవం గరుడోత్సవం బంగారు గరుడనిపై శ్రీ మలయప్పస్వామివారు బంగారు హారాలతో, వజ్రకిరీటాది శంఖుచక్రాలతో, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరింపబడి పురవీధుల్లో విహరిస్తూ అలరిస్తాడు. ఈ నాటి గరుడవాహనోత్సవ దర్శనంతో కష్టాలు తొలుగుతాయి. జీవితంలో అభివృద్ధి జరుగుతుంది. సంతానం కలుగుతుంది.

**హనుమద్వాహనం**

ఆ తర్వాత బంగారు హనుమంతునిపై శ్రీనివాసుడు కోదండ దనుర్బాణాలను ధరించి వేంకటాద్రిరామునిగా దర్శనమిస్తాడు. ఈ వాహన దర్శనంతో లౌకిక కోరికలు తీరడమేగాక మోక్షం కలుగుతుంది. ప్రత్యేకంగా శనిగ్రహదోషాలు వున్నవాళ్లు హనుమద్వాహన సేవను దర్శించుకుంటే మంచిది.

**చక్రస్నానం**

తర్వాత మధ్యాహ్నవేళలో శ్రీసుదర్శన భగవానునికి శ్రీస్వామి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. ఇది వాహన సేవ కాదు. కాని



చక్రస్నానంతో పాటు కోనేట్లో స్నానం చేసినట్లైతే శత్రునాశనం కలుగుతుంది. భయం పోతుంది. ధైర్యసాహసాలు సిద్ధిస్తాయి.

**కల్పవృక్ష వాహనం**

**'రథసప్తమి'**నాటి ఐదవ వాహనం బంగారు **కల్పవృక్షవాహనం**. కల్పవృక్షవాహనంలో శ్రీదేవిభూదేవులతోవున్న శ్రీమలయప్పస్వామిని దర్శిస్తే చాలు. కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయి. ఈ కొండలరాయడు పారిజాత వృక్షమనీ, కాచే చింతామణి అనీ, కోరికలిచ్చే కామధేనువు అనీ అన్నమాచార్యులు కూడ వర్ణించాడు.

**సర్వభూపాలవాహనం**

ఆరవవాహనం సర్వభూపాల వాహనం. ఈ వాహనంలో ఉభయ దేవేరులతో కొలువై దర్శనమిస్తున్న కొండలరాయుణ్ణి దర్శించినట్లయితే, అడిగిన వరాలన్నింటినీ ఇస్తాడట! ఈ వాహనాన్ని సర్వలోకాల్లోని చక్రవర్తులు మోస్తుంటారు. మహాదర్పంగా వుండే బంగారు సర్వభూపాల వాహనదర్శనం. సర్వశ్రేయోదాయకం.

**చంద్రప్రభవాహనం**

రథసప్తమినాటి రాత్రి చంద్రోదయ వేళ **చంద్రవాహనంపై** ఊరేగుతూ శ్రీస్వామివారి దర్శనం ఆహ్లాదకరం! చంద్రుడు మనస్సుకు అధిపతి! కనుక ఈ వాహన దర్శనం మనశ్శాంతికరం! ఆనందప్రదం!

ఇలా నవగ్రహాలకు అధిపతి అయిన సూర్యుని జయంతినాడు, సప్తగిరుల్లో సంచరించడం, సప్తగిరీశుణ్ణి దర్శించడం అనంతఫలప్రదం! అనంత ఐశ్వర్యప్రదం! సర్వార్థసిద్ధి ప్రదం!

**ఓం బ్రహ్మోత్సవ మహోత్సుకాయ నమః**

# 14. పదినాళ్లూ పండుగలే!

**"కలడా ఇంతటి దాత కమలనాభుడే కాక**
**కలడన్న వారిపాల కలిగిన దైవము"**

**- తాళ్లపాక అన్నమయ్య**

సుసంపన్నమైన ఆధ్యాత్మిక ప్రపంచంలో సుందరాంధ్ర భూమికి ఒక ప్రత్యేక స్థానముంది. బహుశా ఆంధ్రదేశంలో నెలకొన్న వేంకటాద్రి (తిరుమల) క్షేత్రం - ఆ క్షేత్రంపై అనాదిగ కేంద్రికృతమై వున్న "దివ్యతేజోరాశి" అందుకు కారణం కావచ్చు. ఆ "దివ్య తేజోరాశి" ఎలాంటిది? ఎలాటిదంటే అది తెలుగునేల నేలినట్టి కులదైవం! పెద్ద లిచ్చిన నిధానం! దప్పితీర్చే కాలమేఘం! అందరికి కైవసమైన పారిజతం! కాచునట్టి చింతామణి! కోరికలు తీర్చే కామధేనువు! చెడనీక బ్రదికించే సిద్ధమంత్రం! రోగాలను అణచి రక్షించే దివ్య ఔషధం! పాయక వెంట తిరిగే ప్రాణబంధువు! ఇలా పరోపకారం చేస్తున్న ఈ అద్భుతమైన తేజస్సే వేంకటాద్రిపై కోనేటి దరిన వేంకటేశ్వరస్వామి పేరుతో వెలుగొందు తున్నది. అందుకే

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి.**

బ్రహ్మాండంలో వేంకటాచలానికి సమానమైన పుణ్యక్షేత్రం లేనే లేదనీ, ఆ కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామికి సాటి రాగల దేవుడు ఇటు భూతకాలంలోను లేడు, అటు భవిష్యత్తులోను ఉండబోడు అని కీర్తింపబడింది.

ఈ పవిత్రక్షేత్రంలో **అంజానాద్రి, వృషభాద్రి, నీలాద్రి, శేషాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి** అను ఏడుకొండలు నెలకొని



వున్నాయి. అందుకే ఈ స్వామికి "ఏడుకొండలవాడనీ" "సప్తగిరీశుడ"ని ప్రసిద్ధి ఏర్పడింది.

ఈ ఏడుకొండల్లో శ్రీ స్వామిపుష్కరిణి, ఆకాశగంగ, చక్రతీర్థం, పాపవినాశనతీర్థం, గోగర్భతీర్థం, తుంబురుతీర్థం, కుమారధారాతీర్థం, రామకృష్ణతీర్థం... ఇత్యాది 365 పవిత్ర తీర్థాలున్నాయి.

ప్రతిరోజు సుప్రభాతం మొదలుకొని ఏకాంతసేవ వరకు నిత్యోత్సవాలలోను, అష్టదళ పద్మారాధన, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ, సహస్రదీపాలంకారసేవ వంటి వారోత్సవాల్లోను, పుష్పయాగం, పవిత్రోత్సవం, రథసప్తమి అని అంగరంగ వైభవంగా వెలుగుతూ భక్తకోటికి కొంగుబంగారమై ఆర్తత్రాణ పరాయణుడై దర్శనమిస్తున్నాడు. అందుకే కలియుగ వైకుంఠమైన తిరుమల నిత్యకల్యాణం పచ్చతోరణమని వేనోళ్ళ కొనియాడబడింది. అది ముమ్మాటికి సత్యమైనమాట. ఇలాగ శ్రీస్వామివారి ఉత్సవాలను దర్శించి తరించడానికి నిత్యమూ వేలాది భక్తజనం తిరుమలకు వస్తుంటారు. అయితే సంవత్సరాదినుంచి సంవత్సరాంతం వరకు జరిగే అనేక ఉత్సవాల్లో తిరువేంకటగిరి దేవునికి ఏడాది కొకమారు జరిగే **"బ్రహ్మోత్సవాలు"** పదినాళ్ళ పండుగలుగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తిరుమల శ్రీనివాసునికి ప్రతి ఏటా ఆశ్వయుజ శుద్ధపాడ్యమి నుండి దశమి వరకు పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుపబడుతున్నాయి. ఇలాగ ఒకేమారు రెండు బ్రహ్మోత్సవాలు జరిగినపుడు భాద్రపద మాసంలో జరిగే మొదటి ఉత్సవాన్ని వార్షిక బ్రహ్మోత్సవమనీ, ఆశ్వయుజమాసంలో జరిగే రెండవ బ్రహ్మోత్సవాన్ని నవరాత్రి బ్రహ్మోత్సమనీ అంటారు.

ఈ ఉత్సవాలు మొట్ట మొదట సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు తిరుమల శ్రీవారికి నిర్వహించాడట! అందువలననే వీటికి బ్రహ్మోత్సవాలని ప్రసిద్ధి కలిగినట్లు వేంకటాచలమాహాత్మ్యంలో పేర్కొనబడింది.

ఈసారి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పదిరోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

మొదటిరోజు సాయంత్రం అంకురార్పణం, సేనాధిపతి ఉత్సవం జరుగుతవి.

రెండవనాడు సాయంత్రం ధ్వజారోహణం రోజు శాస్త్రోక్త రీతిలో కంకణధారణ, దేవతలకు ఆహ్వానంచేసి ధ్వజస్తంభంపై గరుడకేతనాన్ని ఎగురవేస్తారు. ఈ గరుడకేతనం ఎగురవేయడం కన్నులపండువుగా సాగుతుంది. ఆ సమయంలో పెసరపులగ ప్రసాదం నివేదించబడుతుంది. ఈ ప్రసాదం స్వీకరిస్తే సంతానం కోరే స్త్రీలు సంతానవతులవుతారు. పిదప తిరుమలరాయమండపంలో సర్వాభరణాలతో పుష్పాలతో అలంకృతులైన శ్రీవారిని ఉభయ దేవేరులతో వేంచేపు చేసి ఆస్థానం జరుపుతారు.

ఇక ఆ రాత్రి నుంచి 9 రోజులపాటు ఉదయం, సాయంత్రం **పెదశేషవాహనం, చిన శేషవాహనం, హంస వాహనం, సింహవాహనం, ముత్యపుపందిరి వాహనం, కల్పవృక్షవాహనం** ఇలా వాహనాలపై తిరుమల పురవీధులలో శ్రీ స్వామివారు ఊరేగింపబడతారు.

ఈ పదినాళ్ళలో ఐదవరోజు రాత్రి జరిగే **బంగారు గరుడోత్సవం** ప్రాధాన్యత ఇంతింతని వర్ణింప వీలులేనిది. ఆనాడు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు అలంకరించే మకరకంఠి లక్ష్మీహారాది విశిష్టాభరణాలు శ్రీవారి ఉత్సవమూర్తికి అలంకరిస్తారు. అంతేగాక తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవికి అలంకరింపజేసిన పూలమాల నియమం ప్రకారం ఆ రోజుకు తీసుకరాగా, దానిని శ్రీవారికి ధరింపజేస్తారు. మద్రాసునుంచి మిరాశిదార్లు కాలినడకన కొత్త గొడుగులను తెస్తారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఆ గొడుగులను ధరించి బంగారు గరుడునిపై వేంచేసి పురవీధులలో అశేష భక్తజన ప్రవాహం మధ్య ఊరేగుతారు. అదేరోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఆ వస్త్రాలను కూడ స్వామివారికి ధరింప చేస్తారు. (ప్రస్తుతం ధ్వజారోహణనాడే వస్త్రాలు సమర్పింపబడుతున్నవి.)



ఇక శ్రీవారి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవనాడు ఉదయం జరిగే రథోత్సవం అత్యంత విశిష్టమైంది. తిరుమల కోనేటి రాయనికి జరిగే ఉత్సవాలలో అన్నిటికంటె వైభవంగా ఉంటుంది. రథం పగ్గాలు లాగుతూ గోవిందలు పెడ్తూ ఈ రథోత్సవంలో స్వయంగా పాలుపంచుకునే భక్తుల ఆనందసందోహం వర్ణనాతీతం.

ఈ పదినాళ్ల పండుగ దినాల్లో ఐదవనాటి రాత్రి జరిగే బంగారు గరుడోత్సవం, తొమ్మిదవనాటి ఉదయం జరిగే రథోత్సవం అత్యంత దర్శనీయమై దివ్యసుందరమై సాక్షాత్తు వైకుంఠాన్ని దర్శింప జేసే విశేషోత్సవాలుగా ప్రసిద్ధిని పొంది వున్నాయి. ఈ గరుడోత్సవ, రథోత్సవ దినాల్లో లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

ఆ మరురోజు పదవరోజు శ్రీవరాహస్వామి పుష్కరిణిలో శ్రీవారి చక్రస్నానం జరుపబడుతుంది. ఆ రాత్రి ధ్వజావరోహణంతో పదినాళ్ళ పండుగలు వైభవంగా ఘనంగా సమాప్తమవుతవి.

ఈ పండుగ దినాలలో భక్తులు ''గోవిందా గోవిందా! ఏడుకొండలవాడా! గోవిందా'' అంటూ గోవిందలు పెడుతూ కొండలెక్కుతారు. వీరి గోవింద నామోచ్చారణలతో తిరుమల కొండలు కోనలు ప్రతిధ్వనిస్తాయి. ఒకవైపు

**"కొండా చూతము రారో! కొండుక తిరుమల కొండా**
**కొండని యడిగిన వరము లొసగు మా తిమ్మయకొండా"**

అని ప్రబోధించే వాగ్గేయకారుల పాటలహోరు... మరోవైపు

**"శరణు శరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీసతి వల్లభా!**
**శరణు రాక్షస గర్వసంహర శరణు వేంకట నాయకా"**

అని భజనలు చేస్తూ భక్తితో చిందులేస్తూ వచ్చే భక్తబృందాల జోరు... ఇంకోవైపు తిరుమల శ్రీవారి ఆనందనిలయం నుండి శ్రుతి కింపుగా ఆనందంగా వినపడే వేదాల నాదాలు... ఇటువైపు హరికథలు బుర్రకథలు... సంగీత కచ్చేరీలు... అటు వైపు "భక్తులారా! శ్రీ వేంకటేశుని మించిన ఆత్మబంధువు లేడు! ఆకటివేళలలో అలసిన వేళలలో కొరమాలివున్న వేళలలో, కులము చెడిన వేళలలో వరులచే చిక్కి చెరసాలలో వున్న వేళలలో శ్రీ వేంకటేశు నామమొకటే గతి! ఆపద వచ్చిన వేళ, ఆరడిబడిన వేళ, భయపడినవేళ శ్రీ తిరుమలప్పని నామ సంకీర్తన వీడక చెయ్యండి. సంకెళ్ల బెట్టిన వేళ, చంప బిలిచిన వేళ, అప్పుల వారారడి బెట్టిన వేళల్లో కోనేటిరాయని పేరును కొసరి కొసరి తలవండి!" అన్న పురాణ ప్రబోధాలతో, ధార్మిక ప్రసంగాలతో... ఇలాగ ఇటు అటూ, ఎటు చూచినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని తిరుమలకొండ కోటి దివ్యకాంతులతో ప్రకాశిస్తుంది.

ఇలాగ ఈ పది దినాల పండుగల్లో ఏడుకొండలవానిని తనివితీరా దర్శించుకొన్న భక్తజనం తమ జీవితంలో ఆ దినాలను అత్యంత పదిలమైన మధుర క్షణాలుగా భావిస్తూ ఆనందంతో శ్రీస్వామివారి అనుగ్రహ ప్రసాదాలతో గృహోన్ముఖు లవుతారు. మళ్ళీ తిరుమల ఆనందనిలయుని దర్శనభాగ్యం ఎప్పుడా అని ఆర్తితో ఎదురు చూస్తుంటారు.

వారందరికీ **"శీఘ్రమేవ పునర్దర్శన ప్రాప్తిరస్తు."**

**"వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ!**
**కానిమ్మని నాకీ పుణ్యము గట్టితి వింతేయయ్యా!!"**

# 15. చరిత్ర పుటలలో శ్రీనివాసమంగాపుర వైభవం

అది పవిత్రమైన.......... పరమపావనమయిన సువర్ణముఖీ – కళ్యాణీనదుల పరీవాహకప్రాంతం. అగస్త్యమహర్షి వంటి ఋషి వరేణ్యులెందరో ఆశ్రమ వాటికలను ఏర్పాటు చేసుకొన్న మహిమాన్వితమైన తపోభూములకు నిలయం ఈ ప్రాంతం. నూతన కల్యాణదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు ఇరువురూ సంచరించి పునీతం చేసిన దివ్యమైన ఆధ్యాత్మికక్షేత్రం ఈ ప్రాంతం. వేదవేద్యుడయిన శ్రీవేంకటేశ్వరునకు వీనుల విందుగా మంత్రాలను వినిపిస్తూ కీర్తించిన మంత్రవేత్తలయిన వేదవిద్వాంసుల అగ్రహారాలకు ఆలవాలం ఈ ప్రాంతం..........

ఇలా వీటన్నింటి మధ్యలో కేంద్రబిందువై దర్శనం మాత్రంచేతనే కల్యాణ పరంపరల్ని గుపించే రాజగోపురం, లోకానికి నలుదెసలా చాటుతూ వున్న విజయకేతనమా అన్నట్లుగా చూపరులను ఆకట్టుకొంటూ విరాజిల్లే దివ్యాలయమే శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి ఆలయం.

తిరుపతికి పడమటిదిక్కున సుమారు 10 కి.మీ. దూరంలో నెలకొనివున్న పుణ్యక్షేత్రం ఈ శ్రీనివాసమంగాపురం. ఈ క్షేత్రంలో వెలసివున్నదేవుడు శ్రీకల్యాణవేంకటేశ్వరుడు.

పూర్వం ఈ ప్రాంతంలో అగస్త్యమహాముని ఆశ్రమం వుండేది. శ్రీవేంకటేశ్వరుడు, నారాయణవరంలో ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన తరువాత వేంకటాచలక్షేత్రానికి తిరిగి వెళుతూ ఇచ్చోట అగస్త్యముని దంపతులను దర్శించినాడు. నూతన కల్యాణదంపతులైన

పద్మావతీశ్రీనివాసులకు ఆతిథ్యమిచ్చిన తరువాత ఆ ఋషి ఇలా అన్నాడు. 'స్వామీ! శ్రీనివాసా! నూతన దంపతులు వివాహమైన తరువాత ఆరునెలల వరకు తీర్థయాత్ర గానీ క్షేత్రసందర్శనం గానీ చెయ్యకూడదని పెద్దలు చెబుతారు. అందువల్ల మీ దంపతులిరువురూ ఆరునెలలపాటు ఇక్కడే ఈ ఆశ్రమంలోనే ఉండవలసిం"దంటూ ఆనతిచ్చాడు. ఆ మహర్షి విజ్ఞప్తి మేరకు కొంతకాలం తరువాత తిరుమలక్షేత్రానికి వెళ్తూ శ్రీనివాసుడు రెండువరాలను ప్రసాదించినాడు.

తిరుమలలో మాదిరిగానే ఇచ్చట కూడా అర్చామూర్తిగా దర్శనమిస్తూ కల్యాణవేంకటేశ్వరునిగా శుభపరంపరలను గుప్పిస్తాననీ, వివాహం కావలసినవారు ఎవరైనా ఇక్కడ తనను దర్శిస్తే వారికి త్వరలో వివాహమవుతుందనీ రెండు వరాలను ప్రసాదించి అక్కడినుంచి పద్మావతితో కలిసి శ్రీనివాసుడు సప్తగిరి క్షేత్రం చేరుకున్నాడు.

ఈ సప్తగిరులక్షేత్రం షట్చక్రయుతమైన యోగక్షేత్రమని, సిద్ధక్షేత్రమని, సాధనాక్షేత్రమని ప్రసిద్ధి. మూలాధారచక్రంవలె భాసిస్తూ ఉన్న శ్రీనివాసమంగాపురంలో పద్మావతి శ్రీనివాసులు ఇరువురూ ఒకరికొకరు చెట్టాపట్టా లేసుకొని సంచరించిన దివ్యస్థలం కాగా, శిఖరాగ్రాన, పైన దివ్యదంపతులిద్దరూ ఒక్కరై, ఏకమై, మమేకమై, అనంతమైన ఆనందమయమైన ఒకే తత్త్వంగా సహస్రారచక్రంవలె వెలుగులీనుతున్న దివ్యక్షేత్రమే శ్రీవేంకటాచలం.

ఉపాసకులకు, సిద్ధులకు నిలయమై **'సిద్ధకూటం'** అని ప్రాచీన కాలంలో పిలువబడిన శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణవేంకటేశ్వరుడు అర్చామూర్తిగా ఎప్పుడు వెలిశాడో ఎలా వెలిశాడో చెప్పడం సాధ్యం కాదు. కాని స్థూలంగా మన దృష్టికి వచ్చినంత మేరకు స్పష్టంగా చెప్పుకొన్నట్లయితే, ఇటీవలి కాలంలో రెండుమార్లు ఈ ఆలయం శిథిలమై, పునరుద్ధరింపబడిందని తెలియవస్తుంది.



క్రీస్తుశకం 1433 నాటికి, ఈ గ్రామమూ, ఈ గుడీ ఎంతో ఉచ్ఛస్థితిలో వుండేవనీ, 22-11-1433 నాటి శాసనం తెలియజేస్తోంది. అప్పట్లో ప్రసిద్ధమైన అగ్రహారంగా పేరొందిన ఈ చిన్నక్షేత్రంలో 24 మంది మహాజనం (వేదపండితులు) వుండేవారనీ, నెలకు ఇద్దరువంతున సంవత్సరం పొడవునా తిరుమలకు వెళ్ళి శ్రీవారి ఆలయంలో వేదపారాయణం చేసేవారనీ అందులో చెప్పబడింది. సస్యశ్యామలమైన ఈ అగ్రహారం, ఇక్కడి కల్యాణవేంకటేశ్వరుడి ఆలయం, ఆ తర్వాతి కాలంలో ఉద్ధృతమైన కల్యాణీనది వరదల తాకిడికి లోనై కొట్టుకు పోవడమో, లేదా శిథిలమవడమో జరిగింది.

క్రీస్తుశకం 1540 ప్రాంతంలో ఈ గ్రామం అచ్యుతదేవరాయలచేత తాళ్లపాకకవులకు సర్వమాన్యంగా దానమివ్వబడింది. ఆ సమయంలో తాళ్లపాకచిన్నన్న అని పిలువబడిన చినతిరువెంగళనాథుడు శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయాన్ని 20వేల వరహాలతో జీర్ణోద్ధరణ చేశాడు. తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారు తమ ఆడపడుచు అంటే కాదు తమ ఆడపడుచు అనీ అప్పట్లో పద్మసాలె కులస్థులకు, జాంద్రకులస్థులకు తీవ్రమైన తగదా వచ్చింది. చేనేతవృత్తి కలిగిన ఈ రెండు కులాలవారూ చిన్నన్నను తమ తగవును తీర్చమని అడిగారు. చిన్నన్న తిరుచానూరు గుళ్లో వాళ్లందరినీ సమావేశపరచి అందరూ వినేటట్లుగా శ్రీపద్మావతిఅమ్మవారు **"పద్మసాలె కులస్థులు తమ పుట్టింటివారనీ, తనకు చీరసారె పసుపు కుంకుమ మున్నగు మర్యాదలు వాళ్లే చెయ్యాలంటూ"** సాక్ష్యం పలికారు. అందుకు కృతజ్ఞతగా పద్మసాలెవారు 10 వేల వరహాలను పాదకానికగా చిన్నన్నకు సమర్పించారు, ఆయన ఆ మొత్తానికి మరి 10 వేల వరహాలను తాను జమచేసి, 20 వేల వరహాలతో శ్రీనివాసమంగాపుర ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి సమున్నత స్థితికి తీసుకువచ్చారు. ఈ ఘట్టాన్ని

తెలుపుతున్న రాగిరేకుశాసనం **'పాదకానిక శాసనం'** (1541) పేరుతో తి.తి.దేవస్థానంలో ఇప్పటికీ వుంది.

తాళ్లపాక అన్నమాచార్యుల మనుమలు, పెదతిరుమలాచార్యుల పుత్రులు అయిన చిన్నతిరుమలాచార్యులు మరియు చిన్నన్న ఈ దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేస్తూ మహాద్వారప్రవేశంలో ఇరువైపులా తమతండ్రి తాతలైన అన్నమయ్య, పెదతిరుమలయ్యల శిల్పాల్ని చెక్కించారు. ఆలయంలోని ముఖమండపంలో మధ్యలో ఎడమకు ఒక స్తంభంమీద అన్నమాచార్యుల శిల్పాన్ని కూడా చెక్కించారు.

తాళ్ళపాక వంశస్థుల చేత పునర్వైభవాన్ని సంతరించుకొన్న ఈ ప్రసిద్ధదేవాలయ శిఖరాలు ఆధ్యాత్మిక వినీలాకాశంలో మళ్లీ కొంతకాలం పాటు నిరాఘాటంగా వింతవింత కాంతులతో ప్రకాశించినాయి. కాని మానవుని చేతిలో ఎంతమాత్రం లేని ప్రకృతియొక్క భీభత్సానికి అడ్డూ అదుపూ లేకపోయింది. వికల్యా (కల్యాణి) నది వికృతమైన వరదలకు కల్యాణ శ్రీనివాసుని గుడి మరోమారు వికలమయింది. శిథిలమైంది. దీనికితోడు 'పుండు మీద రోకటి పోటు' అన్నచందాన తురకల దండయాత్రకు లోనై కొన్ని విగ్రహాలు ఛిద్రమయ్యాయి. మరికొన్ని కదలి పోయినాయి. ఇలా శిథిలమైన ఈ గుడి, మొండి గోడలతో, చెట్టూ పుట్టలతో నిర్జనారణ్యమై నిశ్శబ్ద గంభీరంతో, **"నివురు గప్పిన నిప్పువలె"** అంతస్తేజంతో స్తబ్దంగా నిలిచివుంటూ పునర్వైభవం సంతరించు కోవడానికి ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుగా వుండేది. ఇలాంటి దశలో ఒక యోగినిలాంటి స్త్రీ ఊళ్లో పప్పు, బియ్యం, నూనె, వగైరాలు భిక్షమెత్తుకొని రావడం, వండి ఆ కల్యాణవెంకన్నకు నివేదించడం చేస్తుండేది. పట్టపగలే గాఢాంధకారంగా వున్న ఆ గుళ్లోకి నివేదన తీసుకపోతుండగా పెద్ద పెద్ద సర్పాలు బుసకొట్టేవట! "ఓరే నాగా! స్వామికి ఆకలిగా వుంది. దారి ఇవ్వండిరా" అంటూ గొణిగేదట. అంతే



సర్పాలు వినయంగా పక్కకు ఒదుగుతూ తొలిగేవట! ఆ చీకట్లో తాటాకు మట్టను ముట్టించి, ఆ వెలుగులో లోనికి వెళ్లి ఒక మట్టిమూకుట్లో దీపరాధన, మరో మూకుట్లో నైవేద్యం చేసేదట ఆ మహాభక్తురాలు. నాగసర్పాలకు కూడా పాలు పెట్టేదట. స్వామికి నివేదన అయిన ప్రసాదాన్ని గుడి ఆవరణలోవున్న పశువులకాపరులకు పంచి పెట్టేదట ఆ యోగిని.

ఇలాగ సుమారు 40 ఏండ్లపాటు భక్తిగా పూజించిన ఆ భక్తురాలు ఒక రోజున తనకు తెలిసిన వాళ్లందరితో "ఈ రోజు నా పూజ చివరిది. రేపు ఒక మంచి అయ్యగారు వస్తారట! ఇంకా బాగా పూజ చేస్తారంట! ఇప్పట్నుంచి ఈ గుడి మంచి వృద్ధిలోకి వస్తుందంట. ఈ మాటలన్నీ లోపలున్న ఆ శ్రీనివాసుడే నానతో చెప్పిఆడు. ఈ రోజే నేను తుంబురుకోనకు (తిరుమల కొండలో ఉండే తీర్థం) పోయి ధ్యానం చేసుకుంటాను" అని చెప్పిన రోజే వెళ్ళిపోయింది. ఇదే ఆలయ ఐతిహ్యం అని గ్రామపెద్దలు చెబుతూ ఉంటారు.

విచిత్రాతి విచత్రం! ఆ మరునాడే కంచినుంచి సుందరరాజస్వామి అనే భక్తుడు శ్రీనివాసమంగాపురాన్ని వెదుక్కుంటూ వచ్చాడు.

ఆ భక్తుని పూర్తిపేరు "అర్చకం కంచి రాఘవేంద్రాచార్య సుందరరాజస్వామి" కొందరు "కృష్ణస్వామి" అంటారు. కౌశిక గోత్రానికి చెందిన వీరు మహారాష్ట్ర మధ్వ బ్రాహ్మణులు. పరమభక్తుడు, నిష్ఠాగరిష్ఠులైన సుందరరాజస్వామి భార్య మీనమ్మ (మీనాక్షమ్మ)తో కలిసి శ్రీనివాసమంగాపురం చేరుకున్నాడు.

తనకు శ్రీనివాసమంగాపురంలోని కల్యాణవేంకటేశ్వరుడు స్వప్నంలో కనబడి ఆషాఢ శుద్ధ సప్తమీ ఉత్తరఫల్గునీ నక్షత్రంరోజున తనకు శాస్త్రోక్తంగా పూజలు చెయ్యవలసిందిగా ఆజ్ఞాపించినాడని ఆ

ఊరివారందరికీ తెలియజేసినాడు. వాళ్లందరిసహకారంతో గుళ్లోని పుట్టలను, చెట్లను తొలగించి ఆవరణమంతా శుభ్రం చేయించినాడు.

మరునాడు విక్రమనామసంవత్సరం ఆషాఢశుద్ధ సప్తమీ ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కూడిన రోజు. వందలసంవత్సరాల అనంతరం మళ్లీ 11-7-1940 తేదీన సుందరరాజస్వామివారి చేతుల మీదుగా తొలిపూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఆ రోజు ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ నిర్వహింపబడింది. తర్వాత సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పిన తర్వాత శ్రీస్వామివారి మూలమూర్తికి మంగళాభిషేకం నిర్వహింపబడింది. పిదప తెల్లని పట్టువస్త్రాన్ని స్వామివారికి అలంకరించి, తెల్లని పట్టైనామాలు తీర్చి దిద్దబడినవి. ఆ తరువాత సహస్రనామార్చనలతో నివేదనలు ఘనంగా నిర్వహింపబడినవి.

11-7-1940 నాటినుంచి ప్రతి సంవత్సరం ఆషాఢశుద్ధ సప్తమినాడు సాక్షాత్కారవైభవం ఒక్కరోజు వార్షికోత్సవంగా జరుపబడుతూ వచ్చింది. 1980 నుంచి తి.తి.దేవస్థానం ప్రతిసంవత్సరం 3 రోజులపాటు సాక్షాత్కార వైభవోత్సవం పేరిట నిర్వహిస్తున్నది.

1967 ఏప్రిల్ 26వ తేదీన తి.తి.దేవస్థానం నారాయణవరం, నాగులాపురం ఆలయాలతోపాటు, శ్రీనివాసమంగాపురం ఆలయాన్నికూడా స్వీకరించింది. ఆనాటి నుండి శ్రీనివాసమంగాపురం ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూనే ఉంది.

1970 దేవస్థానం ఇ.ఓగా ఉన్న శ్రీచంద్రమౌళిరెడ్డిగారు, శ్రీనివాసమంగాపురం గోపురాన్ని గర్భాలయశిఖరాన్ని జీర్ణోద్ధారణ చేశారు. రాజగోపురంపై 7 సిమెంటు కలశాలను, విమానంపై ఒక సిమెంటు కలశాన్ని ఏర్పాటు చెయ్యడంతోపాటు ఆలయమహాప్రాకారం కూడా నిర్మింపబడింది. 1980లో ఇ.ఓ. శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారి



ఆధ్వర్యంలో రాజగోపురంపైన, విమానంపైన మట్టికలశాలకు బదులుగా బంగారుకలశాలు ప్రతిష్ఠింపబడినాయి.

మహారాజగోపురానికి ఎదురుగా వెలుపల ఇటీవల కాలంలో ఒక పుష్కరిణి, సన్నిధికి ఎదురుగా శ్రీ భక్తాంజనేయస్వామి సన్నిధి నిర్మింపబడినాయి.

రాజగోపురాన్ని దాటి లోనికి ప్రవేశిస్తే ఎదురుగా బంగారు బలిపీఠం, బంగారు ధ్వజస్తంభం కనిపిస్తాయి. అనేక కారణాలవల్ల ఇవి రెండు కాలాంతరంలో శిథిలమై అదృశ్యం కాగా 1978 మార్చిలో రాతిబలిపీఠం, దారుధ్వజస్తంభం ప్రతిష్ఠింపబడగా, నవంబరు 2000 సంవత్సరంలో వీటికి బంగారు కవచం తాపబడింది.

చుట్టూరా వున్న ప్రాకారపుగోడ మధ్య విశాలమైన ప్రాంగణంలో ఎత్తైన రాతి అధిష్ఠానంపై శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయం ముఖమండపం (ఘంటామండపం), అర్ధమండపం, శయనమండపం, అంతరాళం, గర్భాలయం అని ఐదు భాగాలుగా నిర్మింపబడింది.

ముఖమండపం అనే ఘంటామండపంలో శ్రీవారిమూలమూర్తికి ఎదురుగా పశ్చిమాభిముఖంగా గరుడాళ్వార్ సన్నిధివుంది. ప్రాచీనమైన గరుడాళ్వారు శిలామూర్తి భిన్నమైనందున 1978 ఏప్రిల్ నెలలో గరుత్మంతుని కొత్త శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఈ ముఖమండపంలో ద్వారపాలకులైన జయవిజయుల నిలువెత్తు శిలావిగ్రహాలు వున్నాయి. అంతకుముందు ఉన్న సిమెంటు విగ్రహాల స్థానంలో 1998 ఆగష్టులో ఈ శిలామూర్తులు ప్రతిష్ఠ చేయబడినాయి. ఈ మండపంలోనే వాయవ్య మూలన రెండు పెద్దఘంటలు వేలాడ దీయబడివున్నాయి. నివేదన జరిగే వేళల్లో మోగింపబడే ఈ ఘంటలలో

ఒకదానిని తి.తి.దేవస్థానం ఏర్పాటు చేయగా మరొక ఘంటను అప్పట్లో తి.తి.దేవస్థానం వైఖానసాగమ ఆస్థానపండితులుగా వుండిన శ్రీపండిత వేదాంతం జగన్నాథాచార్యులవారు, వారి తండ్రిగారైన స్వర్గీయ పండిత వేదాంతం రామానుజాచార్యుల (గుంటూరు జిల్లా తెనాలి తాలూకా మోపర్రు గ్రామం) వారి జ్ఞాపకార్థం 29-9-1971లో ఈ ఆలయానికి కానుకగా సమర్పించారు. ఇదే సందర్భంలో శ్రీజగన్నాథాచార్యులవారు, శ్రీహనుమత్సమేత శ్రీసీతారామలక్ష్మణ స్వామివారల పంచలోహవిగ్రహాలను, కొలువు శ్రీనివాసమూర్తి పంచలోహవిగ్రహాన్ని ఈ ఆలయానికి విరాళంగా సమర్పణ చేశారు.

జయ విజయులు కాపలావున్న ద్వారాన్ని దాటి లోనికి వెళితే అర్థమండపం వస్తుంది. దీన్నే స్నపనమండపం అంటారు. ఇందులోనే స్వామివారి నగలు, ఆభరణాలు భద్రపరచే గదులు చోటు చేసుకున్నాయి. విశాలమైన ఈ మండపాన్ని దాటి లోనికి వెళితే శయనమండపం వస్తుంది. ప్రతిరోజు రాత్రి ఈ శయన మండపంలో గొలుసులతో వేలాడదీసిన తూగుటుయ్యాలలో భోగశ్రీనివాసమూర్తికి పవళింపుసేవ జరుగుతుంది. దీన్నే ఏకాంతసేవ అంటారు. ఈ భోగ శ్రీనివాసమూర్తి రాగి విగ్రహాన్ని తాళ్లపాకవారు పూజించి ఈ ఆలయానికి సమర్పించారు. దీనితోపాటు తాళ్లపాకవారు తాము అనూచానంగా అర్చించిన శ్రీవేంకటేశ్వరుని మరియు గోదాదేవి చిన్న పంచలోహవిగ్రహాలు కూడా ఈ ఆలయానికి సమర్పించారు.

శయనమండపాన్ని దాటితే అంతరాళం వస్తుంది. అంతరాళంలో దక్షిణం గోడకు ఉత్తరాభిముఖంగా ఆసీనభంగిమలో శ్రీలక్ష్మీనారాయణుల శిలావిగ్రహం ఉంది. శ్రీస్వామివారి వామాంకంలో శ్రీమహాలక్ష్మి కూర్చొని వుంది. ఈ శ్రీలక్ష్మీనారాయణుల శిలామూర్తి నయనాభిరామంగా దర్శనమిస్తున్నది. ఇదే మండపంలో ఉత్తర గోడకు పశ్చిమంగా తలపెట్టి



దక్షిణముఖంగా ఐదుపడగల ఆదిశేషునిపై శయనించి వున్న శ్రీరంగనాథుని శిలామూర్తి దర్శనమిస్తుంది.

స్థిరమైన ఈ శిలామూర్తులతోపాటు ఈ అంతరాళంలోనే కులశేఖరపడి గడపకు ఇవతలే ఇరువైపులా తూర్పు ముఖంగా ఉత్సవమూర్తులన్నీ వేంచేపు చేయబడివున్నాయి. పండిత వేదాన్తం జగన్నాథాచార్యులవారు సమర్పించిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమంతుని విగ్రహాలు, కొలువు శ్రీనివాసమూర్తి విగ్రహం, తి.తి.దేవస్థానం ప్రతిష్ఠించిన శ్రీరుక్మిణీసత్యభామాసమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులు ఈ మండపంలోనే వున్నాయి. అన్నమయ్య అర్చించిన శ్రీవేంకటేశ్వరుని, గోదాదేవి చిన్న విగ్రహాలు కూడా దర్శన మిస్తాయి.

వీటితోపాటు, బ్రహ్మోత్సవంలో కల్యాణోత్సవంలో పాల్గొనే శ్రీదేవీ భూదేవి సమేతంగ కల్యాణవేంకటేశ్వరుని పంచలోహ ఉత్సవవిగ్రహాలు, ఇంకా సుదర్శనచక్రత్తాళ్వార్ ఉత్సవవిగ్రహం, ఉగ్రశ్రీనివాసమూర్తి విగ్రహం - మొత్తం, ఐదు విగ్రహాలు కూడా ఇక్కడే వున్నాయి కాలాంతరంలో శిథిలమైన ఈ ఆలయం నుండి ప్రాచీనమైన ఈ ఐదు విగ్రహాలు తిరుపతి శ్రీకోదండరామాలయానికి తరలింపబడి భద్రపరచబడినాయి. అక్కడి నుంచి 1945 ప్రాంతంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఓరియంటల్ పరిశోధనాసంస్థ మ్యూజియంకు తరలింపబడినాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసమంగపురం అర్చకులు శ్రీసుందరరాజస్వామి గట్టిగా ప్రయత్నం చేసి, వాటిని తిరిగి ఆలయానికి తెప్పించుటకు కృషి చేశారు. ప్రాచీనమైన ఈ ఐదు విగ్రహాలు, శ్రీనివాసమంగాపుర ఆలయంలో ''చక్రత్తాళ్వార్ ప్రతిష్ఠాపనోత్సవం" పేరిట 11-9-1972 నుండి 13-9-1972 వరకు 3 రోజులపాటు ఉత్సవాలు జరిపిన సందర్భంలో పునః ప్రతిష్ఠింప బడినాయి.

తిరిగి ఆలయానికి చేరుకొని పునః ప్రతిష్ఠింపబడిన శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులకు 1980 ఫిబ్రవరిలో మొదటిసారిగా బ్రహ్మోత్సవం, 1981 ఫిబ్రవరి 19న మొదటిసారిగా కల్యాణోత్సవం ఘనంగా జరుపబడినాయి. ఆనాటి నుండి ప్రతిరోజు ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణోత్సవం కూడా నిర్వహింప బడుతున్నది. ప్రతినెలా శ్రవణనక్షత్రం రోజున సాయంత్రం ఉభయ దేవేరులతో కూడివున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరునకు ఊంజల్‌సేవ జరుపబడుతున్నది.

అంతరాళం నుండి కులశేఖరగడపను దాటి లోనికి వెళితే వున్నదే శ్రీవారి గర్భాలయం. ఈ గర్భాలయం మధ్య భాగాన పీఠంతో కూడా సుమారు 8 అడుగులకు పైగా ఎత్తుగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు నయనమనోహరంగా భక్తులకు దర్శనమిస్తారు. నిలుచున్న (స్థానక) భంగిమలో శిలామూర్తిగా, తూర్పుముఖంగా ప్రతిష్ఠింపబడిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు, తిరుమలేశుని మాదిరిగానే లక్ష్మీదేవిని హృదయంలో ఉంచుకొని వున్నప్పటికీ ఇచ్చటి మూర్తిమాత్రం కొంచెం పెద్దదిగా వుంది.

శ్రీ స్వామివారు తిరుమలలోవలెనే చతుర్భుజుడై పై రెండుచేతుల్లో శంఖచక్రాలను ధరించి వున్నాడు. క్రింది రెండుచేతులు వరద కటి హస్తాలుగా విరాజిల్లుతూ వున్నాయి. చిన్మయహాసంతో నొసటన పెద్దనామంతో స్వామివారు దర్శనమిస్తున్నాడు.

గర్భాలయంలోని మూలమూర్తికి ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, ఉదయం, సాయంత్రం రెండుమార్లు తోమాలసేవ అనబడే పుష్పకైంకర్యం, ఉదయం సహస్రనామార్చన, మధ్యాహ్నం, సాయంత్రం రెండువేళలా అష్టోత్తరశతనామార్చన, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలూ నివేదనలూ జరుపబడుతున్నాయి.



ఉదయంపూట దధ్యోదనం, మధ్యాహ్నంపూట పులిహోర, చక్కెరపొంగలి, సాయంత్రం మొళహోర నివేదింపబడుతున్నాయి.

ప్రతి గురువారం ఈ మూలమూర్తికి రెండవగంట నైవేద్యకాలంలో అనగా ఉదయం 11 గంటల వేళలో నేత్రదర్శనం, ఆ రాత్రి పూలంగిసేవ జరుగుతుంది. ప్రతి శుక్రవారం పునుగు జవ్వాజి, పచ్చకర్పూరం కుంకుమపువ్వు మున్నగు సుగంధ ద్రవ్యాలతో మూలమూర్తికి అభిషేక సేవ జరుపబడుతున్నది. అభిషేకానంతరం వస్త్ర సమర్పణ, 450 గ్రాముల పచ్చకర్పూరంతో నామసమర్పణ జరుగుతుంది. దీన్నే తిరుమణి కాప్పు అంటారు.

ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవలో గోరువెచ్చని చక్కెర కలిపిన ఆవుపాలు, పంచకజ్జాయం నివేదన చేయబడతవి. మూలమూర్తి అయిన శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామికి 1980లో బంగారు కవచాలు సమర్పింపబడినాయి. ఇవిగాక వజ్రాలు తాపిన తిరునామాలు, కిరీటం, కర్ణపత్రాలు, శంఖుచక్రాలు వరద కటిహస్తాలు, పాదకవచాలు... ఇవన్నీ నెల్లూరుకు చెందిన రేబాలతిరుమలమ్మ విరాళమిచ్చారు. చెన్నై వాస్తవ్యులు శ్రీ.వి.ఎ.కె.రంగారావుగారు, వెండి సహస్రనామాలలక్ష్మీహారాన్ని, దశావతారవడ్డాణాన్ని, కంఠహారాలను సూర్యకఠారిని వెండినగలను మూలవిరాట్టునకు సమర్పించడమేగాక, సుమారు నలభై ఏండ్ల నాటినుండి ప్రతి సంవత్సరం సాక్షాత్కార వైభవోత్సవంనాడు స్వయంగా కాళ్లకు గజ్జెలు కట్టుకొని స్వామివారి ముందు భరతనాట్య సేవను చేసుకొంటున్నారు.

మద్రాసువాస్తవ్యులైన శ్రీ పిచ్చుక వెంకటసుబ్బయ్య శ్రీస్వామివారి మూలమూర్తికి వెండి నాగాభరణాలతో పాటు వెండి కుంభహారతి కలశాన్ని, రెండు అభిషేక వెండి బిందెలను సమర్పించుకున్నారు.

11-7-1940నాడు అప్పటి అర్చకులు శ్రీ సుందరరాజస్వామివారు తొలిసారి సాక్షాత్కార వైభవోత్సవాన్ని ప్రారంభించినది మొదలు 1-2-79 నాడు వారు పరమపదించువరకు శ్రీనివాసమంగాపురం ఆలయంలో ప్రధాన అర్చకులుగానే సేవలందించారు. 1970 నుండి వీరికి సహాయఅర్చకులుగా వారి దత్తపుత్రులు శ్రీ రాఘవేంద్రాచార్యులు సేవలందించారు.

ఆ తర్వాత 9-4-2004 నాటి నుండి శ్రీనివాసమంగాపురం ఆలయంలో పూర్తిగా వైఖానసఆగమ శాస్త్రానుసారంగా పూజలు నిర్వహించునట్లుగా ఏర్పాటు చేయబడి నేటికీ కొనసాగుతూ వున్నాయి.

2007 నవంబరు నెలలో జరిగిన మహాసంప్రోక్షణతో శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరాలయం దినదినాభి వృద్ధితో నిత్యకల్యాణోత్సవంతో, నక్షత్రోత్సవాలతో, గరుడపున్నమి సేవలతో, బ్రహ్మోత్సవ, సాక్షాత్కార వైభవోత్సవాలతో జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ భక్తలోకాన్ని విశేషంగా ఆకర్షిస్తూ ఉంది.

ఆశ్రితభక్తవరదుడైన శ్రీకల్యాణశ్రీనివాసుని మరెన్నో విధాలుగా భక్తులు తమకు నచ్చిన రీతిలో తాము మెచ్చిన తీరులో సేవించడానికై తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాసమంగాపురం క్షేత్రాభివృద్ధికి పాటు పడుతున్నది.

**ఓం నమో వేంకటేశాయ!**

# 16. శ్రీహయగ్రీవావతారం

**స్వతస్సిద్ధం శుద్ధస్ఫటికమణి భూభృత్ ప్రతిభటం**
**సుధా సధ్రీచీభిః ద్యుతిభి రవదాత త్రిభువనమ్ ।**
**అనంతై స్త్రయ్యంతై రనువిహిత హేషా "హల హలం"**
**హతాశేషావద్యం హయవదన మీడీమహి మహః**

**- వేదాంతదేశికుల శ్రీహయగ్రీవస్తోత్రం**

శ్రీమన్నారాయణుడు అత్యంత కృపతో జగత్కల్యాణం కోసం హయవదనంతో **"హయగ్రీవస్వామి"** గా అవతరించాడు.

శ్రీహయగ్రీవస్వామి నిర్మలంగా, స్వచ్ఛంగాను ఉన్నాడు. తెల్లగా ప్రకాశిస్తున్నాడు. ఏమాత్రం తరగని అనంతమైన అమృతం వంటి ఆ హయవదనుని తేజస్సులవల్ల లోకాలన్నీ వింత వింతలుగా వెలుగొందుతూ ఉన్నాయి. అద్భుతంగా విరాజిల్లుతున్న ఆ హయగ్రీవుడు పెద్దగా 'హల! హల!' అంటూ హేషారవాన్ని చేస్తున్నాడు. ఆ స్వామివారి ఆ హేషారవమే, ఆ సకిలింపే, వేదాలుగా ఆవిర్భవించి విశ్వమంతటా వ్యాపించి సంభ్రమాశ్చర్యాలను గొల్పుతున్నాయి. అట్టి పరంజ్యోతి స్వరూపమైన శ్రీహయగ్రీవస్వామికి భక్తి పూర్వక నమస్కారాలు!!

బాగుంది. ఇంతకూ ఎవరీ హయగ్రీవస్వామి!

ఎప్పుడు అవతరించాడు. ఎందుకు అవతరించాడు.

ఒకానొక శ్రావణమాసంలో శ్రవణనక్షత్రంతో కూడి ఉన్న పున్నమినాడు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణా లక్ష్యంతో హయగ్రీవుడిగా అవతరించాడు.

హయవదనంతో శంఖచక్రాది పంచాయుధాలతో శ్రీమహావిష్ణువు ఆవిర్భవించడాన్ని అనేక పురాణాలు అనేకవిధాలుగా చెబుతున్నాయి.

పూర్వం మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులు చతుర్ముఖ బ్రహ్మదేవుడు చేస్తున్న వేదగానాన్ని విన్నారు. ఎంతో మధురంగా శ్రవణపేయంగా వీనులవిందుగా సాగుతున్న వేదమంత్రాలకు ముగ్ధులు అయ్యారు. ఇంకేముంది! వాటిని దొంగిలిస్తే పోలా? అని అనుకొన్నారు. అనుకున్నదే తడవుగా ఆ పనికి పూనుకొన్నారు ఆ రక్కసులు.

పాపం ఇవేవీ గమనించని బ్రహ్మ దేవుడు తన నాలుగుముఖాలతో తన చేతుల్లోని వేదసంపుటిని చూస్తూ తన్మయంతో స్వరయుక్తంగా పఠిస్తున్నాడు. ఆ బ్రహ్మదేవుడి వేదపారాయణకు తగినట్లుగా చదువులతల్లి సరస్వతీదేవి తన వీణ **"కచ్ఛపి"** పై స్వరాలు పలికిస్తూ అరమోడ్పు కన్నులతో మైమరపుతో ఉండింది. ఇదే మంచి అదను అనుకొన్న మధుకైటభులు ఏమరుపాటున వున్న చతుర్ముఖుడినుండి వేదాలను ఎత్తుకొని పాతాళలోకానికి వెళ్ళిపోయారు.

జరిగిన ఆగడానికి తేరుకొన్నాడు బ్రహ్మ. సృష్టి కార్యక్రమం ఆగిపోయింది. ఒక విధమైన తమోగుణం, అజ్ఞానం ఆవహించింది బ్రహ్మదేవుడికి. మందుడయ్యాడు. అనగా కర్తవ్యతామూఢుడయ్యాడు. అలాంటి సమయంలో శ్రీమహావిష్ణువు హయగ్రీవ వదనంతో, శంఖచక్రాది ఆయుధాలతో అవతరించి, పాతాళానికెళ్ళి మధుకైటభులను సంహరించాడు. ఆ రక్కసుల బారినుండి తెచ్చిన వేదసంపుటిని మళ్ళీ బ్రహ్మ కప్పగించాడు పరంధాముడు. అంతే బ్రహ్మదేవుడి బుద్ధి చైతన్యవంతమై వికసించింది. మళ్ళీ సృష్టికార్యం యథావిధిగా ప్రారంభమైంది.

అందువల్లనే హయగ్రీవస్వామి వేదాల రక్షకుడుగా, జ్ఞానప్రదాతగా, సకలవిద్యలకు ఆధారమూర్తి ఐన జగద్గురువుగా భాసిస్తూ ఇలా స్తుతింపబడినాడు.



**జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిమ్. ।**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥**

ఇది ఇలావుండగా,

శ్రీహయగ్రీవ అవతార ఆవిర్భావాన్ని గూర్చి దేవీభాగవత మహాపురాణం మరోవిధంగా ఆవిష్కరిస్తున్నది.

ఒకప్పుడు గుర్రం తలతో ఉన్న రాక్షసుడు ఉండేవాడు. రాక్షసుడన్న తర్వాత ఊరికే వుంటాడా! హయగ్రీవంతో వున్న ఆ రక్కసుడు దుర్మార్గుడై లోకాల్ని ముప్పుతిప్పలు పెట్టాడు. వాడి ఆగడాలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. అయినా వాడు అంతటితో ఆగలేదు. అసలు చావే లేకుండాలని అనుకొన్నాడు. అనుకొన్నదే తడవుగా పరాత్పరి, పరమేశ్వరి అయిన జగన్మాతను గూర్చి ఘోరంగా సాధన చేశాడు. వాడి తపస్సుకు అమ్మలగన్న అమ్మ జగదీశ్వరి సంతృప్తి చెందింది. ప్రత్యక్షమై ఏం కావాలని అడిగింది.

హయగ్రీవుడు పెద్ద సకిలింపుతో అట్టహాసం చేస్తూ తల్లీ! జగజ్జననీ! నాకు ఎవరితోను చావు ఉండకూడదన్నాడు. అది అసాధ్యం. పుట్టినది చావాల్సిందే. తప్పదన్నది దేవి. అయితే తన లాగానే గుర్రంతల ఉన్నవాడి చేతిలోనే మరణం సంభవించేట్లు వరం అడిగాడు వాడు. తథాస్తన్నది జగన్మాత. తనలాగే గుర్రం ముఖంతో పుట్టడం అసంభవం. కనుక తనకు చావే లేదు. రాదనుకున్నాడు. తనకు ఎదురే లేదనుకొని ఇంకా ఇంకా విజృంభించాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. ఆ తర్వాత ఒకనాడు శ్రీ వైకుంఠంలో శేషపాన్పుపై పవళించిన శ్రీమహావిష్ణువునకు పాదసేవ చేస్తున్నది, శ్రీమహాలక్ష్మి! ఏదో ఆలోచనలో ఉన్న శ్రీహరి, లక్ష్మిని చూస్తూ ఎందుకో అదో రకంగా నవ్వాడు.

నవ్వుల్లో కూడా తేడా లుంటాయి. ఆ తేడాల వల్లే అపార్థాలు వస్తాయి.

ఇక్కడ వ్యంగ్యంగా నవ్విన పతిదేవుని నవ్వుకు లక్ష్మీదేవి అనుమానించింది. ఎందుకు నవ్వాడు? నేను అందంగా లేనా? నా కంటే అందగత్తె అయిన మోహనాంగిని ఎవర్నైనా తలచుకొని నన్ను చూచి హేళనగా నవ్వుతున్నాడా? అని ఇలా పరిపరివిధాల అనుకోవడమే కాదు. అక్కసుతో అడిగేసింది కూడ. లక్ష్మీదేవి అంతటితో ఆగిందా. ఆవేశంతో స్వామీ! నన్ను గేలి చేస్తూ నవ్విన నీ తల తెగిపడు గాక! అని శాపనార్థాలు పెట్టింది!

ఈ హఠాత్సంఘటనకు, శపించిన లక్ష్మీదేవి, శాపానికి గురి అయిన విష్ణువు ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. నిదానంగా ఆలోచించి ఈ సంఘటన నుంచి తేరుకున్నారు. ఇది యాదృచ్ఛికం మాత్రం కాదు. లోకకల్యాణం కోసమే! అంతా మంచికోసమే! అని మనస్సుల్ని కుదుట పరచుకొన్నారు. శ్రీలక్ష్మీనారాయణులు. ఆ తర్వాత ఈ సంగతే మర్చిపోయారు.

ఒకప్పుడు శ్రీహరి రాక్షసులపై యుద్ధానికి వెళ్లి జయించి వచ్చాడు. కాని బాగా అలసిపోయినట్లున్నాడు. అందువల్ల తన చేతిలోని ధనస్సును గడ్డం కింద ఆన్చి కాస్త విశ్రాంతిగా కూర్చొని కన్నులు మూసికొన్నాడు. ఇంతలో దేవతలు తాము ఏదో యాగం చేస్తూ ఆహ్వానించడానికి శ్రీహరి దగ్గరికి వచ్చారు. పురుషోత్తముణ్ణి ఆహ్వానించకపోతే ఏం బావుంటుంది. యజ్ఞం సఫల మవ్వాలంటే తప్పక పిలవాలి కదా! మరి ఆయన్ను లేపే దెట్లా! అని యోచించారు. వాళ్లకు ఒక ఆలోచన తట్టింది.

ఒక చెదపురుగును సృష్టించారు. దాని పేరు **"వ్రమి"**. నీవు ఎలాగైనా విష్ణువును నిద్రనుండి లేపు అన్నారు. నా కేమిటి లాభం? అడిగింది ఆ పురుగు. మేం చేసే యజ్ఞంలో హోమగుండం వెలుపల పడిన హోమద్రవ్యాలన్నీ నీకే అన్నారు దేవతలు. సరేనంటూ ఆ **'వ్రమి'** క్రిమి, శ్రీహరి గడ్డం కింద అదిమిపెట్టుకొన్న వింటినారిని కొరికింది. ఇంకేముంది! ఆ నారి తెగడం, విష్ణువు తల తెగి ఎగిరిపోవడం రెండూ ఒకేసారి జరిగినై. ఆ తలకోసం అంతటా వెదికారు. ఎక్కడా కనపడలేదు.



భయభ్రాంతులైన దేవతలు అమ్మవారిని వేడుకొన్నారు. వాళ్లను ఓదారుస్తూ జగన్మాత ఇది దైవ సంఘటన. ఎక్కడైనా వెదికి గుర్రం తలను తెచ్చి అతికించండి, అంటూ పలికింది. వాళ్లు అలాగే చేశారు. ఈ గుర్రం తలతో శ్రీహరి హయగ్రీవుడై వెలుగొందాడు.

ఆ వైకుంఠధాముడు హయగ్రీవుడై అవతరించిన రోజే శ్రావణమాసం పున్నమి రోజు. శ్రీహయగ్రీవస్వామి లోకకంటకుడైన హయగ్రీవరక్కసుణ్ణి వాని కోరిక మేరకే సంహరించాడు.

దేవీభాగవతంలోని గాథ ఇలా వుండగా, బ్రహ్మాండ పురాణంలో శ్రీహయగ్రీవస్వామికి సంబంధించిన లోకకల్యాణ కారకమైన మరొక అద్భుతమైన సన్నివేశం కనపడుతూ ఉంది.

ఒకప్పుడు అగస్త్యమునీంద్రులు శ్రీలక్ష్మీహయగ్రీవస్వామిని ఉపాసించినాడు. ఆ స్వామి ప్రత్యక్షమై ఏం కావాలని అడిగాడు. జగజ్జనని శ్రీలలితాపరమేశ్వరిని గూర్చి ఏమి ఉపదేశించినా సరే! అన్నాడు మహర్షి. శ్రీహయగ్రీవస్వామి శ్రీలలితాఅమ్మవారి మంత్రాన్ని అంగన్యాస కరన్యాస పూర్వకంగా ఉపదేశించడమే గాక, లలితాదేవి మహత్యాన్ని గూర్చి విపులంగా తెలియజెప్పాడు.

అగస్త్యమహర్షి కూడా సర్వవిద్యాపరిపూర్ణుడు. అందుకే "అందరూ ఒక ఎత్తు అగస్త్యుడొక ఎత్తు" అన్న నానుడి అన్నివిధాలుగా ఆ మహర్షి గొప్పదనాన్ని చాటుతున్నది. ఇలా అన్నీ ఉపదేశించిన శ్రీహయగ్రీవుడితో, అగస్త్యుడిలా అన్నాడు.

'స్వామీ! హయవదనా! అమ్మలగన్న అమ్మను గూర్చి నాకు సర్వవిధాల ఉపదేశించారు. కాని ఇంకొక కొరత వున్నది. అదే లలితా పరాభట్టారికా సహస్రనామస్తోత్ర వైశిష్ట్యాన్ని మీరు చెప్పకపోవడం వెలితిగా వున్నది. మీరు మరిచి పోయారేమో! లేక మీకు తెలిసినా, దాన్ని పొందడానికి నాకు అర్హత లేదా! అని భక్తి ప్రపత్తులతో అడిగాడు అగస్త్య మునీంద్రుడు.

వెంటనే హయగ్రీవుడు అగస్త్యా! నిజం. నీవు అన్నది నిజం. ఆ సహస్రనామస్తోత్రం అందరికీ ఉపదేశించరానిది. అతి రహస్యమైనది. మహిమ గలది కూడా! కాని నీవు భక్తిగా అడిగావు కనుక లోకక్షేమం కోసం, ఆ పరమేశ్వరి సంకల్పంతో దాన్ని ఉపదేశిస్తాను.

**"శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ**
**చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా ।**
**ఉద్యద్భాను సహస్రాభా చతుర్బాహు సమన్వితా**
**రాగస్వరూప పాశాఢ్యా క్రోధాకారాంకుశోజ్జ్వలా**
**.......................................................**
**.......................................................**
**శ్రీచక్రరాజనిలయా! శ్రీమత్త్రిపురసుందరీ!**
**శ్రీశివా శివశక్త్యైక్య రూపిణీ లలితాంబికా**
**ఏవం శ్రీలలితాదేవ్యా నామ్నాం సాహస్రకం జగుః"**

**ఇతి శ్రీబ్రహ్మాండపురాణే ఉత్తరాఖండే శ్రీహయగ్రీవాగస్త్య సంవాదే శ్రీలలితా రహస్య సహస్రనామ స్తోత్రకథనం సంపూర్ణమ్" –**

అంటూ జరిగిన శ్రీహయగ్రీవస్వామి, అగస్త్యమహర్షి వారల సంవాదం వల్ల అత్యంత రహస్యమైన మహిమగల ఈ సహస్రనామ మంత్రం లోకానికి అందింది. ఆనాటినుండి అన్ని దేవీ ఆలయాల్లో ఈ



మంత్రం అనుష్ఠింపబడుతు ఉండడమే గాక, దేవీఉపాసకులకు ఈ శ్రీలలితాసహస్రనామం దివ్యమంత్రంగా విరాజిల్లుతూవుంది.

ఆ తర్వాత ఒకానొకప్పుడు శ్రీ హయగ్రీవస్వామిని చూసిన లక్ష్మీదేవికూడా తానూ గుర్రమైతే బాగుంటుందని తలచి, ఆడగుర్రంగా మారింది. ఈ ఇద్దరికీ ఆ సమయంలో హైహయుడను పుత్రుడు కలిగాడు.

వైఖానసం, పాంచరాత్రం వంటి ఆగమాల నియమాను సారం హయగ్రీవుడు ప్రధాన మూర్తిగాను, ఉపాంగదేవతగాను, సాలగ్రామ రూపంలోను అర్చింపబడటం ఆ యాచోట్ల ఉంది. వైఖానసాగమం ప్రకారంగా పూజలు జరిగే తిరుమలక్షేత్రంలో తిరుమలేశుడు తానే హయగ్రీవుణ్ణి అంటూ ప్రతిరోజూ,

**ఓం హయగ్రీవాయ నమః**
**ఓం కైటభారయే నమః**
**ఓం గ్రాహఘ్నాయనమః**

వంటి నామాలతో అర్చింపబడటం విశేషం! అంతమాత్రమేగాక తిరుమల శ్రీవారిఆలయ మహాప్రదక్షిణ మార్గంలో నరిగ్గా ఈశాన్యమూలలో **"శ్రీలక్ష్మీ హయగ్రీవస్వామివారి ఆలయం"** దక్షిణముఖంగా వున్నది.

శ్రీ హయగ్రీవస్వామి అవతరించిన నాటినుండి ఎందరిచేతనో జగద్గురువుగా ఉపాసింపబడుతూనే వున్నాడు. త్రిమతాచార్యులైన శ్రీ ఆదిశంకరులవారు, శ్రీరామానుజులవారు, శ్రీమధ్వాచార్యులవారు శ్రీలక్ష్మీహయగ్రీవస్వామివారిని ఉపాసించినవారు. అలాగే మధ్వమత ప్రవర్ధకులయిన శ్రీవాదిరాజతీర్థులవారు శ్రీహయగ్రీవోపాసకులుగా జగత్ప్రసిద్ధి.

ఇలాగ శ్రీ హయగ్రీవస్వామి అవతరించిననాటి నుండి జగద్గురువుగా, జ్ఞానానందమూర్తిగా, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తూ,

సర్వవిద్యలకు అధిదైవంగా భాసిస్తున్నాడు. ఆ స్వామివారు బోధించిన శ్రీలలితాసహస్రనామమంత్రం అనుసంధానం చేసికొంటూ, ప్రత్యేకంగా శ్రీహయగ్రీవుడు అవతరించిన శ్రావణ మాసంలో ఉపాసనా మార్గంలో పయనించడం మనందరికి సర్వశ్రేయో దాయకం! సర్వార్థ సిద్ధిప్రదం కూడా!!



**శ్లో॥ విశుద్ధ విజ్ఞాన ఘనస్వరూపం**
**విజ్ఞాన విశ్రాణన బద్ధదీక్షమ్**
**దయానిధిం దేహభృతాం శరణ్యం**
**దేవం హయగ్రీవమహం ప్రపద్యే ॥**

**(2015 ఆగష్టు "సప్తగిరి"లోని శ్రీహయగ్రీవ జయంతి వ్యాసం.)**

# 17. శ్రీ కోదండరామస్వామి ఆలయం - చంద్రగిరి

శ్రీ వేంకటాచలక్షేత్ర పరిసరసానువుల్లో ఎన్నెన్నో క్షేత్రాలు, మరెన్నెన్నో దేవాలయాలు నెలకొనివున్నాయి.

అలాంటి వాటిల్లో, తిరుమలక్షేత్రంతో ఆధ్యాత్మికంగా, చారిత్రికంగా విడదీయలేని ఒక అనుబంధాన్ని పెనవేసుకున్న దేవాలయం చంద్రగిరిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం.

తిరుమలకొండలకు దక్షిణంగా కూతవేటు దూరంలో సహజసిద్ధంగా ఏర్పడిన చిన్నరాతికొండే **'చంద్రగిరి'**. ఆ కొండకు దిగువన ఆనుకొని వున్న గ్రామంపేరు కూడా **'చంద్రగిరి'**. ఆ గ్రామంవల్ల ఆ కొండకు పేరుకల్గిందా, లేక ఆ కొండవల్లే ఆ ఊరికి ఆ పేరు ఏర్పడిందా అన్నది చెప్పడం చాల కష్టం. అంతకుపూర్వం వీటికి ఏ పేర్లు ఉండినాయో చెప్పడం కూడా కష్టమే! మరి!

ఆ ఊరికి చుట్టూ అర్ధచంద్రాకారంలో ఆ కొండ ఉండడం వల్లా, ఆ కొండమీద చంద్రుడు తపస్సు చేసినందువల్లా దానికి "చంద్రగిరి" అనే పేరు ఏర్పడిందని అదే పేరు ఆ ఊరికి కల్గిందని కొందరు చెప్తున్న మాట!

కాని, ఆ ఊరికి, ఆ కొండకు ఆ పేరు కల్గడానికి ప్రధానమైన ఆధారంగా వెలసిన ఆలయం 'చంద్రగిరి'లోని అత్యంత ప్రాచీనమైన శ్రీ కోదండరామస్వామి ఆలయం.

శ్రీరామచంద్రస్వామి ఆలయానికి ఆనుకొని వున్న కొండ కనుక 'రామచంద్రునిగిరి' అని ఆ కొండా, ఆ ఊరూ రెండు ఒకే పేరుతో పిలువబడినాయి. ఆ **"రామచంద్రునిగిరి"** రానురాను కాలాంతరంలో

"రామచంద్రగిరి" అని పిలువబడుతూ జనుల వ్యవహారంలో 'చంద్రగిరి' అని సంక్షిప్తంగా అయ్యిందన్నది మరో కథనం!

విజయనగరరాజులు తమ పరిపాలనాసౌలభ్యం కోసం చుట్టూ కీకారణ్యం మధ్యలో ఉన్న ఎత్తైన **'చంద్రగిరి'**ని రెండోరాజధానిగా చేసుకొని కొండపై శత్రుదుర్భేద్యమైన కోటగోడను, బురుజులను నిర్మించి, దానికి ఆనుకొని నీళ్ళతో నిండిన లోతైన అగడ్తలను నిర్మించుకొన్నారు.

విజయనగరరాజులు తిరుమలేశుని అచంచలభక్తులు. ఎన్నో మడులను, మాన్యాలను, నగానట్రా, నివేదనలను శ్రీవేంకటేశ్వర స్వామివారికి సమర్పించుకున్న వితరణ శీలురు. ఆ విజయనగర పాలకులు, చంద్రగిరిలో విడిది చేసినప్పుడు "తిరుమల శ్రీవారి నైవేద్య ఘంటానాదం" వినపడేట్లుగా, తిరుమల నుండి చంద్రగిరి వరకు, అంచెలంచెలుగా ఘంటామండపాల్ని నిర్మింపజేసి, ఆ ఘంటానాదాన్ని విన్న తర్వాతనే తాము భోజనం చేసేవారట! అంతేగాక చంద్రగిరి నుండి తిరుమలకు నడిచివెళ్లే **'శ్రీవారి మెట్టు'** మార్గంలో రామానుజకూటాలనే అన్నసత్రాలను, దేశాంతర మఠాలను స్థాపించి ఈ రాజులు యాత్రికుల సేవలో తరించారు.

ఇలా విజయనగరరాజుల పర్యవేక్షణలో మూడుపువ్వులూ, ఆరుకాయలుగా ఉత్సవాలతో వైభవంగా వెలిగిన ఆలయం **'చంద్రగిరి'**లోని శ్రీకోదండరామస్వామి ఆలయం. ఈ ఆలయం ఎప్పుడు ప్రతిష్ఠింపబడిందో స్పష్టంగా తెలియకపోయినా, క్రీ.శ.1535 నుంచి విజయనగరపాలకులచేత పునర్నిర్మింప బడుతూ అభివృద్ధి చెందిన ఆలయంగా తెలుస్తున్నది.

తూర్పుముఖంగా నిర్మింపబడిన ఈ ఆలయంలో ముఖ్యంగా గర్భాలయం, పైన ఏకకలశగోపురం, దాని చుట్టూవున్న విమాన ప్రదక్షిణమార్గం తిరుమలేశుని ఆనందనిలయ విమానం, ముక్కోటి



ప్రదక్షిణాన్ని పోలివుండడం చాల విశేషం. ఆనందనిలయం త్రితలగోపురం, కాగా చంద్రగిరిలోనిది ద్వితల గోపురం. తిరుమలలో మాదిరే ఈ గోపురానికి నాలుగుమూలల్లో సింహాల శిల్పాలు వుండడం గమనించవచ్చు.

చంద్రగిరి శ్రీకోదండరామస్వామి ఆలయం తూర్పుముఖంగా గర్భాలయం, శయనమండపం, అంతరాళం, ముఖమండపం, మహాముఖమండపం, అని నాలుగు భాగాలుగా నిర్మాణమైంది.

**గర్భాలయం మధ్యలో ఏక శిలా పీఠంపైన శ్రీరాముని ఎడమతొడపై సీతాదేవి ఆసీనురాలై వుండగా, రాముడు అభయముద్రతో ఎలాంటి ఆయుధాలు లేకుండా ఆసీన భంగిమలో శిలామూర్తిగా దర్శన మిస్తున్నాడు. రామునికి కుడి పక్కన లక్ష్మణ భరతులు, ఎడమ పక్కన శత్రుఘ్నుడు నిలిచివున్నారు. ఇది శ్రీరామపట్టాభిషేకం శిల్పం అన్నమాట. వారికి ముందు అదే పీఠం క్రింది భాగంలో గరుత్మంతుడి, రామాయణం పఠిస్తున్న ఆంజనేయుడి శిల్పాలు వున్నాయి.**

ఈ ఆలయంలోని రాముడు **"పట్టాభిరాముడు"** అయినా ఈయన **"శ్రీకోదండరామస్వామి"**గా పిలువబడుతుండడం గమనించవలసిన అంశం.

వీటన్నింటితోపాటు శయనమండపంలో శ్రీసీతారామలక్ష్మణ హనుమంతులు, సుదర్శనుడు మున్నగు పంచలోహ ఉత్సవమూర్తులు వున్నాయి. ఉత్సవమూర్తులు మాత్రం కోదండధారులుగా వున్నారు. అయితే సీతమ్మమూర్తిమాత్రం శ్రీరాముడికి కుడివైపున వుండడం కనపడుతుంది.

ఈ ఆలయంలోని ముఖమండపంలో అంతరాళం ప్రవేశద్వారానికి ఇరువైపులా జయవిజయుల నిలువెత్తు శిలామూర్తులతోపాటు ఈ మండపంలోనే శ్రీలక్ష్మీ నరసింహస్వామి, పన్నెండుమంది ఆళ్వారులు,

విష్వక్సేనుడు, శ్రీవేణుగోపాలస్వామి మున్నగు శిలా విగ్రహమూర్తులు చోటు చేసుకున్నాయి. ఈ ముఖమండపం గర్భాలయానికి ప్రదక్షిణ పథంగా కూడ నిర్మింపబడింది. ఈ ప్రదక్షిణపథం తిరుమల శ్రీవారి ముక్కోటి ప్రదక్షిణను యథాతథంగా పోలివుండడం విశేషం!

మహాముఖమండపంలో శ్రీరామచంద్రస్వామికి ఎదురుగా భక్తాంజనేయస్వామి మండపం, ఇదే ముఖమంపంలో దక్షిణాభిముఖంగా వున్న మండపంలో మరోఎత్తైన వీరాంజనేయస్వామివారిమూర్తి ప్రతిష్ఠింప బడివున్నాయి.

అత్యంత ప్రాచీనకాలంనుంచీ పాంచరాత్రాగమ వడగల్ సంప్రదాయ బద్ధంగా అర్చనలు జరుగుతున్న ఈ ఆలయంలో ప్రతిరోజు శ్రీకోదండరామస్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ అర్చన, మూడుపూటలా నివేదనలు, ప్రతి శనివారం అభిషేకం, జరుగుతాయి. ప్రతి ఏటా శ్రీరామనవమినుంచి పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వీటినే **"శ్రీరామ జననోత్సవాలు"** అని ఇక్కడ అంటారు. ఈ ఉత్సవాల్లోనే చైత్రపున్నమినాడు **'శ్రీసీతారాముల కల్యాణం'** జరిగిన తర్వాత గ్రామోత్సవం చేస్తారు. **'రథసప్తమి', వైకుంఠ ఏకాదశి** పర్వదినాల్లో గ్రామోత్సవాలు జరుగుతాయి. మిగతా రోజుల్లో ఆలయ ప్రాకారంలోనే ఊరేగింపులు జరుపబడుతవి.

ప్రాచీనకాలం నుండీ విజయనగరరాజుల కాలంలో ఎన్నో ఉత్సవాలతో ఊరేగింపులతో ఘనంగా వైభవంగా వెలిగిన ఈ 'చంద్రగిరి' శ్రీకోదండరామస్వామివారి ఆలయాన్ని ఇటీవలే తి.తి.దేవస్థానం వారు స్వీకరించారు.

ఏడుకొండలవాని అండన చేరిన 'చంద్రగిరి' శ్రీకోదండరాముని ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకోగలదని ఆకాంక్షిద్దాం.

* * *

# 18. పావన కృష్ణాతీరంలో పరమగురువులు

**కృష్ణ!** అంటే చాలు. కష్టాలు పోతాయి. **కృష్ణ! కృష్ణ!** అంటేనే చాలు. పాపాలు అన్నీ పోతాయి.

అద్భుతం! విచిత్రంగా కూడా వుందే! అవును మరి.

ఇలాంటి ఆశ్చర్యమైన కార్యాలతో మానవులను పునీతం చేస్తున్న భవ్యమైన దివ్యమైన రెండు అద్భుతమైన వస్తువులు "కృష్ణ" అనే పేరుతో విరాజిల్లుతూ వున్నాయి. వర్ధిల్లుతూ వున్నాయి కూడ.

వాటిల్లో ఒక **'కృష్ణ'**ను తలిస్తే చాలు. మరో **'కృష్ణ'**ను తాకితేనే చాలు. చాలు.

ఇట్టే కలుషాలను పోగొట్టుకోవచ్చు కష్టాలనుండి, కలిబాధలనుండి గట్టెక్కవచ్చు, పుణ్యాన్ని మూటగట్టుకోవచ్చు, కోరుకున్న సుఖాల్ని ఇబ్బడి ముబ్బడిగా పొందవచ్చు.

ద్వాపరయుగంనాటి మాట!

దేవకీదేవి వసుదేవుడు అనే భార్యాభర్తలు ఉండేవారు. వాళ్లు లోకాల కష్టాల్ని పోగొట్టడం కోసం, భగవంతుణ్ణి తమకు బిడ్డగా పుట్టమని అడిగారు. వాళ్ల కోరికమేరకు ఆ దేవుడు వాళ్లకు కొడుకుగా పుట్టాడు. లోకుల బాధల్ని పోగొట్టాడు. భూభారాన్ని తగ్గించాడు. చివరకు జగద్గురువుగా భాసిస్తూ అద్భుతమైన జ్ఞానామృతం ప్రవిస్తున్న 'గీత' అనే దివ్య గంగను ప్రవహింపజేశాడు. అందర్నీ పునీతుల్ని చేశాడు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడు. ఆయన్ను **కృష్ణ! కృష్ణ!** అని స్మరిస్తే చాలట!

అందువల్లే,

**నరజన్మ బందాగె నాలిగె ఇరువాగె**
**కృష్ణా! యనబారదె?**

## కృష్ణా ఎందరె కష్టపరిహార కృష్ణా యనబారదె?

నరజన్మ కలిగినందుకు, నాలిక(మాట) ఉన్నందుకు కృష్ణా! అనరాదా! కష్టాలన్నీ పరిహారం అవుతాయి కదా! అందుకే 'కృష్ణా' అని అనమంటారు కన్నడహరిదాసు పురందరదాసులవారు.

బాగుంది. మరి మరో **"కృష్ణ"** సంగతో! దాన్ని స్పృశిస్తే చాలు! అదే పవిత్రమైన గంగామతల్లి కృష్ణానది. పరమపావనమైన కృష్ణానదీ జలాలను **'పానం'** చేసినా చాలు. ఆ నిర్మలజలాల్లో **'స్నానం'** చేసినా చాలు. మానసిక, శారీరక రుగ్మతలతోపాటు అనేకానేక పాపాలు తొలుగుతాయి. పుణ్యాలు కలుగుతాయి.

పడమటి కనుమల్లో 'సహ్యాద్రి' అనే పర్వతసానువుల్లో ఉద్భవించింది **'కృష్ణ'** అనే ఈ పుణ్యనది. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ మున్నగు నాలుగు రాష్ట్రాల్లో మొత్తం పద్నాలుగు వందల మైళ్లదూరం ప్రవహిస్తున్నది.

సహ్యాద్రిలో మహాబలేశ్వరం వద్ద పుట్టినది మొదలు, హంసలదీవి వద్ద సముద్ర సంగమం చేసే వరకు దిండి, మూసి, పాలేరు, మునేరు, తుంగభద్ర, కోయినా, వరుణ, పంచగంగ, దూద్‌గంగ, ఘటప్రభ, మలప్రభ, భీమ, అమరజ, భవనాశిని... మున్నగు అనేకమైన ఉపనదుల్ని, వాగుల్ని, వంకల్ని కలుపుకొంటూ, సుమారు ముప్పైకి పైగానే సంగమాలతో అలరారుతూ వున్న పవిత్రమైన నది కృష్ణమ్మతల్లి! తన పావన జలాలతో తీర భూముల్ని సశ్యశ్యామలం చేయడమేగాక, తన దరిన ఎన్నో క్షేత్రాల్ని, ఆలయాల్ని, ఆశ్రమాల్ని వెలయింప జేసుకొంది. అటు ప్రజలను లౌకికంగా పాడిపంటలతో, శారీరకంగా పరిపుష్టం చేయడంతోపాటు ఆధ్యాత్మికంగా కూడా చైతన్యవంతుల్ని చేస్తున్నది శ్రీ కృష్ణానది.



ఎన్నో పుణ్యతీర్థాలచెంత, క్షేత్రాల్లో, ఆలయపరిసరాల్లో ప్రవహిస్తున్న కృష్ణానదిలో భక్తప్రజలు స్నానాలు చేస్తున్నందువల్ల పాపవిముక్తులవు తున్నారు. ఇలా ఏడాది పొడవునా, నదీతీరం పొడవునా కృష్ణా సంగమాల్లో నదీ స్నానం చేసినందువల్ల, భక్తుల పాపాలు నదికి సంక్రమిస్తున్నాయి కదా!

ప్రత్యేకంగా **గురువు కన్యారాశిలో** సంచరించే ఏడాదిపాటు కృష్ణానదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇలా పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే విశేష పుష్కరదినాల్లో ప్రారంభంలో 12 రోజులు, చివరి 12 రోజులు లక్షలాదిగా భక్తులు పుష్కర పుణ్యస్నానాలు చేస్తారు. తమ తమ పాపాల్ని పోగొట్టుకుంటారు.


బాగుంది! కానీ, ఇక్కడో మాట!!

**కృష్ణానదిలో తీరంపొడవునా అంతటా లక్షలాది భక్తుల స్నానాలవల్ల సంక్రమించిన పాపాలు, దోషాలు, ఏమవుతాయి. ఎక్కడికి పోతాయి? ఆ కృష్ణమ్మతల్లి తాను స్వీకరించిన మానవుల పాపాల్ని ఎలా పోగొట్టుకొంటుంది? అన్న సందేహ పరంపరలు, ఎన్నో ఆలోచనలు కలుగడం సహజం. కలుగుతాయి కూడ.**

**కృష్ణానదికి భక్తులవల్ల సంక్రమించిన పాపాలు, దోషాలు, కలుషాలు ఏ దేవుడు కూడ, పోగొట్టలేడట! ఏ దేవతకూడ స్వీకరించదట! మరి ఎలా?**

అంటే ఆ నదీమతల్లి! తన పాపాల నిర్మూలనకోసం, యోగులను ఋషులను, అవధూతలను, జగద్గురువులను ఆశ్రయిస్తుందట! వారిని ఆహ్వానిస్తుందట! **ఆ మహాత్ముల స్పర్శవల్ల, స్నానంవల్ల, పానంవల్ల ఇట్టే క్షణకాలంలో ఆ కలుషాలన్నీ మటుమాయం అవుతాయట! ఇలాగ ఆ మహనీయుల స్పర్శవల్ల పవిత్రీకృతమైన కృష్ణానది, మళ్లీ భక్తుల పాపాల నిర్మూలనకు ఉద్యమిస్తుంది.**

అందువల్లే మహనీయుల రాకకోసం కృష్ణమ్మ నిరంతరం ఎదురు చూస్తుందట. ఆ సద్గురువుల స్పర్శకోసం అర్రులు చాస్తుందట కృష్ణానది. అలా నిరంతరం ఎదురు చూడబడే సద్గురువుల్లో ప్రప్రథములు శ్రీదత్తాత్రేయస్వామివారు. స్మరించిన వెంటనే భక్తులను ఆదుకొనే అత్యంత కరుణామూర్తి శ్రీదత్తాత్రేయస్వామి.



**శ్రీ దత్తాత్రేయులు**



త్రిమూర్తి స్వరూపులైన దత్తాత్రేయస్వామి అవతరించిన నాటినుండి నేటివరకు, రేపటివరకు నిరంతరం ఎల్లవేళలా ఆయన నివసించే పుణ్యభూమి, కృష్ణానది జన్మస్థలమైన సహ్యాద్రి పర్వతం. అనసూయామాత, అత్రిమహర్షివారలకు వారి తపోబలంవల్ల, త్రిమూర్తులు ముగ్గురు ఏకమై ఒక్క రూపంతో తమకు తామే దత్తత ఇచ్చుకున్నారు. అందుకే ఆయన 'దత్తాత్రేయుడు' అయ్యాడు. శ్రీదత్తాత్రేయస్వామివారికి అనేక రూపాలు వున్నాయి, కాషాయవస్త్రం, దండకమండలాలతో విరాజిల్లే అవధూత, యోగిరూపమేగాక, అనఘాదేవి (లక్ష్మీదేవి) సమేత అనఘస్వామి పేరుతో పిలువబడు మంగళప్రదమైన గృహస్థాశ్రమరూపం కూడవుంది. అంతేకాదు. పూర్వం యదుమహారాజుకు, ప్రహ్లాదునికి 'అవధూత'గా కనిపించిన శ్రీదత్తాత్రేయస్వామి, ముఖ్యంగా ఈ కలియుగంలో 'అవధూతలు'గానే అవతరించి భక్తులకు దర్శనమిస్తుంటాడు. ఉద్ధరిస్తూనే వుంటాడు.

సహ్యాద్రిలో కృష్ణానదిజన్మస్థలంలో సంచరించే శ్రీ దత్తాత్రేయస్వామి 'పాతాళగంగ' అనబడే కృష్ణానదీతీరంలోని "శ్రీశైలక్షేత్రం"లో వేలాది సంవత్సరాలు తపస్సు చేశారట! శ్రీశైలమల్లికార్జునస్వామివారి ఆలయం ప్రాంగణంలోనే వృద్ధమల్లికార్జునస్వామి ఆలయం పక్కనే దత్తాత్రేయస్వామి తపస్సుచేసిన స్థలాన్ని నేటికీ దర్శించవచ్చు. ఔదుంబరవృక్షం చుట్టూరా వున్న పెద్ద అరుగులాంటి తిన్నె. మేడిచెట్టు, జువ్విచెట్టు, రావిచెట్టు మూడు కలగలిపి పెనవేసుకొని పెరిగిన వృక్షపీఠం. శ్రీదత్తాత్రేయస్వామి వారి తపోపీఠంగా, ఈ వృక్షం దత్తాత్రేయవృక్షంగా, ఔదుంబరవృక్షంగా పిలువబడుతున్నది.

కృష్ణానది (పాతాళగంగ) తీరంలో వెలసిన, ద్వాదశ జ్యోతిర్లింగాలలో అష్టాదశశక్తి పీఠాల్లో ప్రసిద్ధిచెందిన శ్రీశైలక్షేత్రాన్ని గురించి, శ్రీదత్తాత్రేయస్వామివారి ఔదుంబరవృక్షం గురించి, శ్రీపర్వతపురాణం లోను, శ్రీదత్తపురాణంలోను, విస్తృతంగా వర్ణింపబడింది.

**గురువుల గురువు గురుదత్త!**

**జయముల నిత్తువు జయగురుదత్త!!** అని స్తుతింపబడిన గురువులకు గురువైన శ్రీగురుదత్తుడు నేటికీ ఆ వృక్షం క్రింద వుంటూ పాతాళగంగలో నిత్యానుష్ఠానాలు నిర్వహించుకొని, అటు కృష్ణానదినీ, ఇటు క్షేత్రాన్నీ పరమపవిత్రం చేస్తుంటారు.

అలాగే ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో శ్రీదత్తాత్రేయస్వామివారు కృష్ణాతీరంలో వెలసిన **శ్రీశక్తిపీఠం కొల్హాపురంక్షేత్రం**లోని శ్రీమహాలక్ష్మి సన్నిధిలో భిక్ష తీసుకుంటాడట!

ఈ కలియుగంలోనే శ్రీ దత్తాత్రేయస్వామివారు **శ్రీపాదశ్రీవల్లభుడు** పేరుతో గోదావరితీరంలోని పీఠికాపురంలో (శక్తిపీఠం) అవతరించారు. శ్రీపాదులవారు శ్రీశైలంలోని పాతాళగంగలో అనుష్ఠానం చేసుకొంటూ



**శ్రీ పాద శ్రీ వల్లభులు**



ఔదుంబరవృక్షం క్రింద నాలుగునెలలపాటు తపస్సు చేశారట! ఆ తరువాత కర్నాటకరాష్ట్రంలోని కృష్ణానదీతీరంలో "కురువపురం" అనే దివ్యస్థలాన్ని తన తపోభూమిగా చేసుకొని అక్కడే అంతర్హితులయ్యారు. అదే **'కురుగాడి'** లేదా **"కురుగడ్డి".** కృష్ణానదిలోని ఒక లంకప్రాంతం ఇది. **"దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా!"** అనే మంత్రం, కృష్ణానదీమధ్యలోని కురుగడ్డిలో నిరంతరం భక్తుల నోళ్లలో మారుమ్రోగుతూ కృష్ణాతీర్థ జలాలను పవిత్రం చేస్తుంటాయి.

ఇక శ్రీగురుదత్తుని మూడవ అవతారమైన **'శ్రీనరసింహసరస్వతిస్వామివారు'** మహారాష్ట్రలోని కరంజ నగరంలో అవతరించారు. ఈ స్వామివారు మహారాష్ట్రలోనే కృష్ణానదీతీరంలోని



**శ్రీ నరసింహ సరస్వతీ స్వామివారు**

**'ఔదుంబర్'** క్షేత్రంలోను, **నరసోబావాడి (నరసింహవాడి)** క్షేత్రంలోను చాలాకాలం తపస్సు చేశారు. కృష్ణాతీరంలోని ఈ రెండు క్షేత్రాలు, శ్రీదత్తాత్రేయస్వామి నిత్యం భిక్ష తీసుకొనే కొల్హాపురం క్షేత్రానికి దగ్గరలోనే వున్నాయి. ఆ తరువాత కర్ణాటకలోని **'గాణగాపురక్షేత్రం'**లో శ్రీనరసింహ సరస్వతిస్వామి చాలాకాలం వున్నారు. **'గాణగాపురం'** కూడ కృష్ణాతీరంలో వెలసిన ప్రసిద్ధ దత్తక్షేత్రం. కృష్ణాతీరంలోని ఈ క్షేత్రాలన్నింటిలోను, శ్రీనరసింహసరస్వతిస్వామివారి **విమలపాదుకలు, నిర్మలపాదుకలు, నిర్గుణ పాదకల**పేరుతో శ్రీగురుదత్తుడు అర్చించబడుతూనే ఉంటాడు. ముఖ్యంగా ప్రతి మధ్యాహ్నం పూట శ్రీనరసింహసరస్వతిస్వామి గాణగాపుర క్షేత్రంలో కృష్ణానదిలో నిత్యానుష్ఠానం నిర్వహించుకొని, కొన్ని ఇండ్లల్లో భిక్ష తీసుకుంటారని ప్రసిద్ధి! భక్తుల అనుభవంకూడా కృష్ణానదీతీరంలోని గాణగాపురంలో **'ఔదుంబరా! ఔదుంబరా! నరసింహసరస్వతి ఔదుంబరా!'** అనే మంత్రం భక్తుల నోళ్లలో మార్మోగుతూ అటు కృష్ణాతీరాన్ని, భక్తులను పవిత్రం చేస్తుంటుంది. చిట్టచివరకు శ్రీనరసింహసరస్వతిస్వామివారు శ్రీశైలక్షేత్రానికి వెళ్లి పవిత్రకృష్ణానది (పాతాళగంగ)లో **"పూలపల్లకి"**లాగా వున్న తెప్పలో వెళ్లుతూ అదృశ్యమయ్యారనీ, అక్కడికి దగ్గరలోని కదళీవనంలో ఇప్పటికీ ఉన్నారని ప్రసిద్ధి! ఇటీవలికాలంలో అపరదత్తాత్రేయస్వామి అవతారస్వరూపులైన శ్రీగణపతి సచ్చిదానందస్వామీజీ (మైసూరు) వారికి శ్రీశైలంలోని పాతాళగంగలోనే పూలపడవలో దీక్షావస్త్రాలు వచ్చాయని, అక్కడే ఆశ్రమస్వీకారం చేసి, అవధూతగా మారారని ప్రతీతి ఉంది. శ్రీగణపతి సచ్చిదానందస్వామీజీవారు గాణగాపురంలో ఒక దత్తాశ్రమాన్ని ఏర్పాటుచేసి, శ్రీ దత్తాత్రేయస్వామివారి ఎత్తైన శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కృష్ణాతీరంలో విజయవాడ కనకదుర్గమ్మసన్నిధిలో శ్రీగురుదత్తాశ్రమాన్నికూడా స్థాపించి, పుష్కరయాత్రికులకు పుణ్యాలు కల్గిస్తున్నారు శ్రీ శ్రీ శ్రీగణపతి సచ్చిదానందస్వామీజీ!



నూతనంగా నిర్మింపబడుతున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతీ నగరం కృష్ణాతీరంలోనే వుంది. సుమారు వందేళ్లకు పూర్వం **శ్రీవాసుదేవానందసరస్వతిస్వామి** చాతుర్మాస్యవ్రతం చేశారు. ఆ సందర్భంలోనే **"శ్రీకృష్ణాలహరి"** అనే సంస్కృత స్తోత్రాన్ని రచించారు. ఆ స్తోత్రంలో పవిత్రకృష్ణానది మహిమను వర్ణించారు శ్రీవాసుదేవానంద సరస్వతిస్వామివారు. ఈ **"శ్రీకృష్ణాలహరి"** గ్రంథాన్ని తి.తి.దేవస్థానం ఈ కృష్ణాపుష్కరాల సందర్భంగా ప్రచురిస్తున్నది. అపరదత్తాత్రేయస్వామి వారి అవతార స్వరూపులైన వీరికి **"టెంబేస్వామి"** అనే మరోప్రసిద్ధనామం కూడా వుంది. **"శ్రీగురుద్విసాహస్రి"** అనే పేరుతో రెండు వేల సంస్కృత శ్లోకాల్లో **''శ్రీగురుచరిత్ర''**ను లోకానికి అందించిన ఆద్యులు శ్రీ వాసుదేవానందసరస్వతీస్వామివారు.

ఇలా అనాదిగా మహనీయులైన అవధూతలు, పరమయోగులు ఎందరో కృష్ణానదీతీర ప్రాంతాన్ని, ఆ పుణ్యతీర్థజలాల్ని పావనం చేస్తూ లోకకల్యాణం కోసం తమ తమ తపస్సుల్ని ధారపోస్తున్నారు. ఈ ఆగష్టు 12 నుండి కన్యారాశిలో సంచరిస్తున్న గురువును ఆరాధిస్తూ, పవిత్రకృష్ణను కన్నులారా దర్శించుదాం. చేతులారా స్పృశించుదాం. ఆ నదీజలాల్లో స్నాన, ధ్యాన పానాదులను నిర్వహించుకుందాం. పునీతులమవుదాం.

**శ్లో॥ శ్రీపాదస్వామినే నిత్యం, నృసింహగురుయోగినే,**
**దత్తాత్రేయాయ నాథాయ, మంగళం దీనబాంధవే.**

**ఓం శ్రీ గురు దత్తాత్రేయనమః**

**(2016 ఆగష్టు "సప్తగిరి" కృష్ణాపుష్కరసంచికలో ప్రచురితమైన వ్యాసం.)**

# 1౨. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి సాక్షాత్కార వైభవోత్సవం, శ్రీనివాసమంగాపురం



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి
శ్రీ నివాస మంగాపురం **(1970)**

**శ్రీ**నివాసుడు తిరుమలకొండ మీదే కాక, కొండకింద కూడా సాక్షాత్కరించాడంట!

వందేండ్లకిందటి నుంచి వినపడుతున్న మాట ఇది!



నాకు తెలిసిన ఆసక్తికరమైన యథార్థమైన ఈ వింత గాథను మీ ముందు ఉంచుతున్నా. మీరూ చదివి ఆనందించండి.

తిరుపతికి సరిగ్గా పశ్చిమాన పట్టుమని పదిమైళ్లదూరంలో ఉన్న ఒక పల్లెటూరు. ఆ ఊరు బయట, మొండి గోపురంతో, గోడలతో ఉసూరుమంటున్న శిథిలమైన ఆలయం.

“మా తాత ముత్తాతలనుండే అంటే వందల ఏండ్లనుండే ఆ గుడి అలాగే ఉందనీ, పాడుబడిన ఆ గుళ్లో పూర్వం వేంకటేశ్వరస్వామి విగ్రహం ఉండేదనీ, కాని ఇప్పుడా విగ్రహం ఉందో, లేదో, కనీసం ఏ దేవుడి విగ్రహం అయినా ఉందో కూడ తెలియదనీ” ఆ ఊరి జనం అంటున్న మాట!

ఆ గుడి చుట్టూ వున్న గోడలరాళ్లు కాళ్లు వచ్చి కదలిపోయినా, గోపురశిఖరం, బలిపీఠం ధ్వజస్తంభం వానలకు నానుతూ, ఎండలకు ఎండుతూ శిథిలమై నిస్త్రాణంగా ఉంటూ మనసును మెలిపెట్టి పిండుతాయి. అయినా ఆ ప్రాంగణం నడుమభాగన శిలావేదికపై నిర్మింపబడ్డ ప్రధానమైన గుడి, గోడల శిలలు బీటలు వారినా, కొంచం ఎగుడు దిగుళ్లైనా వింత వెలుగు లీనుతూ అందంగానే కనపడుతుంది.

వాకిళ్లే లేని ఆ గుడిమండపం లోనికి వెళ్లాలనీ, లోన గర్భగుళ్లో ఏ ముందో చూడాలన్న తపన ఆసక్తీ ఉన్నా, అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లూ ఎత్తైనపుట్టాలూ నాగజెముడుచెట్లూ, తీగలూ, విచ్చలవిడిగా తిరుగాడుతున్న పెద్ద పెద్ద పాములూ, తేళ్లూ, గబ్బిలాలు. వీటిని చూస్తే చాలు. ఎవరికీ గుండె ధైర్యం చాలేదికాదు.

కాని ఆ శిథిలాలయం ఆరుబయట్లో పగటిపూట మాత్రం పసువులు, మేకలు వాటిని కాచే పసుల కాపరులు మాత్రమే సేదదీరేవారు.

ఇదీ వందల ఏండ్లుగా సాగుతున్న ఆశిథిలాలయ చరిత్ర!

విచిత్రాతి విచిత్రం! క్రీ.శ.1900 ప్రాంతాన ఒక వెర్రిబాగులలాంటి అమాయక స్త్రీ, ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా ఆ గుడి ఆవరణలో ప్రత్యక్షమయ్యింది. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. ఏ ఊరో తెలియదు. ఏం పేరో ఎవరికీ తెలియదు. అడిగినా చెబితే కదా తెలిసేది. అన్నింటికీ వెర్రిచూపులతో కూడిన చిరునవ్వే ఆమె సమాధానం.

నిమ్మపండు లాంటి పసుపు పచ్చని శరీరఛాయ, నుదుటన పెద్ద కుంకుమబొట్టు, నిండుగా కట్టుకున్న ముతకచీర, చేతులనిండా ఆకుపచ్చని మట్టిగాజులు. సగం నెరసిన పెద్ద కొప్పు. చెరగని చిరునవ్వుతో ఏభైఏండ్లు దాటిన యోగినిలాంటి స్త్రీ. పేరే చెప్పని ఆ తల్లికి "తాయారమ్మ" అని ఆ ఊరివాళ్లే పేరు పెట్టుకొని పిలిచేవారు. ఆమె కూడ "ఆ" అని బదులు పలికేది.

ఆ రోజు నుండి ఆ గుడి ప్రాంగణంలోని ఆకులు, అలములు చెత్త చెదారం తీసి వేసి శుభ్రం చేసేది. ఊళ్లోకి వెళ్లి ఇల్లిల్లు తిరిగి బిచ్చం అడిగేది. గుళ్ళో "శ్రీనివాసుడు" ఉన్నాడు. నన్ను పూజ చెయ్యమన్నాడు. ఏదైనా ఇవ్వండి అంటూ నవ్వుతూ అడిగేది, తాయారమ్మ.

కాసులిస్తే వద్దనేది. కొంచం చమురో, కాసిన్ని బియ్యమో, పప్పో, ఉప్పో పెట్టమని అడిగేది. ఇచ్చిన వాటిని ఆనందంగా తీసుకొని ఆ గుడి ముంగిట్లో మూడురాళ్ల పొయ్యిమీద కుండల్లో ఉడికేసేది. అక్కడ వున్న పసులకాపర్లతో కాసిన్ని పాలు అడిగి తీసుకొనేది.

ఆమె ఒక్కతే ఒంటరిగా గుళ్లో అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లను, తీసివేసి, చెత్తను ఊడ్చుకుంటూ కారు చీకటిగా వున్న గర్భాలయంలోనికి వెళ్ళేది. తాటిమట్టల్ని ముట్టించి ఆ వెలుతుర్లో లోపలికి పరికించి చూచింది.

దారిలో బుసలు కొట్టే నాగుల్ని చూస్తూ "ఓరే! నాగా! స్వామికి ఆకలిగా ఉందంట! తప్పుకొండర్రా!" అని మందలించినట్లుగా గొణిగేది. అంతే! ఆ



పాములు పడగలు దించి ఒదిగి ఒదిగి దూరంగా పోయ్యేవి. కొన్నిసార్లు ఇవి మీ కోసమర్రా అంటూ పసులకాపర్లు ఇచ్చిన పాలను వాటికి పెట్టేది. లోపల గర్భగుళ్లో నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని విగ్రహం! చూచింది. పరమానందంతో పరవశించి రెండు చేతులెత్తి దండంపెట్టి సంబరపడింది. శ్రీనివాసా! గోవిందా! అంటూ ఆ నిలువెత్తు స్వామిని చేతికి అందినంతవరకు నీళ్లతో అభిషేకించేది. చమురు దీపం వెలిగించి, తాను ఉడికేసింది నివేదించేది. దానిలో కొంత పసులకాపర్లకు పెడుతూ, మిగిలింది ప్రసాదంగా తాను ఆరగించేది.

ఇదీ ఆనాటినుంచి తాయారమ్మ నిత్యకృత్యం రామనామం, సుమారు నలభైఏండ్ల పాటు ఆ యమ్మకు ఆ గుడితో, ఆ ఊరితో విడదీయ లేని విడదీయగ రాని అనుబంధం ఏర్పడింది.

ఉన్నట్టుండి ఒకరోజు తాయారమ్మ ఇంటింటికి వెళ్లింది!! రేపట్నుంచి నేను రాను, ఒక స్వామి ఎక్కణ్ణుంచో వస్తాడంట! ఆయన శ్రీనివాసుణ్ణి మంత్రాలతో పూజిస్తాడంట! ఇప్పటినుంచి ఈ గుడి వైభవంగా వెలిగిపోతుందంట! ఇవన్నీ **"వెంకటేశ్వరుడే"** నాకు చెప్పి, నన్ను తుంబురుతీర్థం వెళ్లి తపస్సు చేసుకొమ్మన్నాడు. అందుకే రేపట్నుంచి నేను రాను" – అంటూ కనపడిన వాళ్లకందరికీ చెప్పింది. పసులకాపర్లతో చెప్పింది. గుడి ఆవరణలోని పూలచెట్లను, తీగలను స్పృశిస్తూ చెప్పింది.

ఇది రోజూ వుండే సణుగుడేలే! అని అందరూ పెద్దగా పట్టించుకోలేదు. కాని, నిజంగా ఆ మరునాడు నలభైఏండ్ల అనుబంధం ఉన్న తాయారమ్మ కనపణ్ణే లేదు. ఆమె కోసం ఆ ఊరూ, గుడీ, గోపురం మూగగా రోదించాయి.

విచిత్రంగా ఆ మరునాటి సాయంత్రమే కంచి క్షేత్రం నుండి ఒక అర్చకస్వామి వచ్చాడు. ఆ గుళ్ళోని "శ్రీనివాసస్వామి" తనను అర్చించడానికి రమ్మన్నాడని ఆ ఊళ్ళో అందరికీ చెప్పాడు.

ఆ ఊరివాండ్లు ఆశ్చర్యపోతూ, వివరంగా చెప్పండని అడిగారు.

కంచిలో వుంటాను. నా పేరు సుందరరాజస్వామి. మా తండ్రి రాఘవేంద్రాచార్యులు. ప్రతిరోజు రాత్రనక, పగలనక స్వప్నంలో శ్రీనివాసుడు కనపడి, "రా నన్నుద్ధరించు, చీకట్లో ఉన్నాను. పుట్టల్లో చెట్లల్లో ఉన్నాను. వెంటనే వచ్చి పూజించు" అన్నాడు. "స్వామీ! ఏ ఊళ్లో ఉన్నావు చెప్పు". అంటే పలకడు. అందువల్లే నేను తిరుపతియాత్రకు బయలుదేరి కనపడిన ఊరూ, పేటా, కోటా వెదుక్కుంటూ, ఎక్కడైనా శిథిలమైన వేంకటేశ్వరుని ఆలయం కనపడుతుందేమోనని చూస్తూ వస్తున్నాను. ఈనాటి నిద్రలో "ఇదే నయ్యా! నేనుండే ఊరు. ఇదే ఈ గుళ్లోనే వందల ఏండ్లనుంచి వున్నాను. నన్ను ఉద్ధరించి, శాస్త్రోక్తంగా పూజించు" అని గోవిందుడు ఆదేశించాడు అని ఈ విషయాన్ని అర్చకులు సుందరరాజస్వామి, ఆ గ్రామంలోని ప్రతివాళ్లకు చెప్పాడు.

ఆ పల్లెజనం **"తాయారమ్మ"** చెప్పిన మాట గుర్తు చేసుకొని పరమానందపడ్డారు. సరే నంటూ ఊరు ఊరంతా కదలి వచ్చారు. గుడి ఆవరణలోని చెట్లను, పుట్టలను తీసివేశారు. తీగల్ని తీసివేశారు. ఆలయాన్ని వందలకొద్దీ బిందెల నీళ్లతో మండపాన్ని, గర్భాలయాన్ని కడిగి శుభ్రం చేశారు గుడి ప్రాంగణంలో ఆవు పేడతో కల్లాపుచల్లి చక్కగా ముగ్గులు తీర్చారు. పచ్చని అరటి స్తంభాలు, మామిడాకు తోరణాలు అలంకరించారు.

ఒక్క గుడిలో మాత్రమే కాదు. ఆ ఊళ్లోని ప్రతి ఇల్లూ మామిడాకులతో అలంకరించుకొన్నారు. ఊరు ఊరంతా వైభవంగా ఉత్సవ వాతావరణం నెలకొంది.

సరిగ్గా అది 1940వ సంవత్సరం. విక్రమనామ సంవత్సరం ఆషాఢమాసం శుద్ధసప్తమీ గురువారం ఉత్తర ఫల్గుణీ నక్షత్రం కూడిన మంచిరోజు.




అర్చకులు శ్రీసుందరరాజస్వామికి కలలో సాక్షాత్కరించి నిర్ణయించి చెప్పినట్లుగా ఆనాడు **"శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం"** పేరుతో ఘనంగా వేడుక జరుపుకున్నారు.

వందల సంవత్సరాల తర్వాత శాస్త్రోక్తంగా అర్చకులైన శ్రీ సుందరరాజస్వామి వారి చేతులమీదుగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి తొలిపూజ జరిగిన రోజున, ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ చేశారు. పిదప శ్రీవారి గర్భాలయం ముంగిట సుప్రభాతం పఠిస్తూ వందల సంవత్సరాలపాటు యోగసమాధిలో ఉన్న శ్రీ స్వామివారిని మేల్కొలిపారు. ఆ తర్వాత పురుష సూక్త శ్రీ సూక్త భూనీళా సూక్తుల పఠనంతో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ఆవుపాలు, పెరుగు, పసుపు, చందనం, కొబ్బరి నీరు మున్నగు అభిషేక ద్రవ్యాలతో మంగళప్రదంగా అభిషేకం నిర్వహింపబడింది. పిదప సన్నని బంగారు జరీ అంచు ఉన్న తెల్లని పంచె, ఉత్తరీయాన్ని అలంకరించారు. నుదుట తెల్లని పచ్చకర్పూర నామాలు తీర్చిదిద్దారు. వివిధ రకాల పూలమాలలతో శ్రీస్వామివారి నిలువెత్తు మూర్తిని అందంగా మనోహరంగా అలంకరించారు. ఆ తర్వాత సహస్రనామార్చన ధూపదీప నైవేద్య కర్పూర హారతులు ఘనంగా జరిగాయి.

తొలిసారిగా, 1940 జూలై 11వ తేదీ విక్రమనామసంవత్సరం ఆషాఢ శుద్ధసప్తమీ గురువారం నాడు జరిగిన శ్రీనివామంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవ వేడుకల్లో ఆ గ్రామ ప్రజలే కాక, తిరుపతి, పెరుమాళ్లపల్లె, పేరూరు, తొండవాడ, చంద్రగిరి, నరసింగాపురం, మిట్టపాళెం... మున్నగు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. అందరి ఇండ్లలోను పండుగలు చేసుకొన్నారు.

ఆనాటినుండి ఈ ఆలయం దినదినప్రవర్ధమానమవుతూ 1967 ఏప్రిల్ 26వ తేదీన తిరుమల తిరుపతి ఆలయాల ఆధ్వర్యంలోనికి చేరిన ఈ

ఆలయంలో 1980 జూలై నుండి మూడురోజులపాటు కల్యాణవేంకటేశ్వరుని సాక్షాత్కారవైభవోత్సవాలు జరుగుతున్నాయి.




ఆనాటి నుండి నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూ ఉంది. వివాహం కావలసినవారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుందని ప్రసిద్ధి ఉంది.

ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన శ్రీనివాసుడు ఈ ప్రాంతంలో వున్న అగస్త్యమహర్షిని దర్శించాడట. ఆ కల్యాణ దంపతులు తొలినాళ్లతో అగస్త్యుని కోరికపై ఆరునెలలు ఇక్కడవున్నందువల్ల శ్రీస్వామివారు ఇక్కడ **"శ్రీ కల్యాణవేంకటేశ్వరుని"**గా పేరుపొందినాడు.

పూర్వం ఎందరో సిద్ధులు ఉన్నందువల్ల 'సిద్ధకూటం' 'సిద్ధకుట్టి' అనీ, శ్రీనివాసుడు ఉన్నందువల్ల **"శ్రీనివాసపురం"** అనీ **"శ్రీనివాస మంగాపురం"** అనీ **"కల్యాణమంగాపురం"** అని ఈ గ్రామానికి ఎన్నో పేర్లు ఏర్పడ్డాయి.



అయితే ఈ క్షేత్రం ఎప్పుడు ప్రతిష్ఠింపబడిందో తెలియదుకాని 1433 నాటికే ఉచ్ఛస్థితిలో వున్న ఈ ఆలయమూ గ్రామమూ స్వర్ణముఖి, కల్యాణీ, భీమా నదుల ఉధృతమైన వరదల తాకిడికి లోనయ్యాయి.

ఆ తర్వాత 1540లో అచ్యుతరాయలు ఈ గ్రామాన్ని తాళ్లపాకవారికి మాన్యంగా ఇచ్చాడు. అప్పట్లో తాళ్లపాక అన్నమయ్య మనుమడు చిన్నన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఆలయాన్ని ఉద్ధరించాడు. అందువల్లే ఆలయ ప్రవేశద్వారంలో ఇరువైపులా అన్నమయ్య, పెదతిరుమలయ్యల శిల్పాలు దర్శనమిస్తాయి.

ఆ తర్వాత కూడ మరోమారు వరదల తాకిడికిలోనై కాలానికి ఎదురొడ్డి నిలిచిన ఈ శిథిల ఆలయంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరుని విగ్రహంమాత్రం చెక్కు చెదరలేదు.

మళ్లీ వందలఏండ్లు నిర్మానుష్యమై, నిశ్శబ్దగంభీరంగా నిలిచివున్న శ్రీకల్యాణ శ్రీనివాసుని ఆలయం, అజ్ఞాతయోగిని తాయారమ్మ, ఆ తర్వాత అర్చకులు సుందరరాజస్వామి, ఆ తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దిన దినం నవనవోన్మేషంగా అభివృద్ధి చెందింది, చెందుతూనే ఉంది.

అగస్త్యాది ఎందరో మహర్షుల తపోభూమిగా, జగత్కల్యాణ దంపతులు శ్రీపద్మావతీ శ్రీనివాసులు నడయాడిన దివ్యస్థలంగా, కల్యాణ పరంపరలను గుప్పించే ఆధ్యాత్మిక క్షేత్రంగా అలరారుతూ ఉన్న శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమలకు నడిచివెళ్ళే "శ్రీవారిమెట్టు" మార్గంలో నెలవై ఉంది. ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుందాం. సర్వశుభాలను పొందుదాం.

**ఓం అగస్త్యాభ్యర్థితా నీతాశేషజన దృగ్గోచరాయ నమః**

# ౨౦. ఆనందనిలయుని... ఆణివర ఆస్థానం



**శ్రీ శ్రీనివాసః పరదైవతం నః, శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః ।**
**శ్రీ శ్రీనివాసః కులదైవతం నః, శ్రీ శ్రీనివాసః పరమా గతిర్నః ॥**

నిరంతరం నిరంతరాయంగా, రాత్రి బ్రహ్మాదిదేవతల చేతా, పగలు మానవుల చేతా సేవింపబడుతూ, తన కడగంటి చూపులతో అందరినీ సంపూర్ణంగా అనుగ్రహిస్తున్న శ్రీనివాస ప్రభువునకు, సాటిరాగల దేవుడు ఇంకొకడు లేడు, లేనే లేడు. ఆ దేవునికి సాటి ఆ దేవుడే. అలాంటి సర్వజగత్ప్రభువైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొన్నది ఆణివరోత్సవం.

ఇది ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో అంటే కర్కాటక సంక్రాంతినాడు జరుపబడుతుంది. ఈ సంక్రాంతి సర్వసాధారణంగా జూలై 16వ తేదీన వస్తుంది. సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం తొలిరోజున



(జూలై 16న) జరుపబడే ఆస్థానం (కొలువు) కనుక **'ఆణివర ఆస్థానం'** అని పిలువబడుతున్నది.

ఈ ఆణివర ఆస్థానం జరిగేటప్పుడు ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, విశ్వరూపదర్శనం, తోమాలసేవానంతరం స్నపనమండపంలో శ్రీవేంకటేశ్వరస్వామి (కొలువుమూర్తి) ఛత్ర చామర మర్యాదలతో, బంగారుసింహాసనంపై కొలువు దీరగా, దేవస్థాన ఉద్యోగ భృత్య బృందం, శ్రీస్వామివారికి పంచాంగ శ్రవణం చేయిస్తారు. ఆనాటి తిథి, వార, నక్షత్ర విశేషాలతో పాటు, ఉత్సవవిశేషాలు స్వామివారికి వినిపిస్తారు. అంతేగాక ముందునాటి ఆదాయాన్నీ, బంగారం, వెండి నగలు, పాత్రలు మున్నగు సమస్తవస్తువుల విలువను లెక్కలు గట్టి మొత్తం నికరాదాయాన్ని పైసల వరకు కూడ శ్రీస్వామివారికి అత్యంత భక్తిప్రపత్తులతో చదివి వినిపిస్తారు. ముందునాడు దర్శనం చేసుకొన్న భక్తుల సంఖ్యనుకూడ తెలపడం జరుగుతుంది. ఈ విన్నపాలను కొలువు దీరిఉన్న శ్రీస్వామివారు మహాదర్పంగా ఆలకించి, ఆనందిస్తూ, భక్తులను అనుగ్రహిస్తూ ఉంటారు. ఇది ప్రతినిత్యం జరిగే శ్రీవారి ఆస్థానం.

కానీ, రోజూ జరిగే ఆస్థానం కంటే కూడ దక్షిణాయన పుణ్యకాలమైన జూలై 16న జరిగే ఆణివర ఆస్థానం చాల విశిష్టమైంది. తిరుమల ఆలయచరిత్రలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంది.

ప్రతిరోజు మాదిరే దక్షిణాయన సంక్రమణం రోజున (జూలై 16న) ఉదయం శ్రీస్వామివారికి సుప్రభాతం, విశ్వరూప దర్శనం, తోమాలసేవ యథాప్రకారం జరుగుతాయి. అయితే రోజూ జరిగే కొలువు శ్రీనివాసమూర్తికి బంగారు సింహాసనంపై కొలువు జరుపబడదు. తోమాలసేవ అయిన వెంటనే శ్రీదేవి భూదేవేరులతో కూడి ఉన్న శ్రీమలయప్పస్వామికి (ఉత్సవమూర్తులు) శ్రీవిష్వక్సేనుల (శ్రీస్వామివారి సేనాధిపతి) వారికీ ఆలయంలోనే ఏకాంతంగా తిరుమంజనం

(అభిషేకం) జరుపబడుతుంది. పిదప, మొదటి సహస్రనామార్చన, నైవేద్యం (మొదటిగంట) జరుపబడతాయి.

పిదప బంగారువాకిలి ముందుగల తిరుమహామణి (ఘంటా మండపం) మండపంలో బంగారు సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీస్వామివారిని బంగారువాకిలిముందు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. సర్వాభరణాదులతోను, సుగంధపరిమళభరితమైన పుష్పమాలికలతోను, ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరిస్తారు.

శ్రీస్వామివారికి ప్రక్కగా చెరొక పీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీవిష్వక్సేనులవారిని కూడ వేంచేపు చేసి ఆభరణాలతో, పుష్పమాలలతో అలంకరిస్తారు. శిరస్త్రాణాన్ని, ఖడ్గాన్ని ధరించి అత్యంత భయభక్తులతో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞలను అమలు పరచడానికి సిద్ధమై సర్వసన్నద్ధమై ఉంటాడు సేనాధిపతి.

అనంతరం ఆనందనిలయంలోని మూలవిరాట్టునకు, బంగారువాకిలి దగ్గర ఆస్థానంలో వేంచేపు చేసి ఉన్న శ్రీవారి ఉత్సవ మూర్తులకు, సేనాధిపతికి విశేషమైన ప్రసాదాలు ఈ విధంగా నివేదింపబడతాయి.

శ్రీమాన్ పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, అర్చకులు, ఆచార్యపురుషులు, వేదపండితులు, దేవస్థానం శ్రీకార్యనిర్వాహకులు, ఇతర అధికార్లు, దేవాలయ సహాయ కార్యనిర్వహణాధికార్లు, పారుపత్యదార్లు ఛత్రచామరాలతో, మంగళవాయిద్య పురస్సరంగా, వేదపండితులు వేదపారాయణ చేస్తూ వెంటరాగా గమేకార్లు (వంటశాల నుండి ప్రసాదాన్ని నివేదనకు వండి తెచ్చి సమర్పించేవాళ్లు) సిద్ధమై ఉన్న విశేషమైన వంటకాలను (పొంగలి,



చక్కెరపొంగలి, పులిహోర, దధ్యోదనం, ముళహోర, లడ్డు, వడ, అప్పం, దోసె మున్నగువాటిని) నివేదనకు తెస్తారు. విమాన ప్రదక్షిణంలో బంగారుబావి ప్రక్కన ఉన్న వంటశాల నుండి బయలుదేరి ఈ ప్రసాదాలను ఆనందనిలయానికి ప్రదక్షిణం చేస్తూ, వెండివాకిలి ఎదురుగా బయట ఉన్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వెళ్ళి, లోనికి వచ్చి ఆలయ ప్రవేశం చేసి, అటు మూలసన్నిధిలోనూ, ఇటు బంగారువాకిలి దగ్గర ఆస్థానంలోనూ నివేదనకు ఉంచుతారు. రెండుచోట్ల గంటలు మ్రోగుతుండగా ఈ విశేష నైవేద్యం జరుగుతుంది.

ఈ నైవేద్యం అయిన పిదప యోగనరసింహస్వామి ఆలయం ప్రక్కన వున్న 'పరిమళపు అర' దగ్గరనుండి శ్రీమాన్ పెద్ద జియ్యంగార్లు పెద్ద వెండితట్టలో మడతపెట్టి చుట్టగా చుట్టబడిన ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని, ఛత్రచామర మంగళవాయిద్య పురస్సరంగా, ముందు పంచముఖ దివిటీలు వెలుగుతుండగా, సన్నడోలు, పలక, గంటలు మోగుతుండగా, వేదపారాయణాలు సాగుతుండగా, శ్రీమాన్ చిన్నజియ్యంగారు, ఏకాంగులు, దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారి, దేవాలయ ఉపకార్యనిర్వహణాధికారి, సహాయకార్యనిర్వహణాధికారి, పారుపత్యదారు మున్నగు ఆలయఅధికారులు వెంటరాగా, ఆలయం వెండివాకిలి ముందున్న ధ్వజస్తంబానికి ప్రదక్షిణంగా వచ్చి పిదప ఆనందనిలయ విమానానికి ప్రదక్షిణం చేస్తూ వచ్చి నేరుగా ఆనందనిలయంలోని శ్రీస్వామివారి మూలమూర్తుల దగ్గర సమర్పిస్తారు. పెద్దజియ్యంగారు, చిన్నజియ్యంగారు, ఏకాంగులు మాత్రమే ఆనందనిలయ ప్రవేశం చేస్తారు. అర్చకులు వెంటనే కులశేఖరపడి (శ్రీస్వామి వారి ముందు ఉన్న గడప) దగ్గర తెరవేస్తారు. లోపల అర్చక స్వాములు శ్రీజియ్యంగారు సమర్పించిన ఆరు పట్టువస్త్రాల్లో నాలిగింటిని శ్రీవారి మూలమూర్తికి అలంకరిస్తారు. ఒకటి కిరీటానికి, రెండవదాన్ని నందకఖడ్గానికి, మూడవ

దాన్ని పంచగా, నాలుగవ దాన్ని అంగవస్త్రంగా అలంకరిస్తారు. తెర తొలగించిన తర్వాత అర్చకస్వామి శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తి శిరస్సుకు పరివట్టం (పట్టుగుడ్డ) కట్టి పూజా హారతులు చేస్తారు. హారతి అయిన తర్వాత ప్రధాన అర్చకులు తాము ముందుగా తీర్థం స్వీకరించి, శఠారి మర్యాద స్వీకరిస్తారు.

ఆ తర్వాత శ్రీజియ్యంగారు కులశేఖరపడి ఇవతలికి వచ్చి తీర్థం స్వీకరించి, మళ్లీ గడపలోపలికి వెళ్లి శఠారి మర్యాదలు స్వీకరిస్తారు. అట్లే చిన్నజియ్యంగార్లు ఏకాంగి కూడ. (ఆనంద నిలయం లోపల అర్చకులు తప్ప ఇతరులు తీర్థం స్వీకరింపరు). తదుపరి హారతి తీర్థం శఠారి మర్యాదలు, దేవస్థాన కార్యనిర్వాహకులకు, ఆలయ అధికార్లకు, మిరాశిదార్లకు జరుగుతాయి. అందరికీ తీర్థం, చందనం, శఠారి, తాంబూల మర్యాదలు అయిన తర్వాత శ్రీజియ్యంగార్ మిగిలిన రెండు పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని బంగారువాకిలి దగ్గర ఆస్థానంలో వేంచేసి ఉన్న ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకులు ఆ రెండు పట్టు వస్త్రాల్లో ఒకదానిని శ్రీమలయప్పస్వామి వారికి, రెండవ దానిని విష్వక్సేనుల వారికి అలంకరిస్తారు.

పిదప ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో పరివట్టం (తలకు చుట్టూ కట్టే చిన్న పట్టు గుడ్డ) కట్టుకొని శ్రీస్వామివారలపై విష్వక్సేనులపై కుంకుమాక్షతలు చల్లుతారు. ఆ తర్వాత సేనాధిపతివారికి పరివట్టం కట్టి శ్రీస్వామివారికి చల్లిన అక్షతలను విష్వక్సేనులపై చల్లి, శఠారి మర్యాదలు జరుపుతారు.

తర్వాత అర్చకులు శ్రీస్వామివారి ద్వారా తండుల దానం (బియ్యం) దక్షిణ స్వీకరించి **"నిత్యైశ్వర్యోభవ"** అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. తదుపరి అర్చకులు శఠారి మర్యాదలు స్వీకరించి, పిదప స్వామివారికి కొలువు, మంగళహారతి జరుపుతారు. ఈ కొలువులో నువ్వులపిండిని స్వామివారికి నివేదిస్తారు.



ఆ తర్వాత అర్చకులు పెద్దజియ్యంగారికి పరివట్టం కట్టి శ్రీస్వామివారి పాదాలవద్ద ఉంచబడిన శ్రీజియ్యంగారి స్వంత మొహరును (సీలు) జియ్యంగార్ చేతికిచ్చి, దేవస్థానంవారి **"లచ్చన"** అను తాళంచెవుల గుత్తిని, వారి కుడిచేతికి తగిలించి శ్రీస్వామివారికి హారతి జరిపి, తీర్థ, చందన, శఠారి మర్యాదలు జరుపుతారు. తర్వాత బీగంచెవుల గుత్తి శ్రీస్వామివారి పాదాలవద్ద ఉంచబడుతుంది.

అట్లే శ్రీచిన్నజియ్యంగారికి, స్వంత మొహరును చేతికిచ్చి బీగంచెవుల గుత్తిని **'లచ్చన'**ను చేతికి తగిలించి హారతి తీర్థ శఠారి చందనతాంబూల సత్కారాలు జరుపబడుతాయి. ఆ తర్వాత ఏకాంగికి కూడ పైమాదిరే జరుగుతాయి.

ఆ తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున ఉన్నతాధికారి అయిన శ్రీకార్యనిర్వహణాధికారులవారికి మాత్రమే పరివట్టం కట్టి దేవస్థానం మొహరును, బీగంచెవుల గుత్తి **'లచ్చన'**ను చేతికి తగిలించి హారతి, చందనతాంబూల తీర్థ శఠారి సత్కారాలు జరుగుతాయి.

పిదప ఏకాంగి తలకు పరివట్టం కట్టుకొని ఆస్థానంలో వేంచేసి ఉన్న భక్తులచేత శ్రీస్వామివారికి కానుకలను వసూలు చేసి, కార్యనిర్వాహకులకు సమర్పిస్తాయి. ఆయన వాటిని ఒక సంచీలో పెట్టి సీలు చేసి, వెండితట్టలో తలపై పెట్టుకొని వెళ్లి, శ్రీవారిహుండీలో సమర్పిస్తారు.

ఏకాంగి వారికి శఠారి మర్యాదలైన తర్వాత, శ్రీకార్యనిర్వాహకులకు హారతి, తాంబూలం, తీర్థ, శఠారి మర్యాదలు జరుగుతాయి. ఆ తర్వాత దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులకు, సభ్యులకు, సంయుక్త కార్యనిర్వాహకులకు, తిరుమల ఆలయ ఉపకార్యనిర్వాహకులకు, సహాయకార్యనిర్వహ ణాధికారి, పారుపత్యదారులకు, హారతి శఠారి తాంబూల మర్యాదలు జరుగుతాయి.

పిదప గమేకార్, మహంతు, మైసూరురాజా, తాళ్లపాకం, తరిగొండవారి హారతులు జరుగును. ఆ తర్వాత అక్కడికి వచ్చిన భక్తులందరి తరుపున ఒక్కొక్క రూపాయి వసూలు చేసి అందరికి కలసి **"రూపాయి హారతి"** ఇవ్వ బడుతుంది. ఈ హారతికి వసూలు కాబడిన రూపాయలను వెంటనే కార్యనిర్వాహకుల సమక్షంలో ఖజానాకు జమ చేయబడుతుంది.

మళ్లీ చివర్లో శ్రీజియ్యంగారికి, శ్రీకార్యనిర్వహణాధికారికి మాత్రమే పరివట్టం కట్టబడి శఠారిమర్యాదలు ఇవ్వబడతాయి.

అనంతరం శ్రీస్వామివారికి నివేదింపబడిన ప్రసాదాలు వగైరా, వారి వారి స్థానీయ హోదాను బట్టి వరుసగా ప్రసాద వితరణ జరుగుతుంది. ఆ తర్వాత, భక్తులకు కూడ ప్రసాదం పంచబడుతుంది. ఈ ఆణివర ఆస్థానం రోజున ఆర్జిత ఉత్సవాలు జరుపబడవు.

పిదప, శ్రీస్వామివారు దేవేరులతో కూడి ఆ మండపంలోనే (రెండవగంట) మధ్యాహ్నం నైవేద్యం అయ్యేంతవరకు ఉంటారు. తర్వాత ఆ సాయంత్రం తిరుమల పురవీథులగుండా రమణీయంగా అలంకరింపబడ్డ **పుష్పపల్లకి** లో అత్యంత వైభవంగా ఊరేగింపబడతారు.

ఈ పుష్పపల్లకీ వైభవం చూడవలసిందేగాని వర్ణింప సాధ్యం కాదు. ఉత్సవానంతరం శ్రీస్వామివారు దేవేరులతో ఆలయప్రవేశం చేస్తారు.

**మ॥ కుడి హస్తం బిటు చూపుచందం బిది వైకుంఠం బనే యందమో!**
**జడధి వ్రాత పరీత భూ భవన రక్షా దక్షిణంబైన నీ**
**యడుగుల్ చూడు మనేవొ? కాక యొక ఒయ్యారంబొ? సందేహమై**
**యడిగేన్, ఆనతి యిమ్ము వేంకటనగాధ్యక్షా! జగద్రక్షకా!!**

**–అజ్ఞాతకవి**

* * *